
కె.శరత్‌బాబు


కృష్ణారెడ్డి

ఎన్‌జీవో సంఘ జిల్లా కార్యవర్గం ఎన్నిక

7

- అధ్యక్షుడిగా శరత్‌బాబు, కార్యదర్శిగా కృష్ణారెడ్డి ఏకగ్రీవం
- వారిద్దరూ నాల్గోసారి ఎన్నిక
- అట్టహాసంగా ప్రమాణ స్వీకారం
- ఒంగోలులో భారీ ర్యాలీ


వివరాలను వెల్లడిస్తున్న సీఐ రామకోటయ్య

కరెంటు తీగల దొంగలు అరెస్టు

- రూ.3.85 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం

7

కొండపి మండలంలోని ఓ విద్యుత్ అధికారి వసూల్ రాజా అవతారం ఎత్తాడు. పైసలిస్తేనే పనిచేస్తున్నాడు. వ్యవసాయ, పారిశ్రామిక కనెక్షన్‌లకు భారీ మొత్తంలో డిమాండ్ చేస్తున్నాడు. కొందరు డబ్బులు చెల్లించినా మరికొంత కావాలని పట్టుబడుతున్నాడు. దీంతో రైతులు, పారిశ్రామికవేత్తలు బెంబేలెత్తిపోతున్నారు. పలువురు ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు చేస్తున్నారు. అయినప్పటికీ ఆ అధికారి తీరు మార్చుకోకపోవడం వివాదాస్పదమైంది. ఆర్నెల్లుగా ఈయన సాగిస్తున్న అవినీతి బాగోతంపై ఎట్టకేలకు ఉన్నతాధికారులు కదిలారు. మంగళవారం కొండపికి వచ్చి ప్రత్యేకంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్‌లకు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని కోరడం చర్చనీయాంశమైంది.



విద్యుత్ శాఖలో వసూల్ రాజా

ప్రతి పనికీ రేటు నిర్ణయించి వసూలు చేస్తున్న అధికారి



కొండపి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొండపి మండలంలో సాగునీటి వనరులు అంతంతమాత్రమే. వర్షాధారంగానే రైతులు ఎక్కువగా పంటలు సాగు చేస్తుంటారు. ఇటీవల బోర్ల కింద విస్తీర్ణం పెరిగింది. దీంతో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు డిమాండ్ ఏర్పడింది. దీన్ని ఆసరా చేసుకొని విద్యుత్ శాఖ మండల అధికారి ఒకరు అందిన కాడికి దండుకుంటున్నారు. ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి దోచుకుంటున్నారు. వ్యవసాయ కనెక్షన్ల కోసం మండలంలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకూ 135 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అంతకుముందు

మిగతా 6వ పేజీలో

- వ్యవసాయ కనెక్షన్‌కు రూ.70వేల నుంచి రూ.లక్ష డిమాండ్
- పారిశ్రామిక అవసరాలకు పెద్దమొత్తంలో కలెక్షన్
- నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య కనెక్షన్‌లు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదులు
- అయినా మారని అధికారి తీరు

ఇంకొకరు..

స్క్రబ్ టైఫస్‌తో మరో మహిళ మృతి

- రెండుకు చేరిన మరణాలు
- కొత్తగా నాలుగు కేసులు నమోదు


ఒంగోలులో కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్క్రబ్ టైఫస్ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. సంతనూతలపాడు మండలం రుద్రవరం గ్రామానికి చెందిన నాగేంద్రం (54) అనే మహిళ గుంటూరులోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. నాలుగురోజుల క్రితం ఎర్రగొండపాలెంకు చెందిన మహిళ ఇదే మహమ్మారి బారిన పడి ప్రాణాలు విడిచారు. దీంతో మృతుల సంఖ్య రెండుకు చేరింది. మంగళవారం జిల్లాలో కొత్తగా నాలుగు స్క్రబ్ టైఫస్ కేసులు వెలుగు చూశాయి. అందులో ఒంగోలు, పొదిలి, కొనకనమిట్లలలో ఒక్కొక్కటి ఉన్నాయి. వారంతా ఒంగోలు రిమ్స్‌లో చేరారు. బేస్తవారపేటకు చెందిన ఓ మహిళను మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన మరొక కేసు ఒంగోలులో నమోదైంది. ఇప్పటికే నలుగురు ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. అందులో ఒకరు కోలుకొని వైద్యశాల నుంచి డిశ్చార్జి అయ్యారు.


నాగేంద్రం (ఫైల్)



ప్రజల్లో ఆందోళన

జిల్లావ్యాప్తంగా స్క్రబ్ టైఫస్ కేసులు నమోదవుతుండటంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది. రెండు రోజుల క్రితం దర్శి ప్రాంతంలో ఒక కేసు రాగా స్క్రబ్ టైఫస్‌గా నిర్ధారణ అయింది. ఇలా జిల్లావ్యాప్తంగా ఏదో ఒక ప్రాంతంలో పొలాల్లో ఉండే నల్లపురుగు కుట్టడం ద్వారా అక్కడ మచ్చలు ఏర్పడి విపరీతమైన జ్వరంతో బాధపడుతున్నారు. అనంతరం వివిధ ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మంగళవారం రాత్రి ఒంగోలులోని రిమ్స్ వైద్యాధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు.


దర్శి పట్టణం వ్యూ

దర్శి, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): దర్శి మునిసిపాలిటీ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు అమృత్ పథకం అమలుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఎన్నో సంవత్సరాలుగా వాయిదా పడుతూ వచ్చి తాజాగా టెండర్లు పిలవడంతో లైన్‌క్లియర్ అయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కేంద్రప్రభుత్వం పట్టణాలకు జనాభాకు సరిపడా మంచి నీరు అందించేలా పథకాన్ని రూపకల్పన చేశారు. 'అమృత్' అమలైతే దర్శి మునిసిపాలిటీలోని ప్రజలకు తాగునీటి సమస్య పూర్తిగా తగ్గిపోతుంది. ప్రస్తుతం ఎన్‌ఏపీ రక్షిత పథకం ద్వారా నీరందిస్తున్నారు. అధిక శాతం పట్టణ ప్రజలకు ఇస్తున్నందున పథకంలోని శివారు గ్రామాలకు సక్రమంగా అందడం లేదు. అమృత్ పథకం అమలైతే

దర్శికి తీపికబురు

- 'అమృత్' అమలుకు లైన్‌క్లియర్
- టెండర్లు పిలిచిన అధికారులు

అమృత్ పథకం కింద నిధులు విడుదల చేసింది. ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలన్నదే దీని ప్రధాన ఉద్దేశం.

30 ఏళ్లకు సరిపడా రూపకల్పన

దర్శి మునిసిపాలిటీలో 40వేల మందికిపైగా జనాభా ఉన్నారు. పట్టణ సమీపంలోని పులిపాడు చెరువును మంచినీటి చెరువుగా మార్చి ఫిల్టర్‌బెడ్లు ఏర్పాటు చేసి శుద్ధిజలాలను పైపులైన్ల ద్వారా ఇంటింటికీ కొళాయి ద్వారా అందిస్తారు. రోజుకు 13 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధిచేసేవిధంగా పథకాన్ని ఏర్పాటు చేస్తున్నారు. 30 సంవత్సరాల వరకు పెరిగే

గతంలో టెండర్ పిలిచి వదిలేశారు

అమృత్ పథకం కింద దర్శి మునిసిపాలిటీకి రూ.130.60 కోట్లు మంజూరయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలోనే టెండర్లు పిలిచారు. అప్పటి పాలకుల అసమర్థతతో టెండర్లు ఖరారైనప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని మార్పులుచేసి పథకం ప్రారంభానికి శ్రీకారం పలికారు. తాజాగా ఈనెల 6న టెండర్లు పిలిచారు. ఈనెల 2న టెండర్లు ఓపెన్ చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. టెండర్లు ఖరారైన తర్వాత పనులు ప్రారంభమవుతాయని మునిసిపల్ ఈఈ శ్రీనివాస్ సంజీవ్ తెలిపారు.

ఎన్‌ఏపీ పథకం నీరు పూర్తిగా గ్రామీణ ప్రాంతాలకు వినియోగించే అవకాశం ఉంటుంది. తద్వారా పల్లె ప్రజలకు తాగునీటి సమస్య తగ్గుతుంది.



గ్రామీణ రోడ్లకు మహర్దశ

- జిల్లాకు రూ.95.55కోట్లు మంజూరు
- కేంద్ర పథకం సాస్కి నిధులతో పనులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరాదరణకు గురైన ఈ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కేంద్ర పథకమైన స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (సాస్కి) నిధులను మంజూరు చేసింది. అందులో జిల్లావ్యాప్తంగా 210.87 కిలోమీటర్ల రోడ్ల పునర్నిర్మాణానికి రూ.95.55 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధుల ద్వారా జిల్లాలో 37 పనులు చేపట్టనున్నారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ నుంచి పంపిన ప్రతిపాదనలకు అనుగుణంగా ప్రభుత్వం ఆ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. అత్యధికంగా కొండపి నియోజకవర్గంలో 9 రోడ్లకు రూ.22.71 కోట్లు ఇచ్చింది. మార్కాపురం నియోజకవర్గంలో నాలుగు రోడ్లకు రూ.10.20 కోట్లు, కనిగిరి నియోజకవర్గంలో నాలుగు రోడ్లకు రూ.11.84 కోట్లు, గిద్దలూరు నియోజకవర్గంలో నాలుగు రోడ్లకు రూ.10.24 కోట్లు, దర్శి నియోజకవర్గంలో మూడు రోడ్లకు రూ.10.17 కోట్లు కేటాయించింది. ఒంగోలు నియోజకవర్గంలో మూడు రోడ్లకు రూ.9.39 కోట్లు, ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో మూడు రోడ్లకు రూ.10.64కోట్లు, సంతనూతలపాడు నియోజకవర్గంలో ఏడు రోడ్లకు రూ.10.26 కోట్లు మంజూరు చేసింది.

డీఈవోగా రేణుక

బోయపాలెం డైట్‌కు కిరణ్‌కుమార్ బదిలీ

బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయనపై అనేక ఆరోపణలు



ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖాధికారిగా సీవీ రేణుక నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆమె ప్రస్తుతం గుంటూరు డీఈవోగా ఉన్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేస్తున్న ఎ.కిరణ్‌కుమార్ గుంటూరు జిల్లా బోయపాలెం డైట్‌కు బదిలీ అయ్యారు. కిరణ్‌కుమార్ డీఈవోగా గత ఏడాది అక్టోబరు 26న బాధ్యతలు స్వీకరించారు. 14 నెలలపాటు ఆయన పనిచేశారు. ఆరంభం నుంచే ఆయన వ్యవహారశైలిపై అనేక ఆరోపణలు, విమర్శలు వచ్చాయి. బాధ్యతలు స్వీకరించిన వారంరోజుల్లోనే అప్పటి కలెక్టర్ అన్సారియా నిర్వహించిన సమావేశానికి గైర్హాజరవడంతో షోకాజ్ నోటీసు జారీచేశారు. ఆతర్వాత కూడా ఆయన వ్యవహారశైలిపై అనేక విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఆయన సక్రమంగా వ్యవహరించలేదన్న ఆరోపణలు వచ్చాయి. బదిలీలను కోరుకునే సమయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని అప్పట్లో ఉపాధ్యాయులు ధ్వజమెత్తారు. మరోవైపు ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇచ్చే విషయంలో కూడా కిరణ్‌కుమార్‌పై పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. అందుకోసం పెద్దమొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని విద్యాశాఖ

మిగతా 6వ పేజీలో

పకడ్బందీగా టెట్ నిర్వహించాలి

- అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం నుంచి జరగనున్న ఏపీ టెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో మంగళవారం పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలకు 810 మంది అభ్యర్థులు హాజరుకానుండగా అందుకోసం ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయన్నారు. అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కేంద్రంలోకి సెల్‌ఫోన్లు ఇతర ఎలక్ర్టానిక్ పరికరాలను నిషేధించామన్నారు. ఏపీ టెట్‌కు ఉదయం 510 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 300మంది హాజరవుతారన్నారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో డైట్ ప్రిన్సిపాల్ ఎస్.సుబ్బారావు, డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వరరావు, ఏడీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



17న ఒంగోలుకు శాసనసభ అంచనాల కమిటీ

- కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ ఈనెల 17వతేదీన ఒంగోలుకు వస్తుందని కలెక్టర్ రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 సాయంత్రం ఆరు గంటలకు కమిటీ సభ్యులు నెల్లూరు నుంచి రోడ్డుమార్గాన బయల్దేరి రాత్రికి ఒంగోలు చేరుకుని ప్రభుత్వ అతిథి గృహంలో బస చేస్తారన్నారు. 17వతేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై 2019-20, 2021-22 ఆర్థిక సంవత్సరాల బడ్జెట్ అంచనాలపై సమీక్షిస్తారన్నారు. అనంతరం కమిటీ గుంటూరు బయల్దేరి వెళ్తుందని తెలిపారు.

పులులెన్ని?

నల్లమలలో మొదటిదశ లెక్కింపు పూర్తి

- అటవీ ప్రాంతంలో ఈనెల 1 నుంచి 8 వరకు ప్రక్రియ
- జనవరిలో రెండో దశ ఉండే అవకాశం
- అప్పుడు కెమెరా ట్రాపింగ్ ద్వారా లెక్కింపు




అడవిలో పులి పాదముద్రలు వీడియో తీస్తున్న అటవీ సిబ్బంది (ఫైల్)

త్రిపురాంతకం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలో పులుల లెక్కింపు ప్రక్రియ మొదటి దశ ముగిసింది. దేశవ్యాప్తంగా నాలుగేళ్లకొకసారి నిర్వహించే జాతీయ పులుల గణన (ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్) ఈ నెల 1న ప్రారంభమై 8వ తేదీ వరకూ సాగింది. మొత్తం ఈ కార్యక్రమాన్ని మూడు దశల్లో నిర్వహించనున్నారు. మొదటిదశ ఫీల్డ్ డేటా సేకరణ, రెండో దశలో కెమెరా ట్రాపింగ్, మూడో దశలో డేటా అనాలసిస్, అంచనా నివేదిక ద్వారా మొత్తం లెక్కింపు చేపడతారు. అనంతరం దేశవ్యాప్తంగా ఉన్న పులుల సంఖ్యను ప్రకటిస్తారు.

మొదటి దశలో చేసింది ఇదీ..

ఫీల్డ్ డేటా సేకరణకు నాగార్జునసాగర్- శ్రీశైలం పులుల అభయారణ్యం.. మార్కాపురం, గిద్దలూరు అటవీ డివిజన్ పరిధిలోని సిబ్బంది, బీట్, రేంజ్ అధికారులు కలిసి పనిచేశారు. మొదటి దశలో ముందుగా నిర్ణయించుకున్న రేఖాంశ మార్గాలను అనుసరించి నడుస్తూ పాదముద్రలను గుర్తించారు. జంతువుల విసర్జనలు, రాలిపడిన వెంట్రుకలు, గర్జనలు, శబ్దాల

మిగతా 6వ పేజీలో

మంత్రి నిమ్మల పర్యటన వాయిదా

ఒంగోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు వెలిగొండ పర్యటన వాయిదా పడింది. ప్రాజెక్టు పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించేందుకు ఆయన జిల్లాకు వస్తున్నట్లు ఆ ప్రాజెక్టు అధికారులకు సోమవారం సమాచారం అందింది. విజయవాడ నుంచి మంగళవారం రాత్రికి బయల్దేరి దోర్నాల వచ్చి అక్కడ బస చేసి బుధవారం ఉదయం ప్రాజెక్టు పనుల పరిశీలన, అధికారులతో సమీక్ష చేస్తారని షెడ్యూల్ ఇచ్చారు. తదనుగుణంగా ఏర్పాట్లు చూడాలని అధికారులను మంత్రి కార్యాలయం ఆదేశించింది. ఆమేరకు ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేపట్టగా మంత్రి పర్యటన వాయిదాపడినట్లు వారికి మంగళవారం మధ్యాహ్నం సమాచారం వచ్చింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మంగళవారం సాయంత్రం నదుల అనుసంధానంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్ష ఉంది. సమావేశం ముగిసిన

మిగతా 6వ పేజీలో

వేగం పెరగదు.. కొత్త రైళ్లు రావు

- గిద్దలూరులో రైల్వే ప్రయాణికుల ఇక్కట్లు

6

మాతృమరణాలను అరికట్టాలి

- వైద్యశాఖ అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

7

పక్కా గృహాల కోసం సర్వే గడువు పొడిగింపు

విద్యుత్ శాఖలో వసూల్ రాజా

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకొన్న వారికి విద్యుత్ కనెక్షన్‌లకు సంబంధించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇదే అదనుగా ఆర్నెళ్ల క్రితం మండలానికి వచ్చిన విద్యుత్‌శాఖ అధికారి వసూళ్లకు తెరతీశాడు. మండలంలోని శివారు గ్రామమైన కోయవారిపాలెంకు చెందిన రైతును రూ.70వేల వరకూ డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీంతో ఆయన ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తమ వ్యవసాయ కనెక్షన్‌కు వైర్లు, స్తంభాలు వచ్చాయని తెలుసుకున్న కట్టావారిపాలెంనకు చెందిన ముగ్గురు రైతులు సదరు అధికారిని కలవగా ఆయన పైసలిస్తేనే పనిచేస్తానని చెప్పాడు. దీంతో వారు రూ.40వేలు చెల్లించారు. మరోవైపు నాయకులు, ఉన్నతాధికారులతో సిఫార్సు చేయించుకున్నారు. అయినప్పటికీ ఆ అధికారి నుంచి ఆశించిన స్పందన కరువైంది. ఇలా అనేకమంది రైతులు ఆయన ధనదాహాన్ని తట్టుకోలేక అల్లాడిపోతున్నారు.

నిబంధనలు తూచ్

అక్రమ సంపాదనలో మునిగితేలుతున్న సదరు అధికారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. డబ్బులు ఇచ్చిన వారికి వెంటనే పనిచేస్తూ మిగిలిన వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ప్రజాప్రభుత్వం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తుండగా కొండపి మండల విద్యుత్ అధికారి వారిని కూడా డబ్బుల కోసం వేధిస్తున్నాడు. పరిశ్రమలకు సింగిల్ ఫేజ్ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.3లక్షలు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. వాణిజ్య అవసరాలకు వాడుకునే త్రీఫేస్ మీటర్‌కు రూ.5వేలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొండపిలోని ఓ కమర్షియల్ కాంప్లెక్స్ యజమాని నుంచి రూ.20వేలు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా 8 కనెక్షన్‌లు ఇచ్చారు. నిబంధనల ప్రకారం నాలుగు మీటర్ల కంటే ఎక్కువ ఉంటే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలి. కానీ అందుకు భిన్నంగా వ్యవహరించడం ఆరోపణలకు బలాన్నిస్తోంది. ఇది మచ్చుకు ఉదాహరణ మాత్రమే ఇలాంటి వ్యవహారాలు ఇంకా అనేకం ఉన్నాయి.

నాయకులు, ఉన్నతాధికారులకు వాటాలంటూ గుంజుడు

'విద్యుత్ కనెక్షన్లు ఊరికే రావు నాయనా.. నేను నాయకులు, ఉన్నతాధికారులకు వాటాలు ఇవ్వాలి. మీరు నేను అడిగినంత చెల్లిస్తేనే పని అవుతుంది నాయనా!' అంటూ ఆ అవినీతి అధికారి తన వద్దకు పనికోసం వెళ్లే వారితో కరాఖండిగా చెబుతున్నారు. దీన్ని కొందరు తమ సెల్‌ఫోన్‌లో వాయిస్ రికార్డు కూడా చేశారు. సదరు అధికారి వ్యవహార శైలి రోజురోజుకూ శ్రుతిమించుతుండటంతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు పెద్దఎత్తున ఫిర్యాదులు వెళ్లాయి. వారి ఆదేశాలతో కందుకూరు ఈఈ ఎ.వీరయ్య, సింగరాయకొండ డీఈఈ పి.యుగంధర్ రంగంలోకి దిగారు. మంగళవారం కొండపి వచ్చి విద్యుత్‌శాఖ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో హెచ్చరించినట్లు తెలిసింది.

డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయండి

కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లను ప్రాధాన్యత క్రమంలో ఇస్తామని ఈఈ ఎ.వీరయ్య, డీఈఈ యుగంధర్ తెలిపారు. ఎవ్వరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. లంచం అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది వ్యవసాయ కనెక్షన్‌ల కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు అనేకమంది రైతులు ఇటీవల ఎస్‌ఈకి ఫోన్‌లు చేసి ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మండలంలో 135 వ్యవసాయ కనెక్షన్‌లు పెండింగ్‌లో ఉన్నాయని వారు చెప్పారు. ప్రాధాన్యతా క్రమంలో కనెక్షన్‌లు ఇస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఎస్‌ఈ సెల్‌ఫోన్ నంబర్ 94408 11748, కందుకూరు ఈఈ నంబర్ 94931 74270, సింగరాయకొండ డీఈఈ 94408 17498 నంబర్లలో ఫిర్యాదు చేయాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న సదరు అవినీతి అధికారి కూడా తన సెల్‌ఫోన్ నంబర్‌ను ప్రకటించి ఫిర్యాదు చేయాలని కోరడం విడ్డూరంగా ఉంది.

పులులెన్ని?

(5వ పేజీ తరువాయి)

ఆధారంగా డేటా నమోదు చేశారు. జీపీఎస్ ఆధారిత వివరాలు కూడా అందులో పొందుపరిచారు. పులులతో పాటు జింకలు, పందులు, కుందేళ్లు, ఇతర శాఖాహార జంతువులను కూడా ఇదేసమయంలో లెక్కించారు. వన్యప్రాణుల నివాస పరిస్థితులను కూడా ఈ విడత సేకరించారు. అంటే వాటి నివాస ప్రాంతాల్లో నీటి వనరులు, గడ్డి, వేటాడే జంతువులకు లభ్యమయ్యే ప్రాంతాలు, మానవ జోక్యం ఉండే ప్రాంతాలను గుర్తించారు. రెండో విడత మరికొంత సమాచారాన్ని సేకరిస్తారు.

కెమెరా ట్రాపింగ్ ద్వారా రెండో దశ

పులుల లెక్కింపులో అత్యంత కీలకమైనది రెండో దశ. అడవి గుండా పులులు వచ్చే మార్గాల్లో కెమెరాలు అమరుస్తారు. ఇవి 24 గంటలూ పనిచేస్తాయి. ప్రక్రియ ప్రారంభమైన రోజు నుంచి 30 లేదా 60 రోజులపాటు ఈ కెమెరాల్లో నిక్షిప్తమైన ఫొటోల ఆధారంగా లెక్కింపు ప్రక్రియ చేస్తారు. రాత్రిళ్లు కూడా ఫొటోలు కనిపించేలా సాంకేతికపరమైన జాగ్రత్తలతో ఈ కెమెరాలను అమరుస్తారు. దీనిద్వారా పులుల కదలికలతోపాటు వాటి ప్రవర్తన కూడా తెలుసుకునే వీలు కలుగుతుందని అటవీ అధికారులు చెప్తున్నారు.

డేటా అనాలసిస్‌తో మూడో దశ

మూడో విడతలో సేకరించిన డేటా అనలసిస్‌తో ఉన్నతాధికారులు అంచనా వేసి నివేదిక తయారు చేస్తారు. కెమెరాలో కనిపించిన ప్రతి పులిని ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సహాయంతో పరిశీలిస్తారు. తద్వారా ప్రతి పులికీ ఒక గుర్తింపు నంబరు కేటాయిస్తారు. మొత్తం ప్రక్రియ పూర్తికి మరో మూడునెలలు పట్టే అవకాశం ఉంది. అనంతరం పులుల పూర్తి సంఖ్యను అటవీశాఖ ప్రకటిస్తుంది.

వేగం పెరగదు.. కొత్త రైళ్లు రావు

● గిద్దలూరులో రైల్వే ప్రయాణికుల ఇక్కట్లు



గిద్దలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వే లైను మీటరు గేజ్ నుంచి బ్రాడ్‌గేజ్‌గా మార్చారు. ఎలక్ట్రిఫికేషన్ పూర్తయింది. డబ్లింగ్ పనులు కూడా సగానికిపైగా పూర్తయ్యాయి. కానీ రైళ్ల వేగం మాత్రం పెరగడం లేదు. ఒకటి, అర తప్ప కొత్త రైళ్ల జాడ కూడా లేదు. ఉన్న పాత రైళ్లలోనే బెర్తులు, సీట్లు దొరకక నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు పుణ్యమా అని వందేళ్లనాటి మీటరు గేజ్ మార్గాన్ని గుంటూరు నుంచి గిద్దలూరు మీదుగా గుంతకల్లు వరకు బ్రాడ్‌గేజ్‌గా మార్చారు. కాలక్రమేణ ఈ రూటులో ఎలక్ట్రిఫికేషన్ కూడా పూర్తయింది. ఆ తరువాత డబ్లింగ్‌కు నిధులు మంజూరు కాగా గుంటూరు నుంచి దిగువమెట్ట వరకు సుమారు 200 కిలోమీటర్ల మేర నిర్మాణ పని పూర్తయింది. దిగువమెట్ట నుంచి గుంతకల్లు వరకు ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. అయితే రైళ్లలో వేగం మాత్రం పెరగడం లేదు. గంటకు 50 కిలోమీటర్లు కూడా వెళ్లకపోవడం గమనార్హం. గిద్దలూరు నుంచి విజయవాడకు సుమారు 235 కిలోమీటర్లు ఉండగా దాదాపు అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్లేందుకు 5 గంటలకుపైగా పడుతుందంటే గంటకు సగటు వేగం 50 కిలోమీటర్లు కూడా దాటడం లేదు. కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు అయితే 6 గంటల సమయం పడుతున్నది.

● కొత్త రైళ్ల కోసం ఎదురుచూపులు

విజయవాడ - గుంటూరు - గిద్దలూరు - గుంతకల్లు రైలు మార్గంలో ట్రాఫిక్ పెద్ద ఎత్తున ఉంటున్నప్పటికీ కొత్త రైళ్ళను మాత్రం రైల్వేశాఖ ప్రవేశపెట్టడం లేదు. ఒకటీ అర మినహా కొత్త రైళ్ళను ప్రవేశపెట్టకపోవడంతో సీట్లు, బెర్తులు దొరకక ఒకరిపై ఒకరు నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. దాంతో నిలబడలేని ప్రయాణికులు, వృద్ధులు, చిన్నారులు, మహిళలు చార్జీల ఎక్కువైనా ఆర్టీసీ బస్సుల్లో, మరికొందరు ప్రైవేటు వాహనాల్లో వెళుతూ జేబులను గుల్ల చేసుకుంటున్నారు. విజయవాడకు అనేక రైళ్లు తిరుగుతున్నప్పటికీ సీట్లు దొరకక బస్సుల్లో ఎక్కే ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఒక్క గిద్దలూరు డిపో నుంచే విజయవాడకు రోజురోజుకు సర్వీసుల సంఖ్య పెంచుతున్నారు. నంద్యాల నుంచి గిద్దలూరు మీదుగా విజయవాడకు ఫాస్ట్ ప్యాసింజర్ లేదా ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలని దశాబ్ద కాలంగా కోరుతున్నప్పటికీ ఈ విజ్ఞప్తులు ప్రజాప్రతినిధుల, రైల్వే అధికారుల చెవికి ఎక్కడం లేదు. విజయవాడ నుంచి గిద్దలూరు, నంద్యాల, గుంతకల్లు మీదుగా ముంబాయికి, విజయవాడ నుంచి గిద్దలూరు, రేణిగుంట మీదుగా చెన్నైకి, గుంతకల్లు నుంచి విశాఖపట్టణంకు కొత్త రైలు సర్వీసులు కావాలని ఏళ్ల తరబడి ప్రయాణికులు కోరుతున్నప్పటికీ అధికారుల చెవికి ఎక్కడం లేదు. విజయవాడ నుంచి మంత్రాలయానికి, రాయచూరుకు, కర్నూలుకు గతంలో కొన్ని నెలలపాటు ప్రయోగాత్మకంగా తిప్పిన 3 రైళ్ల సర్వీసులను తరువాత కొనసాగించకపోవడం విమర్శలకు తావిస్తోంది. పూర్తి ఆక్యూపెన్సీతో ఈ రైళ్ళు తిరిగినప్పటికీ సరిపడినంత ఆదాయం వచ్చినప్పటికీ ఆ రైళ్ళను రెగ్యులర్ చేయకపోవడం శోచనీయం. వారానికి ఒక రోజు తిరిగే సత్యసాయి నిలయం రైలును డైలీ సర్వీసుగా మార్చాలని కోరుతునప్పటికీ పట్టించుకోవడం లేదు. బెంగుళూరు-పూరి మధ్య తిరుగుతున్న గరీబ్‌రథ్ రైలుకు గిద్దలూరులో హాల్టింగ్ ఇవ్వాలని కోరగా కొన్నాళ్లపాటు దిగువమెట్టకు హాల్టింగ్ ఇచ్చి ప్రస్తుతం ఎత్తివేయడం గమనార్హం. కరోనా సమయంలో రద్దు అయిన విజయవాడ-గిద్దలూరు-బెంగుళూరు ప్యాసింజర్ రైలును నేటికీ పునరుద్ధరించలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రైళ్ల వేగం పెంచి ప్రయాణ సమయం తగ్గించాలని, ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు కొత్త రైళ్ళను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శనగలో బెట్ట నివారణ చర్యలు తీసుకోవాలి

అద్దంకిటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శనగసాగు చేసిన రైతులు బెట్ట నివారణ చర్యలు తీసుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయా గ్రామాల పరిధిలో సాగు చేస్తున్న పలు పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో వెంకటకృష్ణ మాట్లాడుతూ శనగ పంటలో 30 నుంచి 40 రోజుల మధ్య అవకాశం ఉన్న రైతులు స్ప్రింకర్లతో తడి అందించాలన్నారు. మల్టీకె(పోటాషియం నైట్రేట్) ఒక కేజీ, నానో యూరియా 500 ఎంఎల్ ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాగులపాడు సొసైటి అధ్యక్షుడు ఏనుగంటి వెంకట రామయ్య, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ దినేష్‌సాయి, షేక్ మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

పంటసాగులో ఆధునిక పద్ధతులు పాటించండి

పంగులూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంటసాగులో రైతులు ఆధునిక పద్ధతులను పాటించాలని ఏవో డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని ఆరికట్ల వారిపాలెం, ముప్పవరం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 740 జీవో ద్వారా నల్లబర్లీ పొగాకు సాగు నిషేదించిందని, రైతులెవరూ నల్లబర్లీసాగు చేపట్టవద్దన్నారు. నల్లబర్లీ పొగాకు సాగుచేస్తే పంటను తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు గోపీకిరణ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

220 మందికి ఉచిత వైద్య పరీక్షలు

చినగంజాం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాలెం గ్రామంలోని రైతుసేవా కేంద్రం ఆవరణలో ఒంగోలు కిమ్స్ వైద్యశాల వారు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పల్లెపాలెం గ్రామ సర్పంచ్ సైకం మణి, గ్రామ కార్యదర్శి రాజా మోహన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రామాంజనేయులు పలు రకాల వ్యాధులకు సంబంధించి, ఆప్తమాట్రిక్స్ స్వాతి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రోగనిర్ధారణ జరిగిన 42 మందిని ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసినట్లు తెలిపారు. హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్, ఈసీహెచ్ఎస్, రైల్వే, ఎఫ్‌సీఐ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కిమ్స్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమలకు బయలుదేరిన స్వాములు

మార్టూరు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): పట్టణం నుంచి మంగళవారం 20 మంది అయ్యప్ప దీక్షదారులు శబరిమలకు బయలుదేరి వెళ్లారు. పడమర బజారు, బలరాం కాలనీ, నేతాజీనగర్ల నుంచి స్వాములు ప్రత్యేకమైన బస్సులో బయలు దేరివెళ్లారు. గత వారం రోజుల వ్యవధి లో మార్టూరు నుండి భవాని,శివ, అ య్యప్ప స్వాములు వంద మంది దాకా దీక్ష ను ముగించారు.

గాయపడిన వ్యక్తికి సాయం అందజేత

మార్టూరు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పట్టణంలో గొట్టిపాటి నగర్‌కు చెందిన షేక్ బాజి కత్తిపోట్లుకు గురై గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న షేక్ బాజిని టీడీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబానికి పార్టీతరపున రూ.50 వేల సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో షేక్ రజాక్, తొండెపు ఆదినారాయణ, సెల్ సుభాని, ముల్లా మస్తాన్ వలి, షేక్ రహీమా, షేక్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

మార్టూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల పంచాయతీ కార్మికులకు మంగళవారం రోటరీ మాజీ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటేరియన్లు మాదాల సాంబశి వరావు, చెన్నుపాటి బసవరాములు జాష్టి సాంబశివరావు, పెంట్యాల శ్రీను, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

పంగులూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో అక్రమంగా మద్యం విక్ర యిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అద్దంకి ఎక్సైజ్ సీఐ ఏ.భవాని హెచ్చరిం చారు. మండలంలోని కోటపాడు గ్రామంలో సోమవారం రాత్రి సీపీఎం కేంద్రకమిటి సభ్యులు డి.రమాదేవి నేతృత్వంలో స్థానిక మహిళలు అక్రమ మద్యం విక్రయ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్ఐ. హర్షవర్ధన్‌రెడ్డి స్థానిక వీఆర్‌వో మహిళా పోలీస్, గ్రామపెద్దలతో ఆయా దుకాణాల్లో మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్‌షాక్‌తో గ్రానైట్ కార్మికుడు మృతి

చీమకుర్తి, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌షాక్‌తో బీహార్ నుంచి వచ్చిన వలస కార్మికుడు మంగళవారం మృతిచెందిన ఘటన చీమకుర్తిలో చోటుచేసుకుంది. సీఐ ప్రసాద్ చెప్పిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గురుకులు పాఠశాలకు ఎదురుగా ఉన్న గ్రానైట్ పాలిషింగ్ ఎడ్జ్ కటింగ్ ఫ్యాక్టరీలో పనిచేస్తు్న చందన్(26)అనే కార్మికుడు ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్ తగిలి మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని సీఐ ప్రసాద్ పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఆర్‌వో ఓబులేషు

బాలికల వసతి గృహాల్లో డీఆర్వో ఆకస్మిక తనిఖీ

ఒంగోలు నగరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక భాగ్యనగర్ ఎక్స్‌టెన్షన్‌లోని పరివర్తన భవన్‌లో ఉన్న రెండు వసతి గృహాలను మంగళవారం రాత్రి జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేషు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ భవన్‌లో సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలోని విద్యార్థినులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని వంటగది, స్నానాల గదులు, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అనే దిశగా పరిశీలన చేశారు. విద్యార్థినులతో మాట్లాడారు. ప్రతినెలా వైద్య పరీక్షలు జరుగుతున్నాయా అంటూ వాకబు చేశారు. విద్యార్థినులతో కలిసి వసతిగృహంలో భోజనం చేశారు. డీఆర్వో వెంట జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, హాస్టల్ మ్యాట్రిన్ శిరీష, శ్రీలత ఉన్నారు.

7 చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు

● మార్కాపురం సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి

త్రిపురాంతకం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం అమ్ముకునేందుకు రైతుల సౌలభ్యం కోసం త్రిపురాంతకం మండలంలో ఏడు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మార్కాపురం సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి చెప్పారు. త్రిపురాంతకంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు విశ్వనాథపురం, దూపాడు, వెల్లంపల్లి, ఎండూరివారిపాలెం, పాత అన్నసముద్రం, త్రిపురాంతకం, కంకణాలపల్లెలోని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తేమశాతం 15శాతం మించకుండా చూసుకుంటే మద్దతు ధరలో ఎటువంటి కోత లేకుండా నగదు అందిస్తారని, పంట అమ్మిన తరువాత 6 నుంచి 24 గంటల వ్యవధిలోనే రైతుకు రావలసిన నగదు నేరుగా వారి ఖాతాకు జమ చేస్తారని తెలిపారు. రైతుల సందేహాల నివృత్తి కోసం జిల్లా స్థాయి కమాండ్ కంట్రోల్ రూం నెంబర్ 8008901457 కు ఫోన్ చేయవచ్చన్నారు.

నేడు గ్రానైట్ క్వారీలో కలెక్టర్ పరిశీలన

చీమకుర్తి, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామతీర్థం పరిసర ప్రాంతంలో విస్తరించి ఉన్న ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ క్వారీలను కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించనున్నారు.

డీఈవోగా రేణుక

(5వ పేజీ తరువాయి)

కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో దానిపై విచారణ కూడా చేశారు. మరోవైపు డీఈవో కార్యాలయంలో కూడా ఆయన అనేక ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆయన కార్యాలయంలో అందుబాటులో ఉండకుండా మరో చోట ఉంటూ అక్కడకు ఫైళ్లు తీసుకురావాలని ఆదేశాలు జారీచేయడంతో కార్యాలయ సిబ్బంది రాత్రి సమయంలో అనేక ఇబ్బందులు పడిన ఘటనలు కూడా ఉన్నాయి. మరోవైపు కిరణ్‌కుమార్ గతంలో పనిచేసిన చోట ఒక వేధింపుల కేసుపై ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లినట్లు సమాచారం. అన్నింటినీ పరిశీలించిన ప్రభుత్వం వెంటనే ఆయనపై బదిలీ వేటు వేసినట్లు తెలిసింది.

మంత్రి నిమ్మల పర్యటన వాయిదా

(5వ పేజీ తరువాయి)

అనంతరం మంత్రి నిమ్మల దోర్నాల బయల్దేరి రావాల్సి ఉంది. అయితే ఆయన కర్నూలు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా ఉండగా ఆ జిల్లా నుంచి పెద్దసంఖ్యలో పార్టీశ్రేణులు విజయవాడకు రావడంతో వారితో అనివార్యంగా నిమ్మల సమావేశం కావాల్సి వచ్చినట్లు సమాచారం. అలాగే బుధవారం సీఎం మరో కీలకమైన సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దానికి కూడా మంత్రి నిమ్మల హాజరు కావాల్సి రావడంతో వెలిగొండ సందర్శన కార్యక్రమాన్ని ఆయన వాయిదా వేసుకున్నారు. ఇక 11న మంత్రివర్గ సమావేశం ఉండగా ఆతర్వాత వెలిగొండకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మొక్కజొన్న రైతులను వెంటాడుతున్న కష్టాలు

● మొక్క దశలోనే పురుగు బెడద... నియంత్రించలేక అవస్థలు ● భారంగా మారుతున్న పెట్టుబడి ఖర్చు



మొక్కజొన్న పైరులో మచ్చల పురుగులను ఏరుతున్న కూలీలు

పర్చూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ పరిస్థితులు అనుకూలించక, గిట్టుబాటు ధరలు లేక కష్టాల్లో ఉన్న రైతు లను అడుగడుగున సమస్యలు వెంటాడుతున్నాయి. మొంథా తుఫాను ప్రభావంతో రబీలో సాగు తలపెట్టిన మొక్కజొన్న సకాలంలో విత్తలేక పోయారు. గత్యంతరం లేక కాస్త ఆలస్యమైనా సాగుచేపట్టిన రైతులకు ప్రారంభ దశలోనే క్రిమి కీటకాల బెడద వెంటాడుతుంది. గతంలో మొక్కజొన్న సాగులో పంట చేతికి వచ్చే నాటికి రెండు నుంచి మూడుసార్లు క్రిమి సంహారక మందు లు పిచికారి చేస్తే సరిపోయేది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సాగు ప్రారంభం మొక్క దశలోనే మూడు నుండి నాలుగు సార్లు మందులు చల్లాల్సి వస్తోందని దీంతో పెట్టుబడి బారం పెరిగిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు కొన్ని చోట్ల కత్తెర పురుగు కూడా కనిపిస్తుండడం రైతుల్లో ఆందోళన రేకెత్తిస్తుంది. ప్రస్తుతం అధికశాతం మచ్చల పురుగు(లద్దెపురుగు) పైర్లను కనిపిస్తుందని, దీన్ని నియంత్రించ లేక నానా అవస్థలు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. కత్తెర పురుగు సోకితే ఏమిచేయాలో అర్థంకాక రైతులు ఒకింత కలవరానికి గురవుతున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఈఏడాది ఖరీఫ్ సాగు నామమాత్రంగానే సాగు అయ్యింది. అధిక శాతం రైతుల రబీ సాగువైపే ఆశలు పెట్టుకున్నారు. అయితే వాతావరణ పరిస్థితులతో పాటు గత ఏడాది వేల ఎకరాల్లో సాగుచేసుకున్న నల్లబర్లీ పొగాకు కొంత మేర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసినా అధిక భాగం రైతుల వద్దే నిల్వ ఉంది. దీంతో పాటు, గత మూడేళ్లగా సరైన ధరలేక శనగ కోల్డ్ స్టోరేజ్‌ల్లోనే నిల్వలు ఉన్నాయి. దీనికి తోడు రబీలో అధికశాతం రైతులు నల్లబర్లీ పొగాకును సాగుచేయాల్సి ఉన్నా, ఈ ఏడాది ప్రభుత్వం నల్లబర్లీ సాగును నిషేధించింది. దీంతో ఏపంటలు సాగుచేయాలో అర్థంకాక రైతుల్లో సందిగ్ధం నెలకొంది. అయితే వ్యవసాయ అధికారులు ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని సూచనలు ఇచ్చిన నేపథ్యంతో పాటు మొక్కజొన్నకు కొంత మేర ప్రభుత్వ గిట్టుబాటు ధర వస్తుందన్న ఆశతో రైతులు సాగువైపు మొగ్గు చూపారు.

గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు విస్తీర్ణంలో రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారు. ఇలాంటి తరుణంలో చీడ పీడలు, వాతావరణ పరిస్థితులు మొక్కజొన్న సాగుకు ఏ మేరకు అనుకూలిస్తాయో వేచిచూడాల్సి ఉంది.



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

కరెంటు తీగల దొంగలు అరెస్టు

● రూ.3.85 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం

కొమరోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ, 11కేవీ అల్యూమినియం కరెంటు తీగలను దొంగిలించిన ముగ్గురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు గిద్దలూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య తెలిపారు. గత మూడు నెలల క్రితం మండలంలోని బాలిరెడ్డిపల్లి, చింతలపల్లి, మదవపల్లి, హసనాపురం గ్రామాల్లో రైతుల పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగ, 11కేవీ విద్యుత్ తీగల దొంగతనానికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితులు కొమరోలు పోలీసులను ఆశ్రయించగా ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తులో ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి సుమారు రూ.3.85లక్షల విలువగల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నంద్యాల, సిరివెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలు చేసి జైలుకు కూడా వెళ్లివచ్చారు. ఈ క్రమంలో గత మూడు నెలల నుంచి కొమరోలు, రాచర్ల మండలాలలో నూతనంగా 11కేవీ కరెంటు లైన్‌లను ఏర్పాటు చేస్తుండగా నిందితులు 2002 విద్యుత్ స్తంభాల కరెంటు తీగను, గిద్దలూరు, కంభం, పెద్దారవీడు పోలీస్‌స్టేషన్ పరిధిలోగల కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టి అందులో గల కాపర్ వైర్లను మార్కాపురంలో అమ్మడానికి చిగుర్ల ఆంజనేయులు ఆటోలో వెళ్తూ మార్గమధ్యలో మండలంలోని నారాయణ పల్లి క్రాస్ రోడ్డు వద్ద దొరికారు. ఎస్సై నాగరాజు చాకచక్యంగా పట్టుకుని వారి నుంచి తీగలను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. నిందితులు సిసినం ఇర్మియా, చిగుర్ల ఆంజనేయులు, మహానందిగారి శ్రీనివాసులును మంగళవారం గిద్దలూరు కోర్టులో హాజరు పరిచారు. ఎస్సైని ఎస్పీ అభినందించారు.

మాతృమరణాలను అరికట్టాలి

● వైద్యశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జన్మనిస్తూ ఏ తల్లీ మరణించరాదని, గర్భవతి సమయంలో అందించాల్సిన అన్ని రకాల వైద్య సేవలు, చికిత్సలు, పరీక్షలు అందించాలని వైద్యాధికారులను కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం మాతృమరణాలపై ఎండిఆర్ (మెటర్నల్ డెత్ రివ్యూ) కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఈ సంవత్సరం గత ఆరు నెలల కాలంలో జరిగిన మాతృమరణాలపై కలెక్టర్ సమీక్షించారు. ఆరు నెలల కాలంలో ముగ్గురు గర్భవతులు మృతిచెందినట్లు కలెక్టర్‌కు అధికారులు వివరించగా ఆ ముగ్గురు గర్భవతుల మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్యాధికారుల అభిప్రాయాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డీఐవో డాక్టర్ కమలశ్రీ, రిమ్స్ గైనకాలజిస్టు డాక్టర్ సంధ్యారాణి, మత్తు మందు విభాగం హెడ్ డాక్టర్ జయసుందరం, జిల్లా ఎన్‌టిఆర్ వైద్య సేవల కో ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్‌తో పాటు పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షితమైన నీటిని అందించాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించేందుకు జలసురక్ష మాసంగా ఈనెల రోజుల పాటు తాగునీటి పథకాలను శుభ్రం చేయడంతోపాటు పైపులైన్లు, తాగునీటి బోర్ల మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 856 ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉంటే ఇప్పటికే 500లకుపైగా తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన ట్యాంకులను కూడా త్వరగా శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు వారంలో మూడు రోజులపాటు గ్రామాల్లో పర్యటించాలని అదేశించారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమై ప్రజాసమస్యలు తెలుసుకొని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత వైద్యసేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పథకం కింద మంజూరు చేసిన షెడ్ల నిర్మాణాలను పూర్తిచేయడంతో పాటు గృహ నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి మండలస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు ఉన్నారు.

ప్రయాణికుడిపై ట్రావెల్స్ బస్సు సిబ్బంది దాడి

ఒంగోలు క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓ ప్రయాణికుడిపై ప్రైవేటు బస్సు ట్రావెల్స్ సిబ్బంది దాడిచేసి మార్గమధ్యలో బస్సు దించివేశారు. ఈ ఘటన సోమవారం రాత్రి ఒంగోలు అద్దంకి బస్టాండ్‌లో జరిగింది. టంగుటూరు నుంచి హైదరబాద్ వెళ్లేందుకు టంగుటూరు మండలం బుచ్చిరాజుపాలేనికి చెందిన బొడ్డ టవీన్‌చంద్ర, అయన మామ సత్యనారాయణ ప్రైవేటు బస్సులో టిక్కెట్ బుక్ చేసుకున్నారు. రాత్రి 10.20కి బస్సు కండక్టర్ మాధవరావు ప్రయాణికుడు టవీన్‌చంద్రకు ఫోన్ చేసి బస్సు టోల్‌గేట్ వద్ద ఉందని వెంటనే రావాలని సమాచారం ఇచ్చాడు. ఒక్క నిమిషంలో వస్తామని టవీన్‌చంద్ర తెలిపారు. ఒక్క నిమిషంలో బస్సు దగ్గరకు రాకపోతే బస్సు వెళ్లిపోతుందని కండక్టర్ సమాధానం ఇచ్చాడు. డబ్బులు పెట్టి టిక్కెట్ కొనుకున్నామని, ఎలా బస్సు వెళుతుందని ప్రయాణికుడు ప్రశ్నించాడు. ఎట్టకేలకు టంగుటూరులో టవీన్‌చంద్ర, ఆయన మామ సత్యనారయణ బస్సు ఎక్కారు. ఒంగోలు వచ్చిన తరువాత కండక్టర్ మాధవరావు తమ సిబ్బంది కొంత మందితో టవీన్‌చంద్ర, సత్యనారయణలను బస్సులో నుంచి కిందకు దించేశారు. టవీన్‌చంద్రను చితకబాదారు. స్థానిక అద్దంకి బస్టాండ్‌లో వదిలేసి వెళ్లారు. తలపై గాయమైన టవీనచంద్ర చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేరి ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం బాధితులును పిలిపించి విచారణ చేపట్టారు.

అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమ లే అవుట్లను క్రమబద్ధీరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినందున సద్వినియోగం చేసుకోవాలని ఒడా వైస్‌చైర్మన్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో మంగళవారం బీపీఎస్‌పై ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, లైసెన్స్ ఇంజనీర్స్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనధికార లే అవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లకు అనుమతులు పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఒడా అనుమతి లేకుండా, పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా కట్టిన భవనాలను అప్రూవల్ చేసుకొనేందుకు వచ్చే ఏడాది మార్చి 12 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్రమ లే అవుట్లపై ఒడా నుంచి అనుమతులు తీసుకోకపోతే అటువంటి స్థలాల్లో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరగదని స్పష్టంచేశారు. ఒడా చైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం అక్రమ లే అవుట్లు, అక్రమ నిర్మాణాలపై బీపీఎస్ కింద అవకాశం కల్పించినందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, రాజేంద్ర పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్, గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎన్‌జీవో) అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఒంగోలులోని ఎన్‌జీవో భవన్‌లో మంగళవారం నామినేషన్లను ఎన్నికల అధికారి బి.వెంకటేశ్వర్లు స్వీకరించారు. ఒక్కొక్క పదవికి ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్లను దాఖలు చేయడంతో జిల్లా కార్యవర్గం మొత్తం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కూచిపూడి శరత్‌బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి నాల్గో పర్యాయం ఎన్నికయ్యారు. సహాధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వరరావు (వ్యవసాయశాఖ), ఉపాధ్యక్షులుగా బి.ఏడుకొండలు (స్టేట్ ఆడిట్), తోట శ్రీనివాస్ (ఎన్ఎస్‌సీ సబ్‌డివిజన్), పి.రామాంజనేయులు (వైద్యశాఖ), బి.విజయ్‌కుమార్ (ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి), ఆర్.దీపక్‌కుమార్ (పశుసంవర్ధకశాఖ), ఉపాధ్యక్షురాలిగా కె.కోటేశ్వరమ్మ (ఆయూష్‌శాఖ) ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఆర్‌సీహెచ్.కృష్ణారెడ్డి (జలవనరులశాఖ క్వాలిటీ కంట్రోలు), కార్యనిర్వాహక కార్యదర్శిగా బి.కృష్ణకిషోర్ (కన్‌స్ట్రక్షన్ సర్కిల్), సంయుక్త కార్యదర్శులుగా ఎం.శ్రీనివాసరావు (వాసు) (జిల్లా పంచాయతీ కార్యాలయం), డి.వెంకటేశ్వర్లు (డీఎల్ఎఅండ్‌టీడీ కార్యాలయం), డి.మధుసూదనరెడ్డి (సాంఘికసంక్షేమశాఖ), కె.రాజేష్‌బాబు (జీజీహెచ్ నర్సింగ్ కాలేజీ), వి.హరిబాబు (డబ్లూడబ్ల్యూడీఎస్), సంయుక్త కార్యదర్శిగా బి.పద్మకుమారి (డీఈవో కార్యాలయం), కోశాధికారిగా కె.శివకుమార్ (సర్వేశాఖ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఏకగ్రీవం అనంతరం ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది.



ఒంగోలులో ర్యాలీలో పాల్గొన్న ఏపీఎన్‌జీవో సంఘం నాయకులు, సభ్యులు

ఎన్‌జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్‌రావు ప్రమాణస్వీకారం చేయించారు.

ఒంగోలులో భారీ ర్యాలీ

ఎన్‌జీవో సంఘం జిల్లా ఎన్నికల సందర్భంగా జిల్లా కేంద్రమైన ఒంగోలులో భారీ ర్యాలీ నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శరత్‌బాబు, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. స్థానిక కలెక్టరేట్ నుంచి వందలాది మంది ఎన్‌జీవో అసోసియేషన్ సభ్యులతో ఈ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎన్‌జీవో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.విద్యాసాగర్, డి.వి.రమణ పాల్గొన్నారు.

పక్కా గృహాల కోసం నిర్మాణ శాఖ సర్వే
14వ తేదీ వరకు పొడిగింపు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వెళుతున్నాయి. అందులో భాగంగా ప్రధాన మంత్రి గ్రామీణ అవాస్ యోజన పథకం కింద నివాసాల మంజూరు లబ్ధిదారుల సర్వే పక్రియను అధికారులు, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్నారు. అయితే ఈసర్వే నవంబరు 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. సర్వే పూర్తిస్థాయిలో జరగకపోవడం, లబ్ధిదారుల వివరాలు పూర్తిస్థాయిలో రాకపోవడంతో అందరి వివరాలు పక్కాగా ఉండేందుకు ప్రజాప్రభుత్వం అలోచనతో డిసెంబరు 14వ తేదీ వరకు ఈ సర్వేను పొడిగించింది.

ఎర్రగొండపాలెం గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నివాసాల మంజూరు నిమిత్తం క్షేత్రస్థాయిలో డీఈ, ఏఈలు, సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు సర్వే నిర్వహించారు. వారి వివరాలను గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన యాప్‌లో నమోదు చేశారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ వ్యాప్తంగా సర్వే చేసిన వివరాలు ఇలా ఉన్నాయి.



గుర్రపుశాలలో సర్వే నిర్వహిస్తున్న గృహనిర్మాణ శాఖ డీఈ, ఏఈ, సిబ్బంది

6,854 వివరాలు యాప్‌లో నమోదు

ఎర్రగొండపాలెం మండలం వ్యాప్తంగా 1,427, త్రిపురాంతకం మండలం 1,443, పుల్లలచెరువు మండలం 2,102, దోర్నాల మండలం 575, పెద్దారవీడు మండలం 757 మొత్తం 6,324 సర్వే పూర్తి చేసి యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు ఎర్రగొండపాలెం గృహ నిర్మాణ శాఖ డీఈ ఎస్.వి.సురేష్ బాబు తెలిపారు. వాటితో పాటు ఐదు మండలాల్లో ఉన్న చెంచు 500 మంది వివరాలు యాప్‌లో నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వాటన్నిటినీ ప్రభుత్వ యాప్‌లో పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి వారి వివరాలను కార్యాలయానికి పంపిస్తారని సురేష్ బాబు తెలిపారు.

అర్హులు ఏవరంటే...


సొంతింటి స్థలం లేదా ప్రభుత్వం ఇచ్చిన పట్టా (పొజిషన్ సర్టిఫికెట్) తప్పనిసరిగా ఉండాలి. తెల్లరేషన్ కార్డు ఆదాయ, కుల ధ్రువీకరణ, భార్యాభర్తల ఆధార్ కార్డు అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. గతంలో గృహ నిర్మాణ పథకం ద్వారా నిర్మించుకుంటే ప్రస్తుతం ఈ పథకం వర్తించదని సురేష్ బాబు తెలిపారు.

నగదు ఎవరికీ చెల్లించవద్దు

ఇంటి నిర్మాణం కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడైనా ఎవరికీ డబ్బులు చెల్లించవద్దు. అలా చెల్లించి మోసపోవద్దు. ఈనెల 14వ తేదీ వరకు నివాసం కోసం అర్జీలు పెట్టుకోవచ్చు. నేరుగా కార్యాలయం లేదా సచివాలయ ఇంజనీరు అసిస్టెంటును కలిసి వివరాలు తెలుసుకోవాలి.

- డీఈ సురేష్ బాబు

పీఆర్ రోడ్లకు రూ.22.50 కోట్లు మంజూరు



కొండపి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): కొండపి నియోజకవర్గంలోని పలు రోడ్ల మరమ్మతు పనులకు దాదాపు రూ.22 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం సాయంత్రం జీవో విడుదల చేసింది. జరుగుమల్లి మండలంలోని కామేపల్లి నుంచి ఎస్ఎన్ కంభ్రిగ వెళ్లే దాదాపు ఐదున్నర కిలోమీటరు రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ.2 కోట్లా 81 లక్షలు నిధులు మంజూరు చేసింది. టంగుటూరు నుంచి మడనూరు వయా ఆలకూరపాడు రోడ్డు దాదాపు ఐదున్నర కిలోమీటర్లు రోడ్డు మరమ్మతు పనులకు రూ.95 లక్షలు మంజూరు చేసింది. టంగుటూరు మండలంలోని పెళ్లూరు జాతీయ రహదారి నుంచి వాసేపల్లిపాడు వెళ్లే దాదాపు ఐదు కిలోమీటర్లు రోడ్డు తారురోడ్డుగా మార్చేందుకు రూ.2 కోట్లా 38 లక్షలు మంజూరు చేసింది. ఇదే మండలంలోని కొణిజేడు నుంచి పొందూరు వెళ్లే నాలుగున్నర కిలోమీటర్ల రోడ్డును తారురోడ్డుగా మార్చేందుకు రూ.2 కోట్లా 41 లక్షలు, పాకల జడ్పీ రోడ్డు నుంచి రావివారిపాలెం వరకు సింగరాయకొండ మండలం పరిధిలోని దాదాపు నాలుగున్నర కిలోమీటర్లు రోడ్డు తారురోడ్డుగా మార్చేందుకు రూ.2 కోట్లా 43 లక్షలు మంజూరు చేసింది. సింగరాయకొండ నుంచి రామనాథపురం వయా నందనవనం సింగరాయకొండ మండల పరిధి వరకు దాదాపు 4.2 కిలోమీటర్లు రోడ్డు మరమ్మతు పనులకు కోటీ 73 లక్షలు మంజూరు చేసింది. జాతీయ రహదారి నుంచి మూలగుంటపాడు వరకు 1.2 కిలోమీటర్లు రోడ్డు మరమ్మతులకు రూ.81 లక్షల మంజూరు చేసింది. పొన్నలూరు మండలంలోని నాగిరెడ్డిపాలెం నుంచి పైరెడ్డిపాలెం మీదుగా చెరుకూరు వరకు ఐదున్నర కిలోమీటర్లు రోడ్డును మరమ్మతులకు రూ.3 కోట్లా 2 లక్షలు మంజూరు చేసింది. మర్రిపూడి మండలంలోని జువ్విగుంట నుంచి శివరాయనిపేట మీదుగా పొదిలి మండలంలోని ఉప్పలపాడు వరకు 16 కిలోమీటర్లు రోడ్డు మరమ్మతులకు రూ.6 కోట్లా 7 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

క్విస్‌లో ముగిసిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్‌సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి జాతీయ స్థాయిలో నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-25 గ్రాండ్‌ఫినాలె మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల అతిథ్యం ఇచ్చింది. ఈ నేపథ్యంలో కళాశాల రామానుజన్ సెమినార్ హాలులో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు రోజుల పాటు 18 టీంలకు చెందిన 126 మంది విద్యార్థులు ప్రాబ్లమ్స్ స్టేట్‌మెంట్లకు కనుగొన్న పరిష్కారాలను జ్యూరీ మెంబర్లు ఎవాల్యుయేట్ చేసి ఒక్కొక్క ప్రాబ్లమ్ స్టేమ్‌మెంట్‌లో ఒక్కొక్కరిని విజేతగా ప్రకటించారు. మెడ్, హెల్త్, బయోటెక్, స్టూడెంట్ ఇన్నోవేషన్ ఆన్‌మిస్ లీనియస్, ఎనర్జీ రెన్యూవల్ అండ్ కన్జర్వేటివ్ సిస్టమ్, సస్టయినబుల్ స్టేట్‌మెంట్స్‌లో ఒక్కొక్కరికి బహుమతిరాగా, ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చర్ విభాగంలో మాత్రం రెండు టీంలు బహుమతులను గెల్చుకున్నాయి. హ్యాకథాన్‌లో గెలుపొందిన జట్లకు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ వీసీ డీవీఆర్ మూర్తి ఒక్కొక్క టీంకు రూ.1.50 లక్షల నగదు అందజేశారు. ఈ స ందర్భంగా గెలుపొందిన జట్లులోని విద్యార్థులను క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి గాయత్రిదేవి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీఈ నోడల్ ఇన్‌చార్జి డాక్టర్ శృతి భార్గవ చౌబే, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, డీపీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, కన్వీనర్ బుజ్జిబాబు, కో కన్వీనర్ డాక్టర్ కేవీజే భార్గవ్ ఉన్నారు.



విక్టరీ చూపుతున్న విద్యార్థులు

పెంచిన ఫిట్‌నెస్ చలానాలను నిలిపివేయాలి

● లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల డిమాండ్

సింగరాయకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన ఫిట్‌నెస్ చలనాలను రాష్ట్ర ప్రభుత్వం యథతథంగా పెంచడం దారణమని లారీ అసోసియేషన్ సభ్యులు వాపోయారు. పెంచిన ఫిట్‌నెస్ చలనాలను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం లారీ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో లారీ ఓనర్స్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిగురుపాటి శేషగిరి మాట్లాడుతూ పెరిగిన చార్జీల వల్ల ఓనర్ కమ్ డ్రైవర్‌గా ఉంటూ స్వయం ఉపాధితో కుటుంబాలు పోషించుకుంటున్నవారు రోడ్డునపడే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెంచిన ఫిట్‌నెస్ చలనాలను ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలో జిల్లా కేంద్రాల్లో నిర్వహించాల్సిన ఫిట్‌నెస్‌లు పొరుగు జిల్లాలకు వెళ్లి చేయించుకోవాలని రవాణా అధికారులు సూచిస్తున్నారని తెలిపారు. ఒంగోలులో కూడా ఫిట్‌నెస్‌లు ఆపివేశారని, దీంతో నెల్లూరు, గుంటూరు వెళ్లి చేయించుకోవాల్సిన అగత్యం ఏర్పడుతోందన్నారు. దీని వల్ల అధిక వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోందన్నారు.

అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులదే

● నంద్యాల సర్కిల్ పరిధిలో 8 పులులు



అధికారులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ ఫీడ్ డైరెక్టర్ విజయ్ కుమార్

కొమరోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఫారెస్ట్ అధికారులదేనని నంద్యాల ఫారెస్ట్ ఫీడ్ డైరెక్టర్ బి.విజయ్ కుమార్ అన్నారు. కొమరోలులోని బేస్తవారిపేట ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో మంగళవారం నంద్యాల ఫారెస్ట్ సర్కిల్ ఫీడ్ డైరెక్టర్ విజయ్ కుమార్ సిబ్బందికి ఆక్యూపెన్సీ సర్వేపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ నంద్యాల సర్కిల్ పరిధిలోని గిద్దలూరు, నంద్యాల, బేస్తవారపేట, ఆత్మకూరు డివిజన్లు రిజర్వ్ ఫారెస్ట్ నుంచి టైగర్ ఫారెస్ట్‌గా మార్చారని తెలిపారు. ఈ ఫారెస్ట్‌ను 2022లో ఆక్యూపెన్సీ సర్వే చేపట్టామని మరల 2026లో ఈ సర్వేను పూర్తిస్థాయిలో చేపడుతున్నామని తెలిపారు. అడవుల్లోని పులులు, జింకలు, చిరుత పులులు, అడవి పందులు వంటి జంతువుల సంఖ్యను అడవిలోని వృక్షాలను, అడవిలోని సంపదను పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. జంతువులను వేటాడి వాటి మాంసంను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00


బాపూజీ కాంప్లెక్స్ వద్ద రోడ్డు మీదనే ఉన్న దుకాణాలు


ఇరుగ్గా మారిన గాంధీరోడ్డు


కోర్టు సెంటరులో రోడ్డు పైనే వాహనాల పార్కింగ్

ఆంధ్రజ్యోతి పరిశీలన

అడ్డగోలుగా.. ఆక్రమణలు!


ఆర్టీసీ బస్టాండు వద్ద నడిరోడ్డులో ఉన్న తోపుడు బండ్లు

సైడు కాలువల పైనా నిర్మాణాలు ● అద్దెలకు ఇచ్చి చిరువ్యాపారుల నుంచి రూ.వేలల్లో వసూలు
రోడ్లు విస్తరణ జరిగినా మారని తీరు ● ట్రాఫిక్ సమస్యలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి
పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు


కొత్తపట్నం బస్టాండు ప్రాంతంలో ఇలా..

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని పలు ఫుట్‌పాత్‌లను యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. పలు చోట్ల స్థానిక షాపు యజమానులే ఫుట్‌పాత్‌లను, సైడు కాలువలను చిరువ్యాపారులకు అద్దెలకు కేటాయిస్తూ రూ.వేలకు వేలు దండుకుంటున్నారు. కార్పొరేషన్ స్థలం కనిపిస్తే కబ్జాలకు కొందరు పాల్పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు అలసత్వం కారణంగా అనేక ప్రాంతాల్లో స్థలాలు, ఫుట్‌పాత్‌లు అన్యాక్రాంతానికి గురౌతున్నాయి. ఇప్పటికే పలు కార్పొరేషన్‌కు చెందిన కొన్ని స్థలాలను కొందరు ఆక్రమించి ఏళ్ళ తరబడి అనుభవిస్తుండగా, నిర్మాణాలు తొలగించి స్వాధీనం చేసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. నగరంలో వందల సంఖ్యలో ప్రభుత్వ రహదారులు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇదిలా ఉండగా, వివిధ వ్యాపారాల నిమిత్తం మరెన్నో తాత్కాలిక ఆక్రమణలు ఉన్నాయి. తొలుత చిరువ్యాపారం కోసం కొంతమేర జాగా ఏర్పాటు చేసుకోవడం. ఆ తర్వాత శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు.

చిరు వాప్యారాల నుంచి రూ.వేలల్లో దోపిడీ

నగరంలోని పలు ప్రాంతాలలో వేల సంఖ్యలో వీధి వ్యాపారులు వివిధ రకాల విక్రయాలతో జీవనం సాగిస్తున్నారు. అధిక శాతం తోపుడు బండ్లపై, ఫుట్‌పాత్‌లపై పండ్లు, కూరగాయలు, టిఫిన్, బట్టలు, చెప్పులు, వివిధ వస్తువులు, నూడిల్స్ పాయింట్‌లు, సమోసాలు, స్వీట్‌కార్న్, పుల్కా పాయింట్, పూల వ్యాపారాలు వంటివి అమ్మకాలు సాగిస్తుంటారు. ఈ వ్యాపారాలు సాగించేందుకు ప్రతిరోజు కార్పొరేషన్‌లకు రోజువారీ రుసుము చెల్లించాల్సి ఉంది. అయితే ట్రాఫిక్ సమస్య తలెత్తినపుడల్లా ఖాకీలు వారి బండ్లను పక్కకు నెట్టేయడం నిత్యకృత్యం. దీంతో వ్యాపారులు పలు షాపుల యజమానులను ఆశ్రయించడంతో వారి దుకాణం ముందు సాయంత్రం బండిని నిలుపుకుని చిరు వ్యాపారం చేసుకునేందుకు విన్నవించుకోగా, యజమానులు వారి వద్ద నుంచి రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు వసూలు చేయడం ఇదో తరహా వ్యాపారమైంది. అంతే కాకుండా షాపు యజమానే కరెంటు ఇచ్చేందుకు అదనంగా రోజుకు రూ.100 వసూలు చేస్తున్నారు. దీంతో ఒక్కో షాపు యజమాని తమ షాపు ముందు వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించినందుకు రోజుకు రూ.600 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో చిరువ్యాపారుల వద్ద నుంచి నెలకు రూ.15వేల నుంచి రూ.18వేల వరకు వసూలు చేస్తున్న వారు అధిక సంఖ్యలోనే ఉన్నారు.

రోడ్లను విస్తరించినా...

ఒంగోలు నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రత్యేక దృష్టి సారించారు. కొత్తగా రోడ్ల నిర్మాణం, ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రాంతాల్లో రోడ్ల విస్తరణతోపాటు, ట్రాఫిక్ సమస్య నియంత్రణలోనూ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇప్పటికే సీవీఎన్ రీడింగ్‌రూమ్ సెంటర్, రంగారాయుడు చెరువు ఏరియా, కర్నూలు రోడ్, శ్రీనివాస థియేటర్ రోడ్, కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, గుంటూరు రోడ్ విస్తరించగా, త్వరలోనే చర్చి సెంటర్ నుంచి మస్తాన్‌దర్గా సెంటర్ వరకు ట్రంక్ రోడ్ విస్తరణ, అలాగే మస్తాన్‌దర్గా నుంచి బీవీఎస్ హాలు మీదుగా కొత్తపట్నం బస్టాండ్ వరకు రోడ్డు విస్తరణ చేయనున్నారు. అయితే ప్రజల సౌకర్యార్థం పాలకులు ప్రత్యేక చొరవ తీసుకుంటుండగా, కొందరు వ్యాపారాలు రోడ్డు విస్తరించిన ప్రాంతాల్లో తిరిగి దుకాణాలు ఏర్పాటు చేయడం, ఆక్రమించి అద్దెలకు కేటాయించడం జరుగుతుంది. మరోవైపు విస్తరించిన రోడ్‌ను తిరిగి వాహన పార్కింగ్‌గా ఉపయోగించుకోవడంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు.

చూసీ చూడనట్లుగా టౌన్‌పానింగ్

నగరంలో వీధి వ్యాపారులకు జోన్‌లు కేటాయించినా అవి ఉపయోగపడటం లేదు. దీంతో చిరువ్యాపారుల జీవనం పెద్ద వ్యాపారులకు కాసులు కురిపిస్తుండగా, ఫుట్‌పాత్‌లు, సైడు కాలువలను ఆక్రమించి అద్దెకు కేటాయిస్తున్నవారిపై చర్యలు తీసుకోవడంలో టౌన్ ప్లానింగ్ యంత్రాంగం విఫలమవుతుంది.

పరిష్కారం వైపు దృష్టి సారిస్తేనే..

నగరంలో ట్రాఫిక్ సమస్య ఒక్కరోజుతో పోయేది కాకపోవడంతో శాశ్వత పరిష్కారం వైపు యంత్రాంగం దృష్టి సారించాల్సి ఉంది. ప్రధానంగా మినీ స్టేడియం నుంచి కలెక్టరేట్ వరకు, అలాగే డీమార్ట్, జీజీహెచ్, రమ్య హోటల్ సెంటర్, పెట్రోల్ బంక్ ఏరియా, ఎల్ఐసీ ఎదురు, అలాగే అంజయ్య రోడ్, మంగమూర్ రోడ్, సీవీఎన్ సెంటర్, కోర్టు సెంటర్, సాయిబాబా గుడి సెంటర్‌తోపాటు పలు ఏరియాలలో రహదారులపై నాలుగు చక్రాల వాహనాలు నిలిపివేత అరికట్టడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు పార్కింగ్ లేకుండా చూడాల్సి అవసరం ఉంది.

గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో కార్పొరేషన్ అధికారులు వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా జోన్‌లు ఏర్పాటు చేయగా, వైసీపీ వచ్చాక వాటిని గాలికి వదిలేశారు. ఇప్పటికైనా దీనిపైనా పోలీసు యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగవాసులు కోరుతున్నారు.


కర్నూలురోడ్డులో వాహనాల పార్కింగ్


లాయర్‌పేటలో రోడ్డుపైనే తోపుడు బండ్లు


నెల్లూరుబస్టాండులో కేబీ వద్ద..

మల్లవరం సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ.76 లక్షలు కేటాయింపు

మద్దిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మల్లవరంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం రూ.76 లక్షల నిధులను ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ కేటాయించినట్లు మల్లవరం శ్రీవారి కమిటీ గౌరవాధ్యక్షుడు కావూరి వాసుబాబు, అధ్యక్షుడు మారినేని కృష్ణారావు మంగళవారం తెలిపారు. శ్రీవారి కమిటీ ఆధ్వర్యంలో శ్రీగిరి ప్రదక్షణకు సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను శరవేగంగా పూర్తి చేయన్నారు. గ్రామస్థుల సహకారంతో రూ.13 లక్షల నిధులను కేటాయించి సిమెంట్‌రోడ్డు నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. దాదాపు రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గౌరవాధ్యక్షుడు కావూరి వాసుబాబు మాట్లాడుతూ మల్లవరం దేవస్థానం శ్రీవారి కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో ఔషధ మొక్కలను నాటినట్లు తెలిపారు. మరింత అభివృద్ధి కోసం కమిటీ ఆధ్వర్యంలో పనులను పూర్తిచేస్తామని తెలిపారు. దాతల సహకారంతో మరింత ముందుకు వెళతామని చెప్పారు. కార్యక్రమంలో మన్నం శ్రీనివాసరావు, తేళ్ల సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సింగరాయకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలపై సింగరాయకొండలోని బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. నేల ఆరోగ్యం ప్రాముఖ్యత, మట్టి నమూనా సేకరణ, పరీక్షా విధానం, మొబైల్ అప్లికేషన్, టెస్టింగ్ పరికరాలు పని విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏవో పూర్ణచంద్రరావు, ఏవోడీ స్వరూప, జిల్లా వనరులకేంద్రం వ్యవసాయాధికారి శేషమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

● ఎమ్మెల్యే దామచర్ల



కర్నూలురోడ్డులోని ఫ్లైవోవర్ బ్రిడ్జి వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధి కోసం చేపట్టిన పనులను నాణ్యత లోపం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఒంగోలు నగరంలో విస్తృతంగా పర్యటించిన ఆయన కర్నూలు రోడ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రూ.80 లక్షల వ్యయంతో చేపట్టిన పనులు పరిశీలించారు. అనంతరం కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రూ.40లక్షలతో నిర్మించిన ఆర్‌వోబీ కల్వర్టు పనులను, అలాగే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి కొప్పోలు వరకు రెండు వైపులా నిర్మాణం చేపట్టిన సీసీ డ్రైన్‌లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం రూ.750 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. నిధుల మంజూరులో ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని, అందువల్ల కాంట్రాక్టర్లు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపం లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, భవిష్యత్‌లో మరిన్ని పనులు చేపట్టడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు దామచర్ల స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ బుజ్జి, ఇంజనీర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల్లోని గ్రామీణ రోడ్లకు మహర్దశ

నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, రూరల్ డవలప్‌మెంట్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్లు నిర్మించేలా అనుమతులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శశిభూషన్ కుమార్ బుధవారం జీవో విడుదల చేశారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని పెళ్ళూరు నుంచి చెరువుకొమ్ముపాలెం మీదుగా కొణిజేడుకు 11.105 కి.మీ. రోడ్డు నిర్మాణానికి రూ.5.47కోట్లు, కొత్తపట్నంలోని వజ్జిరెడ్డిపాలెం నుంచి పల్లపుపాలెం వరకు 1.71 కి.మీ రోడ్డుకు రూ.1.19కోట్లు, అలాగే ఉలిచి నుంచి పాతపాడు వరకు 4.971 కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.2.73 కోట్లు కేటాయిస్తూ ఉత్వర్వులు ఇచ్చారు. చేశారు.

సంనూతలపాడు నియోజకవర్గానికి రూ.10.26 కోట్లు

సంతనూతలపాడు: నియోజకవర్గంలోని పంచాయతీ రోడ్లకు పల్లె ఎండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా సస్కి నిధుల కింద రూ.10.26కోట్లు లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. ఈమేరు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖమంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంతనూతలపాడు-మైనంపాడు రోడ్డుకు రూ.1.72కోట్లు, హెచ్.నిడమానూరు-అమ్మనబ్రోలు రోడ్డు నుంచి టి.అగ్రహారం వరకు రూ.1.03కోట్లు, కనపర్తి నుంచి యానాదిసంఘం రోడ్డు వరకు రూ.83 లక్షలు, మల్లవరం నుంచి చినమల్లవరం రోడ్డు వరకు రూ.76లక్షలు, పిడతలపూడి నుంచి చినరావిపాడు(వయా ఆర్‌సీపురం, బూసరపల్లి) వరకు రూ.1.83కోట్లు, చీమకుర్తి నుంచి కంభంపాడు వరకు రూ.2.8కోట్లు, నిప్పట్లపాడు-ఓబచెత్తపాలెం వరకు రూ.2కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

● మాజీ మంత్రి మేరుగ నాగార్జున

మద్దిపాడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ తగదని మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మంగళవారం మద్దిపాడులోని ఘడియపూడి కాలనీలో గల వైసీపీ కార్యాలయంలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలపై వ్యవహరిస్తున్న దొంగ వైఖరి విడనాడాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కోటి సంతకాలతో గవర్నర్, రాష్ట్రపతిని కలవనున్నట్లు ఆయన చెప్పారు. ఈ నెల 17న సేకరించిన సంతకాలను మొత్తం జిల్లాల వా రీగా జగన్మోహన్‌రెడ్డి కార్యాలయానికి తరలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండవ అప్పారావు, వాకా కోటిరెడ్డి, నాదెండ్ల మహేష్, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఇకపై డిజిటల్ లావాదేవీలు

● సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో ఇకపై డిజిటల్ లావాదేవీలు సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు మంగళవారం తెలిపారు. ఆసుపత్రిలో లభించి వివిధ సేవలకు యూజర్ చార్జీలు, చెల్లింపులు, డొనేషన్‌లు ఇక నుంచి డిజిటల్ రూపంలో జరుగుతాయన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీజీహెచ్‌లో స్పెషల్ రూములు, క్వార్టర్స్, జీజీహెచ్‌లో షాపులు, మెడికల్ బోర్డు ఫీజులు, నర్సింగ్ అప్రెంటిషిప్స్, మెడికల్ సర్టిఫికెట్స్, వయసు ధృవీకరణ పత్రాలు తదితర లావాదేవీలు నిర్దేశించిన క్యూఆర్ కోడ్ ద్వారానే జరుగుతాయని, డిజిటల్ చెల్లింపులు చేసిన వారు తగు రశీదు చూపాలని ఆయన కోరారు.

వడ్డీ వ్యాపారి దాడిపై డీఎస్పీ విచారణ

ఒంగోలు క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వడ్డీ డబ్బులు ఇవ్వలేదంటూ ఒంటరి మహిళను స్తంభానికి కట్టివేసి కొట్టిన కేసును ఒంగోలు మహిళ పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమణకుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. స్థానిక నెహ్రూ కాలనీలో నివాసం ఉండే దార్ల మాధురి వడ్డీ డబ్బులు చెల్లించలేదని అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న సురేఖ ఈనెల 3న స్తంభానికి కట్టేసి విచక్షణ రహితంగా దాడి చేసింది. ఈమేరకు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్సీఎస్టీ చట్టం కింద ఎస్పీ విచారణ బాధ్యతలు డీఎస్పీ రమణకుమార్‌కు అప్పగించారు. ఈమేరకు ఆయన నెహ్రూకాలనీలోని సంఘటన స్థలాన్ని సందర్శించారు. బాధితురాలిని, సాక్షులను డీఎస్పీ విచారించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఒంగోలు క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం పలుప్రాతాలలో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈ రంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక జడ్పీకాలనీ, మంగమూరురోడ్డు, మర్రిచెట్టుకాలనీ, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి


ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బెటాలియన్ అధికారులు

మద్దిపాడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలోని 7వ బెటాలియన్ క్యాంపునకు తాగునీరు సౌకర్యం కల్పించాలని కోరుతూ పోలీస్ బెటాలియన్ అధికారులు ఒంగోలులో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తక్షణం తాగునీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఘనంగా వరల్డ్ ఆరెంజ్ డే



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్య సమితి ప్రకటించిన వరల్డ్ ఆరెంజ్ డే వేడుకలు మంగళవారం ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఒంగోలు హౌసింగ్ బోర్డులోని సమితి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. బాలికలపై హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ ఆరెంజ్ డే అనే నినాదాన్ని ఐక్యరాజ్య సమితి ఇచ్చిందని ఆమె తెలిపారు. ఆరెంజ్ రంగు శాంతికి చిహ్నమని, బాలికలపై జరిగే అత్యాచారాలు నిరోధించి శాంతియుతంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆరెంజ్ రిబ్బన్లు ధరించి ప్రతిజ్ఞ చేశారు. స్త్రీలు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు చైతన్యవంతం కావాలని మాజీ ఎంపీపీ నాళం నరసమ్మ పేర్కొనగా, యువతులు అవకాశాలు అందిపుచ్చుకుని ధైర్యంగా ముందడుగు వేయాలని సమితి కోశాధికారి బీరం అరుణ అన్నారు. కార్యక్రమంలో శక్తిసదన్ సిబ్బంది సీహెచ్.కనకదుర్గ, గుంటూరు శ్రీదేవి, పి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు చదలవాడలో 5కె రన్

నాగులుప్పలపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న ఉదయం 7 గంటలకు చదలవాడ గ్రామంలోని చతుర్వాటిక వద్ద నుంచి నాగులుప్పలపాడు బస్టాండ్ వరకు 5కె రన్‌ను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తేళ్ల రవికుమార్ తెలిపారు. అనంతరం బస్టాండ్‌సెంటర్‌లో మానవహారం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చని సూచించారు. విజేతలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద బహుమతులు అందించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

ఆటో అదుపు తప్పి వ్యక్తి మృతి

మద్దిపాడు డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడుగుండ్లపాడు వద్ద ఆటో అదుపుతప్పి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం వెలుగు చూసింది. వివరాల్లోనికి వెళితే రావినూతలకు చెందిన దొప్పలపూడి నాగేశ్వరరావు (55)రావినూతల నుంచి ఒంగోలుకు ఆటోలో బయలుదేరాడు. ఏడుగుండ్లపాడు వద్దకు రాగానే ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. 108 వాహనంలో మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మద్దిపాడు ఎస్సై వెంకటసైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పరిశీలించారు.

క్రిప్టో కరెన్సీపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : దేశంలో క్రిప్టో కరెన్సీపై పన్ను విధించడంపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ఆర్థిక సహాయకమంత్రి పంకజ్ చౌదరీ సమాధానం ఇస్తూ క్రిప్టో కరెన్సీలు లేదా డిజిటల్‌కరెన్సీలు ప్లాట్‌ఫారం వినియోగదారుల ద్వారా దేశవ్యాప్తంగా 2022-23లో రూ.221.27 కోట్లు, 2023-24లో రూ.362.70 కోట్లు, 2024-25లో రూ.511.83 కోట్లు వసూలు జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2022-23లో రూ.4లక్షలు, 2023-24లో రూ.7లక్షలు, 2024-25లో రూ.12 లక్షలు వసూలు చేసినట్లు చెప్పారు. దేశంలో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అక్రమ ధనాన్ని నివారించడం, ఉగ్రవాదా నికి ఆర్థిక సహాయం నిరోధించేందుకు పలు చర్యలు తీసుకున్నట్లు కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

మద్యం మత్తులో ఆత్మహత్య



రంగయ్య మృతదేహం

బేస్తవారపేట, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒతలపాలెంలో ఒక వ్యక్తి కుటుంబ కలహాలతో మద్యం సేవిం ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. అర్థవీడు మండలం వెలగలపాయ గ్రామానికి చెందిన రంగయ్య(35) తన అత్త ఇంటికి ఒతలపాలెం వలస వచ్చారు. కుటుంబ కలహాల నేపథ్యంలో మద్యం సేవించి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య దానమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వైసీపీ నేతపై అట్రాసిటీ కేసు

కంభం, డిసెబరు 9 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలానికి చెందిన టీడీపీ ఎస్సీ నాయకుడుపై వైసీపీ యువనాయకుడు దాడి చేశాడు. ఈ సంఘటనలో వైసీపీ నాయకుడిపై ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... కంభానికి చెందిన రాష్ట్ర విద్యా వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి నాయకుడు గోన చెన్నకేశవులుపై వైసీపీ నేత చెన్నారెడ్డి వై జంక్షన్ సమీపంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే విషయంలో కులం పేరుతో దూషిస్తూ దాడి చేశాడు. చెన్నారెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

నేడు కొమరోలు మండల సర్వసభ్య సమావేశం

కొమరోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం ఉదయం 10గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కామూరు అమూల్య అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు. అధికారులు గత సమావేశంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సమక్షంలో ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు పూర్తి సమాచారంతో రాగలరని అధికారులకు తెలిపారు.

నేటి నుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు

మార్కాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో విద్యుత్ శాఖకు సంబంధించి ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు ఫీడర్ల పరిధిలో వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసినట్లు రూరల్ ఏఈ యేర్వ నాగేంద్రరెడ్డి తెలిపారు. మండలంలోని కోమటికుంట 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చింతకుంట, ఎల్‌బీఎస్ నగర్, కొండేపల్లి ఫీడర్లలో బుధవారం వేకువజామున 4 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 3 నుంచి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు. మిగతా సమయంలో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతాయని, సరఫరా ఉండదని, రైతులు విద్యుత్ శాఖ నిర్ణయించిన ఈ సమయాల్లోనే వ్యవసాయ మోటార్లు ఉపయోగించుకోవాలని కోరారు. వారం రోజులపాటు సరఫరా ఇదే విధంగా ఉంటుందని తెలిపారు.

13 నుంచి క్రికెట్ పోటీలు

రాచర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పండుగ సందర్భంగా ఈనెల 13వ తేదీ నుంచి మండలంలోని అనుములవీడు గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గోన క్రాంతిదీపక్, జొన్నలగడ్డ యాకోబు, కొమ్మునూరి అనూప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.15వేలు, రెండవ బహుమతి రూ.10వేలు అందిస్తామని, ఆసక్తి కలిగిన వారు రూ.500 ప్రవేశరుసుం చెల్లించాలని కోరారు. వివరాలకు 7013138690, 9160319564, 7989146226 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గిద్దలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కడప లక్ష్మీ అధ్యక్షతన ఈనెల 17వ తేదీ ఉదయం 11గంటలకు మండల కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మండల శాఖల అధికారులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

సామూహిక పారాయణం

గిద్దలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత కోటి శ్లోక పారాయణాన్ని సామూహికంగా నిర్వహిస్తున్నట్లు వివిధ దేవస్థానాల ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి పాత బద్వేలు రోడ్డులోని రామాలయంలో రాత్రి 7గంటలకు భగవద్గీత కోటి శ్లోకాలను సామూహికంగా నిర్వహిస్తున్నామని, 15వ తేదీ వరకు ఈకార్యక్రమం కొనసాగుతుందని, భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

నీటి తడుల కోసం తంటాలు

వర్షం కోసం పొగాకు రైతన్నల ఎదురుచూపులు

కిలోమీటర్ల దూరం నుంచి నీటిని తరలిస్తున్న వైనం

ఇష్టారాజ్యంగా పైపుల బాడుగ పెంచిన టెంట్‌హౌస్ యజమానులు



ట్రాక్టర్లలో బాడుగకు పైపుల తీసుకెళుతున్న రైతులు



పొగాకుకు నీటితడి అందిస్తున్న రైతులు

పొదిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతుల పరిస్థితి ఈ ఏడాది అగమ్యగోచరంగా మారింది. ఒక ఏడాదిలో రెండు రకాలుగా వర్షాలు కురవడంతో నిస్తేజం ఏర్పడింది. అదునులో వర్షాలు కురవడంతో సంతోషంగా పంటలు సాగు చేశారు. పంటల బాగానే ఉన్నాయనుకుంటున్న తరుణంలో గత నెలలో మొంథా తుఫాన్ అతివృష్టిని సృష్టించింది. దీంతో మండలంలో వేలాది ఎకరాల్లో సాగు చేసిన కంది, పొగాకు, మిరప, సజ్జ, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొంతమంది రైతులు ఎడతెరిపి లేని వర్షాల కారణంగా నేటికీ పొగనాట్లు కూడా వేయలేని పరిస్థితి నెలకొంది. అధిక వర్షాల వలన నేల బిగుసుకుపోవడంతో సేద్యాలు చేయలేక సాగులో ఉన్న పైర్లు పెరుగుదల నిలిచిపోయిందని రైతులు చెబుతున్నారు.

ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం దిత్వా తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడతాయని బిగుసుకుపోయిన నేల యథావిధిగా వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. దీంతో రైతులు పైరును వదిలేయలేక నీటి తడులను పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఖర్చును లెక్క చేయకుండా కిలోమీటర్ల దూరం నుంచి పంటలకు నీటితడులు అందిస్తున్నారు. అసలే ఖర్చుల మోత మోగుతున్న సమయంలో మరోలక్ష అదనపు ఖర్చు పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిత్వా తుఫాన్ వల్ల వర్షాలు పడతాయనే ఆశతో రైతులు మూటనారు రూ.7వేలు వెచ్చించి నాట్లు వేశారు. వర్షాలు ముఖం చాటేయడంతో మొక్కలను బతికించుకోవడానికి రైతులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు.



నీటితడి అందించడంతో ఆశాజనకంగా పొగాకు

అమాంతం పెరిగిన నీటి పైపుల బాడుగలు

పంటలకు నీటి తడులు ఇచ్చేందుకు అవసరమైన పైపుల బాడుగ ఒక్కోటి పదిరోజుల క్రితం రూ. 3గా ఉంది ఇప్పుడు 8 నుంచి 10 రూపాయలు ఉంది. అయినా స్టాకు లేదని, ధర ఎవరు ఎక్కువ చెల్లిస్తే వారికే ఇస్తూ టెంట్‌హౌస్ యజమానులు జేబులు నింపుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది రైతులు పొగ చేలల్లో విడుపుల మొక్కలు వేసేందుకు కూడా వెనుకాడుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పొగ మొక్కలు పేనుబంక తెగులు ఆశించింది. మొత్తంమీద ఈఏడాది పంటల సాగు రైతులను అప్పుల ఊబిలోకి నెట్టే ప్రమాదం పొంచి ఉందని రైతు సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో పొగాకు 6400 ఎకరాల్లో సాగు చేసినట్లు వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ చెప్పారు.

పొగాకుసాగు ఇక చేయలేం

సుబ్బారావు కొండాయపాలెం

పొగాకు సాగు ఇక చేపట్టలేం. ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి నడుమ తీవ్రంగా నష్టపోతున్నాం. తొలుత సకాలంలో వర్షాలు కురిశాయి. పంటలు సాగు చేసుకున్నామని ఎంతో సంతోషపడ్డాం. ప్రస్తుతం పైర్లను బతికించుకునే క్రమంలో నీటితడులకు ఖర్చులు రెట్టింపు అవుతున్నాయి. దీనికితోడు కూలి రెట్టింపు చేస్తున్నారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుంటే ఎంతకష్టపడినా చివరకు నష్టాలు తప్పేలా లేవు.

మార్కాపురం జిల్లాతోనే అభివృద్ధి సాధ్యం



మునగపాడులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



కుంచేపల్లిలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

కొనకనమిట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లాను అభివృద్ధి దిశగా నడిచేలా నాయకులు, అధికారులు కృషిచేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు మోరబోయిన బాబురావు కోరారు. మండలంలోని మునగపాడు, బసావాపురం గ్రామాలలో సీఎం చంద్రబాబునాయుడి చిత్రపటానికి మంగళవారం టీడీపీ నాయకులు పాలాభిషేకం చేశారు. అనంతరం బాబురావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మార్కాపురం జిల్లా చేస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి అన్నమాట ప్రకారం జిల్లా ఏర్పాటు ప్రకటన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కుందూరు కాశిరెడ్డి, యోదుబాటి వెంకటనారాయణ, కాటంరాజు, తాతిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, భాషపతినాయుడు, భీమారెడ్డి, రేగడపల్లి సొసైటీ అధ్యక్షుడు కనకం నరసింహారావు, శ్రీకాంత్ రెడ్డి, అంజిరెడ్డి, గురువయ్య, అంకాల రోశయ్య, శ్రీనివాస్, పెద్దన్న, రమణయ్య, వెంకన్నా, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటు అభినందనీయం

పొదిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటు అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ చెప్పారు. మంగళవారం మండలంలోని సూదనగుంట గ్రామంలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో చంద్రబాబునాయుడిని మించిన వ్యక్తి మరొకరు లేరని కొనియాడారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దొర్నాల అంజిరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనీల్, మాదిరెడ్డిపాలెం సొసైటీ చైర్మన్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు రసూల్, శివాలయం మాజీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, శివాలయం చైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, మండల కార్యదర్శి కాటూరి శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు ఖుద్దూస్, ముని శ్రీను, తానికొండ వెంకట్రావు, గ్రామ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పంటలలో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయండి

పొదిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కంది, వరి, మిరప పంటలలో ప్రస్తుతం మారుకమచ్చ పరుగుల ఉధృతి ఉందని వాటిని నివారించేందుకు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు, తలమళ్ల రైతుసేవ కేంద్రాల్లో రైతులకు పొలంపిలుస్తుంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి ధనలక్ష్మి పాల్గొన్నారు.

పంటల అవశేషాల్ని కాల్చొద్దు

పెద్దారవీడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : పత్తి, మిరప వంటి పంటల కాలం పూర్తయ్యాక వాటిని కుప్పలుగా వేసి ఎండిన తర్వాత కాల్చవద్దని ఏవో ఎస్.లక్ష్మీ నారాయణ చెప్పారు. మండలంలోని తోకపల్లి, గొబ్బూరులలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది భావన, హైమావతి, వ్యవసాయవిస్తరణాధికారి సౌజన్య పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

ఎరగొండపాలెం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సాగు చేసిన పంట వివరాలను వ్యవసాయాశాఖ సిబ్బంది ద్వారా పంట నమోదు తప్పనిసరిగా రైతులు చేసుకోవాలని ఎర్రగొండపాలెం ఉద్యానవనశాఖాధికారి ఆదిరెడ్డి, ఏవో నీరజ చెప్పారు. మండలంలోని గంగపాలెం, నర్సాయపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

తర్లుపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న పంటపై ప్రస్తుతం కత్తెర పురుగు ఉధృతంగా ఉందని, దీని నివారణకు వెంటనే మేలైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలని ఏవో జ్యోత్స్నాదేవి తెలిపారు. మండలంలోని తుమ్మలచెరువు, జగన్నథపురంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవేంద్రగౌడ్, వ్యవసాయ సహాయకులు మల్లికార్జున్, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు

త్రిపురాంతకం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని ఏవో సంగమేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని ముడివేముల, జి. ఉమ్మడివరం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

వసతి గృహాల్లో వసతులు కల్పించండి

మంత్రి స్వామికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే ముత్తుముల



మంత్రి స్వామికి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని వసతి గృహాలలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మంత్రి స్వామికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన సచివాలయంలో మంత్రిని ఎమ్మెల్యే కలిసి వసతి గృహాలలోని సౌకర్యాల గురించి వివరించారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, అర్థవీడు, బేస్తవారపేట, కంభం మండలాల పరిధిలో గల వసతి గృహాలలో మంచినీటి సౌకర్యం కల్పించాలని, వసతి గృహాలలో డీప్‌బోర్లు వేయించి పైపులైన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన మంత్రి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

3 రోడ్లకు రూ.10.64 కోట్లు

త్రిపురాంతకం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఇప్పటికే పలురోడ్లకు నిధులు ఇచ్చిన ప్రభుత్వం తాజాగా మరో మూడు రోడ్లకు రూ.10.64 కోట్లను మంజూరు చేసింది. పంచాయతీరాజ్ శాఖ మంగళవారం విడుదల చేసిన జాబితాలో త్రిపురాంతకం మండల పరిధిలోని గుంటూరు-కర్నూలు రహదారి నుంచి సంగంతాండా రోడ్డు నిర్మాణానికి రూ.4.35 కోట్లు, పెద్దారవీడు మండలం బి.చెర్లోపల్లి నుంచి చట్లమిట్ట గ్రామానికి రోడ్డు నిర్మాణానికి రూ.3.70 కోట్లు, రేగుమానిపల్లి నుంచి పోతంపల్లికి రోడ్డు కోసం 2.59 కోట్లు మంజూరు చేసింది.

మార్కాపురానికి రూ.10.40 కోట్లు

మార్కాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోగల కీలకమైన నాలుగు రోడ్లకు రూ.10.40 కోట్లు మంజూరయ్యాయి. తర్లుపాడు నుంచి కలుజువ్వలపాడు, మార్కాపురం నుంచి పెద్దనాగులవరం, గొట్లగట్టు నుంచి నాయుడుపేట, పీడీ రోడ్డు నుంచి జువ్వలేరు వరకు రోడ్ల మరమ్మతులు చేస్తారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వ అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా సీఎంఎం ఎలీషా బాబు చెప్పారు. స్థానిక మెప్మా కార్యాలయంలో మంగళవారం మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని పొదుపు సంఘాల మహిళలకు సఖీ సురక్ష స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలీషాబాబు మాట్లాడుతూ పొదుపు మహిళలకు థైరాయిడ్, శాంటర్, షుగర్, తదితర 14 రకాల టెస్టులు నిర్వహించి 5 లక్షల ఆరోగ్య బీమా విలువైన అయుష్మాన్ భారత్ కార్డు ఇస్తారని తెలిపారు. ఈ కార్డు ద్వారా నెట్‌వర్క్ ఆసుపత్రులలో వైద్యం పొందవచ్చన్నారు. మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ శ్రేయస్సు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెప్మా పట్టణ అధ్యక్షురాలు దొడ్డ రమణ, ఆర్పీ హబీబా పాల్గొన్నారు.

చెన్నరెడ్డిపల్లిలో పారిశుధ్య పనులు

తర్లుపాడు, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నరెడ్డిపల్లిలో పారిశుధ్య పనులపై అధికారులు దృష్టి సారించారు. 9 రోజుల క్రితం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి దృష్టికి ప్రజలు పారిశుధ్య సమస్యను తీసుకొచ్చారు. ఎట్టకేలకు మంగళవారం గ్రామంలోని పారిశుధ్య పనులను ఎక్స్‌కవేటర్ ద్వారా చేయించారు. కాలువల్లో పూడిక తీయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పంచాయతీ కార్యదర్శి ఈవోఆర్డీ రాఘవరావు ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రఫీ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఖాసింలు కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రాన్ని ఆఫీస్ గోడకు మంగళవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల12న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

అగ్నివీర్ వాయు ఉద్యోగానికి ఎంపిక

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని నేతాజీ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందిన పుచ్చకాయల వెంకట శివనాగరాజు అగ్నివీర్ వాయు ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ సలహాదారులు కాశిరెడ్డి మంగళవారం మాట్లాడుతూ భారత వాయు సేన విడుదల చేసిన అగ్ని వాయు ఉద్యోగాల తుది ఫలితాలలో నాగరాజు రాష్ట్రంలో 10వ స్థానం, ఆల్ ఇండియా స్థాయిలో 247వ స్థానం పొంది ఉద్యోగం సాధించాడని తెలిపారు. అధ్యాపకులు బ్రహ్మం, వీరభద్రారెడ్డి, శేషు గౌతం, ఫణికుమార్, రాజశేఖర్‌లు నాగరాజును అభినందించారు.

ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు

రాచర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దళితకాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించిన ప్రజా ప్రభుత్వానికి దళితులు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అనుమలవీడు దళిత కాలనీలో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉండడంతో దళితులు, స్థానిక టీడీపీ యువనాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి విషయాన్ని శాసనసభ్యులు అశోక్ రెడ్డికి తెలిపారు. ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను కొద్ది రోజుల్లోనే పరిష్కరించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి, అంబవరం శ్రీనివాసరెడ్డికి, ప్రజా ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

వరిని తక్కువ ధరకు అమ్ముకోవద్దు

కంభం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారుల మాటలు నమ్మి వరి పంటను తక్కువ ధరకు అమ్ముకోవద్దని ఏవో మహమ్మద్ రైతులకు సూచించారు. ఆయన కందులాపురం, రావిపాడు గ్రామాల రైతులతో కలిసి వరి పంటను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వరి పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, మద్దతు ధర రూ.2,389 ప్రకారం కొనుగోలు చేస్తామని చెప్పారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

అర్థవీడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అర్థవీడు మండలం యాచవరం ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు టి.వి. కృష్ణయ్య రూ.2800 విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ఈ సమయం ఎంతో విలువైనదని, దీనిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.గురవయ్య, ఉపాధ్యాయులు, దాత కృష్ణయ్యకు అభినందనలు తెలిపారు.

అవీఇవీ

గర్భిణులకు డ్రైఫ్రూట్స్ పంపిణీ



డ్రై ఫ్రూట్స్, పండ్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం

గిద్దలూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవివేకానంద కళాశాలలో 1983-85-88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సకు వచ్చిన 80 మంది గర్భిణులకు డ్రైఫ్రూట్స్‌తోపాటు వివిధ రకాల పండ్లను అందచేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జామ, మామిడి మొక్కలను నాటారు. జనవరి 11వ తేదీన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రమణరెడ్డి, డాక్టర్ ప్రవీణ్, వైద్య సిబ్బందితోపాటు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కాశయ్య, రంగస్వామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఖాదర్‌వలి, రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సకాలంలో బస్సు సౌకర్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో శివరామిరెడ్డి

బేస్తవారపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు ఆర్టీసీ అధికారులు విద్యార్థులకు అనువైన వేళల్లో బస్సులను నడిపి ఇబ్బందులను తీర్చారు. గొల్లపల్లె రూట్‌కు సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులు సోమవారం సాయంత్రం ధర్నా చేసిన విషయం తెలిసిందే. మంగళవారం మార్కాపురం ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మార్కాపురం, గిద్దలూరు ఆర్టీసీ అధికారులతో, బేస్తవారపేట జిల్లా పరిషరిత్ హైస్కూల్ విద్యార్థులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఉదయం స్కూల్ సమయానికి, సాయంత్రం స్కూల్ ముగిసిన సమయానికి బస్సు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.జీతేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణకు మందుల పంపిణీ

ఎరగొండపాలెం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పశువులలో వచ్చే నట్టల వ్యాధి నివారణ చర్యలపై పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చిన్నబాలు నాయక్ చెప్పారు. మంగళవారం కొత్తపల్లిలో పశువులకు వచ్చే పలు రకాల వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పశువులకు అవసరమైన మందులు, రైతులు అవసరమైన 65 కేజీల మినరల్ మిక్చర్ ప్యాకెట్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు శివారెడ్డి, మంత్రునాయక్, నాగూర్ మీరా, ఎల్ఎస్ఏ మంత్రు నాయక్, పుల్లారెడ్డి, శివనాయక్, బాదరయ్య, నరసింహ పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం నిధులివ్వండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న చైర్మన్ బాలయ్య

గిద్దలూరు టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మార్కెట్‌యార్డు ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేయాలని ఏఎంసీ చైర్మన్ బైలడుగు బాలయ్య మంగళవారం గుంటూరు మార్కెట్ యార్డు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు చైర్మన్ బాలయ్య, కమిషనర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. గిద్దలూరు ప్రాంతంలో రైతులు మిరప పంటను అధికంగా సాగు చేస్తారని, అందుకు ఏసీ గోడౌన్లను కూడా మంజూరు చేయాలని కోరారు. అలాగే మార్కెట్‌యార్డు పరిధిలోని రైతుల పొలాలకు సరియైన రహదారులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా రహదారులు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

104 ఏళ్ల వృద్ధుడు మృతి

అప్పట్లోనే మద్రాస్‌లో లా చదివిన వైనం



సుబ్బారెడ్డి(ఫైల్)

బేస్తవారపేట, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలం ఒందుట్ల గ్రామానికి చెందిన ఎస్సీవో సుబ్బారెడి(104) మంగళవారం స్వగ్రామంలో మృతి చెందారు. ఈయన మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో లా డిగ్రీ పూర్తి చేసి సోషల్ ఎక్స్‌టెన్షన్ అధికారిగా ఉద్యోగం పొందారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో ఈ ప్రాంతంలో రైతు సదస్సులు ఏర్పాటు చేసి బత్తాయి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ ప్రాంతంలో బత్తాయి సాగు చేసిన మొదటి రైతు సుబ్బారెడ్డి కావడం గమనార్హం. 1950లో గుంటూరు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. మాజీ ముఖ్యమంత్రి భవనం వెంకట్రామిరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పులి వెంకటరెడ్డి, మృతుడు సుబ్బారెడ్డిలు కలసి చదువుకున్నారు.

ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈవో

కొనకనమిట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొట్లగట్టు గ్రామంలోని హెచ్‌డీ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో బరిగె నరసింహారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల హాజరు, సెలవులు, విద్యార్థుల హాజరు, సామర్థ్యాలు, సిలబస్ పూర్తి, బోధన ఉపకరణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ సభ్యులు సిహెచ్. శర్మ, కాశీషా, బ్రహ్మం, సిహెచ్‌ఎం. ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫణీంద్రకుమార్, ఉపాధ్యాయులు వెంకటేశ్వరావు, హైమావతి, సీఆర్పీ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

తర్లుపాడు, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జాపేట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఎంఈవో దేవరకొండ సుజాత పంపిణీ చేశారు. దేవిరెడ్డి నాగిరెడ్డ జ్ఞాపకార్థం దేవిరెడ్డి సాయినాథరెడ్డి ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన నోట్ పుస్తకాల పంపిణీ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పిన్నిక శ్రీహరి చక్రవర్తి, ఉపాధ్యాయులు గొప్పరాజు శ్రీనివాసులు, శ్రీకాంత్, సీఆర్పీ అచ్యుతకుమార్ పాల్గొన్నారు.

100రోజుల ప్రణాళిక పది విద్యార్థులకు ఓ వరం

కంభం, డిసెబరు 9 (ఆంధ్రజ్యోతి) : వందరోజుల కార్యాచరణ ప్రణాళిక 10వ తరగతి విద్యార్థులకు ఓ వరమని ఎంఈవో అబ్దుల్ సత్తార్ చెప్పారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 10వ తరగతి విద్యార్థుల 100రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని ఎంఈవో పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యరామారావు, ఖయ్యాం, రమణారెడ్డి పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు

రాచర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో షేక్ మహబూబ్ బాషా చెప్పారు. మండలంలోని గంగంపల్లి, అనుములపల్లి, రాచర్ల గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు లలిత, హర్షవర్ధని పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రచారం

కొమరోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి - హిందూ జ్ఞాన వేదిక గిద్దలూరు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని బాదినేనిపల్లెలో ఇంటింటా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదిక గిద్దలూరు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు శివకుమార్, ఖాదర్, పుల్లమ్మ, లక్ష్మీదేవీ, శేఖర్, శ్రీకాంత్, వెంకటేష్, భాగ్యం, సుభాషిణి, స్వాతిలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

పామూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని ఏవో టి.అబ్రహాం లింకన్ సూచించారు. మండలంలోని మోపాడు, లక్ష్మీనరసాపురం రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మధ్యవర్తుల ద్వారా ధాన్యాన్ని అమ్ముకోవద్దని తెలిపారు. అనంతరం ఎల్ఎన్‌పురం గ్రామంలో సాగులో ఉన్న వరి పంటను సందర్శించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్.ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు

పామూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపు మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు మంజూరు చేయాలని ఎల్‌డీఎం రమేష్ సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పామూరు, సీఎస్‌పురం మండలాల బ్యాంకు అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపు గ్రూపులలోని మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీపీఎం అంబేద్కర్, ఇన్‌చార్జ్ ఏపీఎం ఎం.అశోక్, మండల సమాఖ్య కార్యదర్శి ఉమ్మడి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు పోటీలు

కురిచేడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంను మంగళవారం కురిచేడు స్పెషల్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖాధికారి ఆర్.వస్రాం నాయక్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి కురిచేడు ఆర్యవైశ్య సంఘం వారు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జవ్వాజి సత్యనారాయణ, కొత్తా అయ్యప్పసెట్టి, దేవతి నాగేంద్రబాబు, మోదాల ఆంజనేయులు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోరంబోకు భూములను కాపాడుకోవాలి

పామూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం, ఐటీసీ సహకారంతో ఉమ్మడి వనరుల పునరుద్ధరణ, జీవ వైవిధ్యం కార్యక్రమాలు చేపట్టాలని ఏపీవో బి.మాల్యాద్రి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఖైరాడ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉపాధి సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈసందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ జీవ వైవిధ్య కార్యక్రమాల్లో భాగంగా కొండలు, గుట్టలు, పశువుల పోరంబోకు భూములను కాపాడుకోవాలన్నారు. ఖైరాడ సంస్థ కోఆర్డినేటర్ చిన్న కోటయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో సీవో రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

శిథిలావస్థలో కల్వర్టు

పామూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన కల్వర్టుతో ప్రమాదం పొంచిఉందని ఏఎంసీ వైస్‌చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని మోపాడు రిజర్వాయర్ పరిధిలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామంలో ఇరిగేషన్ మెయిన్ కాలువపై నిర్మించిన కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రమాదకరంగా మారిన కల్వర్టును ప్రాజెక్టు సూపర్‌వైజర్మన్ చుంచు కొండయ్య, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్‌తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులకు ప్రమాదాల జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

పామూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనిమెర్ల మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు పలకలు, నోటుబుక్కులు, పెన్నులు, పెన్సిళ్లను మంగళవారం రిటైర్డ్ ఉపాధ్యాయుడు యాదాల మాలకొండయ్య అందజేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మన్నె హరనాధరెడ్డి, ఎస్.మాల్యాద్రి, ఎం.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగా పనులు చేపట్టాలి

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని టీడీపీ నాయకుడు మన్నేపల్లి శ్రీనివాసులు సూచించారు. సీఎస్‌పురంలోని పామూరు రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న 167బీ హైవేరోడ్ నిర్మాణంలో భాగంగా డొక్కలవాగు వద్ద నిర్మిస్తున్న సిమెంటు, తారురోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా సైడ్ డ్రైన్ పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు.

పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ భరోసా

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

» నూతన డయాలసిస్ భవన నిర్మాణ పనుల పరిశీలన


బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో భరోసా అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి ప్రాంగణంలో మంగళవారం 37 మంది లబ్ధిదారులకు రూ.21.36లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ ఎంతో ఖర్చుతో కూడుకున్న వైద్యం చేయించుకోలేక పేద కుటుంబాలు అనారోగ్యంతో కాలం వెల్లదీస్తున్నారన్నారు. ఆ కుటుంబాలకు సీఎం చంద్రబాబు అండగా నిలబడుతూ కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పించే ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న డయాలసిస్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన భవనంలో డయా లసిస్ బాధితులకు ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కనిగిరి ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన తెనాలి వైద్య బృందం

ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన తెనాలి వైద్యబృందం

కనిగిరి ప్రభుత్వాసుపత్రిని గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్‌అన్సారియా, జిల్లా డీసీహెచ్ఎస్ ఆదేశాలతో తెనాలి ప్రభుత్వాసుపత్రి వైద్య బృందం పరిశీలించారు. ఆసుపత్రిలోని కంగారుమదర్ కేర్ సెంటర్, ప్రసూతి కేంద్రంతో పాటు ఆసుపత్రిలోని వసతులను, సౌకర్యాలను పరిశీలించారు. కంగారు మదర్‌కేర్ సెంటర్ ఏర్పాటు, నిర్వహణ తీరును వారు అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

» డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్

కనిగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం జరిగిన డివిజన్‌స్థాయి పోలీసు అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కిల్ పరిధిలోని స్టేషన్లలో ఉన్న పెండింగ్ కేసులను త్వరతగతిన గుర్తించాలన్నారు. ప్రాపర్టీ నేరాలకు చెందిన దొంగలపై నిఘా పెంచాలన్నారు. లోక్‌అదాలత్‌లో పరిష్కారం కానున్న పెండింగ్ కేసులు, చార్జ్‌షీట్లు, విచారణ కేసులకు చెందిన వాటిపై వేగవంతంగా స్పందించాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలకు త్వరతిగతిన న్యాయం చేకూరేలా పోలీసు అధికారులు చొరవ వహించాలన్నారు. సమావేశంలో సీఐ ఉప్పు శ్రీనివాసులు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'స్క్రబ్ టైఫస్'పై అప్రమత్తంగా ఉండాలి

» మండల ప్రత్యేకాధికారి కుమార్


స్క్రబ్ టైఫస్ వ్యాధిగురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాళ్లూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి ఏ.కుమార్ తెలిపారు. మంగళవారం తాళ్లూరులోని పారువేట వీధిలో ప్రజలకు ఈవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కుమార్ మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ వ్యాధి సన్నటి క్రిమికీటకం ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఇది అంటు వ్యాధి కాదని, జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు వ్యవసాయ పనులు, గడ్డివాముల నుంచి గడ్డి తీసుకువెళ్లేటప్పుడు తేమ తగల కుండా చేతితొడుగులు, కాళ్లకు నిండు చెప్పులు తప్పనిసరిగా వాడాలన్నారు. తేమలో ఉండే ఈ వ్యాధివ్యాప్తికి చెందిన చిన్నక్రిములు శరీరం తాకగానే ఎర్రటి మచ్చలు వస్తాయన్నారు. దీనిని గుర్తించి తక్షణ వ్యాధినివారణ చర్యలు పాటిస్తే ఇబ్బందులు ఉండవన్నారు.

తాళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్ యాదవ్ మాట్లాడుతూ ఈవ్యాధి మంచాలు, గడ్డివాములు, ఇతరప్రాంతాల్లో ఉండే కీటకాలద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. వ్యాధిగ్రస్తులకు జ్వరం వచ్చి తగ్గకుండా తల నొప్పి వస్తుందన్నారు. జ్వరం తగ్గకుండా ఉండి ఊపిరితిత్తుల సమస్యల, తలభారం సమస్య ఎక్కువై ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. జ్వరం రాగానే వైద్యశాలకు వచ్చి తగు చికిత్సలు చేయించుకుంటే ఇబ్బందులు ఉండవన్నారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన పని లేదని, జ్వరం రాగానే చికిత్సలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణారావు, వైద్యాధికారి మౌనిక, ఏపీవో వెంకటేశ్వర్లు, వీఆర్వో నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ళ చేతిలో మోసపోవద్దు!

» ఎస్ఐ కె.కమలాకర్


మాట్లాడుతున్న ఎస్ఐ కమలాకర్

ముండ్లమూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ళ చేతిలో మోసపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. ఇతర వ్యక్తుల నుంచి ఓటీపీ, ఆధార్ కార్డు, ఇతర వివరాలు చెప్పాలని మెసేజ్‌లు వస్తే ఎవరూ చెప్పవద్దన్నారు. మండలంలోని మారెళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమంలో ఎస్ఐ కమలాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అందరూ కలసిమెలసి జీవించాలన్నారు. చిన్నచిన్న విషయాలకు పంతాలకు వెళ్ళి ప్రశాంత వాతావరణం చెడగొట్ట వద్దన్నారు. యువత పెడద్రోవ పట్టకుండా వారి తల్లిదండ్రులు చూడాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ఇబ్బందుల పాలు కావద్దన్నారు. కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మట్టా సుబ్బారెడ్డి, సుంకర రాఘవ రెడ్డి, ఎంపీటీసీ పాలపర్తి సుబ్బారావు, డాక్టర్ పాశం వెంకటేశ్వరరావు, బుర్రి అంజయ్య, గాలం శ్రీనివాస రావు, గార్లపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులుగా రహదారులు

» దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

» వ్యాధులు వ్యాపిస్తాయని ఆందోళన


పెద ఉల్లగల్లులో రహదారి పక్కన పడ వేసిన వ్యర్థ పదార్థాలు

ముండ్లమూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు రహదారులు డంపింగ్ యార్డులుగా మారాయి. ప్రధానంగా పెద ఉల్లగల్లు వద్ద దారుణంగా ఉంది. గ్రామంలో లక్షలాది రూపాయలు పెట్టి నిర్మించిన డప్పింగ్ యార్డులు ఉన్నా ఉపయోగం లేకుండా ఉన్నాయి. గ్రామంలోని వ్యర్థపదార్థాలను, చెత్తాచెదారాన్ని అందులో వేయకుండా రహదారుల మీదనే పడవేస్తున్నారు. దీంతో దుర్వాసనతో సమీపంలోని నివాస ప్రాంతాలతో పాటు రోడ్లపై వెళ్లే వాహన చోదకులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు.


పెద ఉల్లగల్లు - వినుకొండ మార్గంలో పడవేసిన వ్యర్థ పదార్థాలు

పట్టించుకోవాల్సిన పంచాయతీ అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

గత పదిహేను రోజుల నుంచి పెద ఉల్లగల్లు గ్రామంలో ముగ్గురికి స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకింది. దీంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ప్రధానంగా అద్దంకి - దర్శి ప్రధాన రహదారి పక్కన సమీప నివాస ప్రాంతాల వారు వ్యర్థపదార్థాలను రోడ్డు పక్కనే పడవేస్తున్నారు. ఉల్లగల్లు నుంచి కెల్లంపల్లి వయా వినుకొండ వెళ్ళే ప్రధాన రహదారి పక్కన కూడా వ్యర్థ పదార్థాలు వేస్తున్నారు. చింతలపూడి వెళ్ళే ప్రధాన రహదారి పక్కన విశాలమైన స్థలంలో డంపింగ్ యార్డు నిర్వహించారు. క్లాప్ మిత్రలు ప్రతి రోజు గ్రామంలో చెత్తాచెదారాన్ని సేకరించి డంపింగ్ యార్డులో పడవేస్తారు. అయితే, ఆ గ్రామంలో ఆ రెండు ప్రధాన రహదారుల పక్కన కొందరు వ్యర్థపదార్థాలు పడవేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి ఇవి కుళ్ళి దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో ఆమార్గంలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం గ్రామాలన్నీ స్వచ్ఛతగా ఉండాలని, పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని పదే పదే ప్రకటనలు గుప్పించటం తప్ప ఆచరణలో ఏమి లేదు. సంబంధిత పంచాయతీ శాఖ అధికారులు మొక్కుబడిగానే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు తప్ప చిత్తశుద్ధిగా చేసిన దాఖలాలు లేవు.

మండలంలోని పసుపుగల్లు, మారెళ్ళ, ఉమామహేశ్వర అగ్రహారం, ఈదర, పులిపాడు గ్రామాల్లోనూ రహదారుల పక్కనే వ్యర్థ పదార్థాలను పడవేస్తున్నారు. వీధికుక్కలు, పందులు ఆవ్యర్థ పదార్థాలను రహదారులపై తీసుకొస్తుండటంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులను డంపింగ్ యార్డులుగా మార్చకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని హెచ్‌ఎంలు ఎస్ఎం షరీఫ్, షేక్ రసూల్‌లు అన్నారు. మండలంలోని అంబవరం, డీజి పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను గుంటిమడుగు సతీష్‌వర్మ, కటకం వెంకట సత్యనారాయణ ఆర్థికసహకారంతో మంగళవారం అందజేశారు.

కార్యక్రమంలో నారిశెట్టి వెంకట్రామయ్య, గోదాసు వేమ నారాయణ, ఇర్ల కొండయ్య, జె.వెంకట్రావు, జి.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ అదాలత్‌లో మాట్లాడుతున్న పీజీఆర్ఎఫ్ చైర్మెన్ విక్టర్ ఇమ్మానుయేల్, పాల్గొన్న ఎస్ఈ వెంకటేశ్వర్లు తదితరులు

నాణ్యతమైన విద్యుత్ అందించేందుకు చర్యలు

దర్శి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు పీజీఆర్ఎఫ్ చైర్మన్, మాజీ జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్ తెలిపారు. దర్శిలో సోమవారం విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాడకంపై ప్రజలు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. శ్లాబుల వివరాలు, రాయితీలు, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. ఈసందర్భంగా ఏడు అర్జీలు అందగా ఆరింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కె.సుబ్బారావు, ఈఈ పి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కందిలో వెర్రి తెగులు

దొనకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కంది పంటకు వెర్రి తెగులు సోకిందని మండల వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇండ్లచెరువు, వెంకటాపురం గ్రామాల్లో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కందిలో అక్కడక్కడా వెర్రి తెగుళ్లతో పాటు శనగపచ్చ పురుగును గమనించినట్లు చెప్పాఉ. ఈ పురుగు నివారణకు ఎకరాకు పది చొప్పున లింగాకర్షన బుట్టలు పంట కంటే ఒక అడుగు ఎత్తులో అమర్చుకోవటం ద్వారా పురుగు ఉధృతి తగ్గించవచ్చన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే వేపనూనె 500 ఎంఎల్‌తో పాటు క్లోరోఫైరిపాస్ 500 ఎంఎల్ లేదా నోవల్యూరాన్ 200 ఎంఎల్ లేదా ఫ్లూబెండమైడ్ 20శాతం డబ్ల్యూజి 40 గ్రాములు లేదా ఎమామెక్టిన్ బెంజోయెట్ 80 గ్రాములు ఒక ఎకరాకు 20 లీటర్లు నీటితో కలిపి పిచకారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.వెంకటరావు, వ్యవసాయ సహాయకులు రామాంజనేయులు, కమల, విన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకోవాలి

ముండ్లమూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లో అమ్ముకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు అన్నారు. మంగళవారం మండలంలోని కెల్లంపల్లి, పసుపుగల్లు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటా రూ.2389 నిర్ణయించినట్లు చెప్పారు. దళారులు బస్తా రూ.1300 నుంచి రూ.1400 వరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో రైతులు నష్ట పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులందరూ మద్దతు ధరకు పంటలు అమ్ముకోవాలంటే తప్పనిసరిగా ఈపంటలో నమోదు వివరాలు తెలియ పరచాలన్నారు. మండలంలో పసుపుగల్లు, ముండ్లమూరు, బొప్పుడివారిపాలెంలో సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విస్తరణాధికారి శ్రీకీర్తి, వీఏఏలు విజయనిర్మల, వీరాంజనేయులు, ఉద్యాన సహాయకులు సువర్చల, బీటీఎం శేషయ్య, ఏపీఎం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.12 కోట్లతో రోడ్ల అభివృద్ధి

కనిగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు విడుదలచేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అందులోభాగంగా కనిగిరి నియోజకవర్గంలోని నాలుగు ప్రధానరోడ్ల అభివృద్ధికి రూ.11.84 కోట్లు కేటాయించారు. వెలిగండ్ల మండల పరిధిలోని మొగళ్ళూరు నుంచి చీర్లదిన్నె వరకు రూ.3 కోట్లతో రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. పామూరు మండలపరిధిలోని పామూరు, నెల్లూరు రోడ్డులోని 2కిమీ రాయి నుంచి జంగాలపల్లి మీదుగా వయా తూర్పుకోడిగుడ్లపాడు గ్రామానికి 5కి.మీటర్ల మేర రూ.2.88 కోట్లతో రోడ్డు అభివృద్ధి చేపట్టనున్నారు. హెచ్‌ఎంపాడు మండల పరిధిలోని హనుమంతాపురం నుంచి నందనవనం గ్రామానికి వెళ్ళే ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి రూ.3.18కోట్లు వెచ్చించనున్నారు. కనిగిరి నుంచి డీజీపేట ఆర్అండ్‌బి రోడ్డు 41కి.మీ రాయి నుంచి రామాపురం గ్రామానికి వెళ్ళే రోడ్డుకు దాదాపు 5కి.మీ. మేర రూ.2.72 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.

సస్యరక్షణపై రైతులు అవగాహన పెంచుకోవాలి

పీసీపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంటలసాగులో సస్యరక్షణ చర్యలపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఎన్.రంగాకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని వేపగుంపల్లి, కమ్మవారిపల్లిలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన కంది పంటను పరిశీలించి రైతులకు పలుసూచనలు చేశారు. కందిలో పురుగుల నివారణ కోసం లీటరు నీటిలో 2ఎంఎల్ క్లోరోఫైరిపాస్, 5ఎంఎల్ నీమ్‌ఆయిల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే మినుము పంటలో ఎకరాకు వందగ్రాముల ప్రోక్లైమ్, 13-0-45 ఒక కేజీని కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో షబానా, బాలసుబ్బయ్య, తిరుపతయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.17 లక్షల 50వేలు

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణ స్వామి హుండీలను మంగళ వారం దేవదాయశాఖ జిల్లా అధికారి ఎం.పానకాలరావు, కందు కూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ జీఏ సత్యనారాయణ పర్యవేక్షణలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ. 17,47,923 వచ్చినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. మూడు నెలల తొమ్మిది రోజులకుగాను మెయిన్ హుండీ ద్వారా రూ.16,91,950, అన్నదానం హుండీద్వారా రూ.55,973 ఆదాయం వచ్చిందని తెలిపారు. 94 గ్రాములు బంగారం, 6 కేజీల 233 గ్రాముల వెండి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చినఆది నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించాలి


సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు సూచించారు. మండలంలోని వీలంవారిపల్లిలో గల కేవీఎన్ఎల్ ప్లస్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ

పీసీపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల అప్రమత్తత ద్వారా నేరాలను నియంత్రించవచ్చునని ఎస్ఐ జి.కోటయ్య అన్నారు. ఇటీవల మండలంలో జరిగిన పలు నేరాలపై జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశా లతో గ్రామాల్లోని ప్రజలకు ఆయన అవగాహన కల్పిస్తున్నారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పొలం పనులకు వెళ్లేవారు, వివిధ పనులపై ఒంటరిగా వెళ్లేవారు విలువైన బంగారపు వస్తువులను ధరించ వద్దన్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసే మహిళలు అప్రమత్తంగా ఉండా లని సూచించారు. గ్రామాలు, లేదా పరిసర ప్రాంతాల్లో అపరిచిత, అనుమానాస్పద వ్యక్తులెవరైనా సంచరిస్తుంటే డయల్ 100, దగ్గర్లోని పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు. గొర్రెల కాపర్లు ఆరుబయట గొర్రెలు, మేకలను ఉంచేటప్పుడు అక్కడ ఇద్దరు లేదా అంతకుమించి వ్యక్తులు కాపలా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏచిన్న సంఘటన జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు

ముండ్లమూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్లపల్లి వయా నూజెండ్లపల్లి - మారెళ్ళ రహదారి, చిన ఉల్లగల్లు వయా పాపిరెడ్డిపాలెం - సింగనపాలెం రహదారుల అభివృద్ధికి రూ 8.20 కోట్లు నిధులు మంజూరయినట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మంగళారం రాత్రి తెలిపారు. చిన ఉల్లగల్లు ఎస్సీ కాలనీ నుంచి వయా పాపిరెడ్డిపాలెం - సింగనపాలెం వరకు తారు రోడ్డు నిర్మించేందుకు రూ. 4.5 కోట్లు మంజూరయినట్లు తెలిపారు.





ఉత్పత్తి రంగాలపై దృష్టి సారించాలి

- బ్యాంకర్లను ఆదేశించిన కలెక్టర్ వినోద్ కుమార్

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి రంగాల వైపు దృష్టి సారించాలని, జీవనోపాధుల వృద్ధికి అధిక రుణాలు ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ బ్యాంకర్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీపై చైర్మన్ హోదాలో కలెక్టర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొదుపు మహిళల్లో ఆర్థిక స్వేచ్ఛ సాధించేలా స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ఎదిగే అవకాశాలు బ్యాంకర్లు కల్పించాలన్నారు. సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లాలో ప్రాధాన్య రంగాలకు రూ.13,792.66 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.8,315 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15,820 కోట్లు రుణాల లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.10,618 కోట్లతో 67.13 శాతం మాత్రమే లక్ష్యాలు సాధించినట్లు తెలిపారు. రానున్న మూడు నెలల్లో లక్ష్యాల పురోగతి సాధించాలన్నారు. వ్యవసాయరంగానికి రూ.12,080 కోట్లకు రూ.7,416 కోట్లు రుణాలిచ్చామన్నారు. 32,479 పొదుపు సంఘాలు ఉండగా 3,979 సంఘాలకు రూ.604.02 కోట్లు మాత్రమే రుణాలివ్వడంపై కలెక్టర్ ఆరాతీశారు. బ్యాంకర్లు మానవతా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో 8 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలని లక్ష్యం కాగా నేటికి 2,254 కార్డులు జారీపై ఆరాతీశారు. కౌలు రైతులకు రూ.100కోట్ల రుణాలివ్వాలని లక్ష్యం నిర్దేశించుకుంటే కేవలం రూ.13.62 కోట్లు విడుదల చేయడం ఏమిటని బ్యాంకర్లను ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆర్.బి.ఐ.ఎల్.ఎల్.డివో అభిషేక్, ఎల్‌డీఎమ్ శివకృష్ణ, నాబార్డ్ డీడీఎమ్ రవికుమార్, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ మాధురి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- మంత్రి గొట్టిపాటి చొరవతో రూ.21.66 కోట్లు

అద్దంకి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 8 గ్రామీణ రోడ్ల కు మహర్దశ పట్టనున్నది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో పంచాయతీరాజ్ పరిధిలోని 8 గ్రామీణ రోడ్లకు రూ.21.66 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వంలో కనీస మరమ్మతులకు కూడా నోచుకోని రోడ్లకు తమ ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినట్లు గొట్టిపాటి తెలిపారు. నియోజకవర్గంలోని 8 పంచాయతీరాజ్ రోడ్లకు రూ.21.66 కోట్లు మంజూరు చేసిన సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు.



ఉప్పుమాగులూరు-కొణిదెన రోడ్డు

నిధులు ఇలా..

కొరిశపాడు మండలం దైవాలరావూరు నుంచి బొల్లవరప్పాడు మీదగా పమిడిపాడు వరకు రోడ్డు అభివృద్ధికి రూ.1.93 కోట్లు, నామ్ రోడ్డు నుంచి బొడ్డువానిపాలెం వరకు రూ.2.28 కోట్లు, మేదరమెట్ల-రాచపూడి కృష్ణంరాజుపాలెం మీదగా ఓల్డ్ మద్రాస్ రోడ్డుకు రూ.1.60 కోట్లు, పంగులూరు మండలం కొండమంజులూరు నుంచి కల్లంవారిపాలెం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.4.10 కోట్లు, బల్లికురవ మండలం ఉప్పమాగులూరు నుంచి కొణిదెన వరకు రోడ్డు అభివృద్ధికి రూ.4.35 కోట్లు, అద్దంకి మండలం బొమ్మనంపాడు నుంచి చెరువుకొమ్ముపాలెం రోడ్డు నిర్మాణానికి రూ.2.91 కోట్లు, అద్దంకిలోని కాకానిపాలెం నుంచి బొమ్మనంపాడు రోడ్డు అభివృద్ధికి రూ.3.25 కోట్లు, నాగులపాడు నుంచి కొంగపాడు డొంక వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.24 కోట్లు మంజూరయ్యాయి.

కొనుగోళ్లు కొంతే

బహిరంగ మార్కెట్‌కు తరలిపోతున్న ధాన్యం

రైతు సేవా కేంద్రాల్లో సేకరణలో స్తబ్ధత

- అధికారుల ఉదాసీనతతో తీసికట్టుగా మద్దతు ధర
- మిల్లర్లతో సిబ్బంది లాలూచి.. పట్టించుకోని అధికారులు

మద్దతు ధరకు ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం.. దళారుల మాటలు నమ్మి అన్న దాతలు మోసపోవద్దు.. అధి కారులు పూర్తిగా సహకరిస్తారు.. రవాణా నుంచి ఎక్కడా ఎలాంటి ఇబ్బంది ఉండదు.. అని మంత్రుల నుంచి కలెక్టర్ వరకు ప్రకటిస్తు న్నారు. కానీ అన్న దాతలకు ఏ స్థాయిలోనూ మద్దతు ఉండటం లేదు.. ధర దక్కడంలేదు. అధికా రుల ఉదాసీనతతో బహిరంగ మార్కెట్‌కే అత్యధికంగా ధాన్యం తరలిపోయిందని సివిల్ సప్లయిస్ లెక్కలు తెలియజేస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు సమీపంలో కూడా ఇప్పటి వరకు మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరగలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయానికి అన్నదాతలు ఎందుకు ముందుకు రావడం లేదు.. లోటుపాట్లు ఏమిటి అనే విషయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ధాన్యం సేకరణ అంకంలో కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటు చేశారే కానీ బహిరంగ మార్కెట్ అంశం తమదే కాదన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యం బహిరంగ మార్కెట్‌కు తరలినట్లు అంచనాలు ఉన్నాయి.



బాపట్ల: గూడవల్లి సమీపంలోని రహదారిపై ఆరబోసిన ధాన్యం

సాంకేతిక సమస్యలతో జాప్యం..

రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి యాప్ సర్వర్‌కు సాంకేతిక సమస్యతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. స్లాట్ బుకింగ్ సకాలంలో ఓపెన్ కావడంలేదు. దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అవకాశంగా దళారులు ధరను తగ్గించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రూ.1300 మాత్రమే ఇస్తామన్నా గత్యంతరం లేక అటు ఆర్‌ఎస్‌కేల్లో అమ్మకానికి అవకాశం లేక ఇటు నిల్వ చేసుకునే గోదాములు లేక రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయించాల్సి వస్తుంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించినా కొనుగోళ్ల విషయంలో వ్యవసాయశాఖ తీరు నత్తే నయమన్నట్టుగా సాగుతోంది. లక్షల టన్నుల్లో ధాన్యం పొలాల్లో నుంచి వస్తుంది. కేవలం కొనుగోలు కేంద్రాలపై దృష్టి కాకుండా బయట కొనుగోళ్లను కూడా రెగ్యులేట్ చేసే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు రచించుకోవాలి. అయితే ఆర్భాటపు ప్రక టనలకే పాలకులు పరిమితమవుతున్నారన్న అభిప్రాయం ఇప్ప టికే రైతుల్లో వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకా రం నిర్వర్తించాల్సిన విధుల్లో కూడా ఆయా విభాగాల ఉదాసీనతే రైతులకు శాపంగా మారు తోంది. ఎక్కడికక్కడ రైతు సేవా కేంద్రాల్లో కేంద్రా లు ఏర్పాటు చేసినా కొనుగోళ్లు అర కొరగానే జరుగుతున్నా అధికారులకు పట్టడం లేదు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ఇప్పటికే దాదాపు లక్షన్నర టన్నుల ధాన్యం బహిరంగ మార్కెట్‌కు తరలిపోయిందంటే (మిగతా 6వ పేజీలో)



పిడుగురాళ్లలో లారీకి ధాన్యం ఎగుమతి చేస్తున్న కూలీలు

లక్ష్యాలకు దూరం

బాపట్ల జిల్లాలో మొత్తం దిగుబడి 6.80 లక్షల టన్నులు అంచనా కాగా లక్ష్యం రెండు లక్షల టన్నులు. అయితే ఇందులో ఇప్పటి వరకు 21,000 టన్నుల ధాన్యాన్ని మాత్రమే మద్దతు ధరకు సివిల్ సప్లయిస్ విభాగం కొనుగోలు చేసింది. గుంటూరు జిల్లాలో దిగుబడి 4.50 లక్షల టన్నులు కాగా సేకరణ లక్ష్యం 50,000 టన్నులు. పల్నాడు జిల్లాలో దిగుబడి 4.30 లక్షల టన్నులు ఉండగా సేకరణ లక్ష్యం 40 వేల టన్నులు. నిర్దేశించిన లక్ష్యం మేర ఏ జిల్లాలోనూ కొనుగోళ్లు జరగలేదని సివిల్ సప్లయిస్ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

కరకట్ట.. ప్రమాదకరం

గోతులు, పగుళ్లతో అధ్వానంగా రోడ్డు



- కొల్లూరు దగ్గర ఇరువైపులా కుంగిపోయిన కరకట్ట



- అత్తలూరివారిపాలెం-గొడవర్రు మధ్య ఏర్పడిన గుంతలు

- ఇసుక వాహనాలతో కుంగిపోయిన వైనం
- రోడ్డు ఆధునికీకరణ.. ప్రతిపాదనలకే పరిమితం

రేపల్లె డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ప్రవాహాన్ని కట్టడి చేస్తూ- ప్రజలకు ప్రధాన రవాణా మార్గంగా అందుబాటులో ఉన్న కరకట్ట ప్రమాదకరంగా మారింది. మోకాలి లోతున గోతులు.. కుంగిన రోడ్డుతో కరకట్టపై ప్రయాణం ఓ సాహసమేనని వాహన చోదకులు చెప్తున్నారు. రాకపోకల్లో ఏ మాత్రం ఆదమరిచినా 15 నుంచి 20 అడుగుల లోయలోకి వెళ్లిపోవాల్సిందేనని వాపోతున్నారు. 68 కిలోమీటర్ల పొడవున్న ఈ రోడ్డుపై రోజుకు కనీసం పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయంటే రోడ్డుపై ఉన్న గుంతలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. దశాబ్దం క్రితం ప్రకాశం బ్యారేజి నుంచి లంకెవానిదిబ్బ వరకు కరకట్టను ఆధునీకరించారు. ఆ తర్వాత నుంచి దీనిని పట్టించుకున్నవారు లేరు. ఆ తర్వాత ఇసుక రవాణాను కరకట్టపైనే అనుమతించటంతో పూర్తిగా దెబ్బతినిపోయింది. కొన్నిచోట్లయితే మోకాళ్లలోతులో గుంతలుపడిపోతే, చాలాచోట్ల కరకట్ట నదివైపు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. తాడేపల్లి దగ్గర మణిపాల్ ఆసుపత్రి ఎదురు నుంచి కుడి కరకట్ట రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. కిలోమీటరు (మిగతా 6వ పేజీలో)

గ్రామీణ రోడ్లకు రూ.10 కోట్లు

ఎమ్మెల్యే ఏలూరి చొరవతో నిధులు మంజూరు

పర్చూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనున్నది. రోడ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చూపిన చొరవ ఫలించింది. నియోజకవర్గంలో 21 కి.మీ. రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. నిత్యం వాహనాలు తిరిగే గ్రామీణ రహదారుల్లో 21 కి.మీ తీవ్రంగా దెబ్బతిన్నాయని వాటి పునరుద్ధరించాలని ఎమ్మెల్యే రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. పీఆర్ఆర్ గ్రాంట్‌లోని ఎస్ఏఎస్‌సీఐ కేటగిరీ కింద ఈ నిధులను వినియోగించనున్నారు.

నిధులు ఇలా..

యద్దనపూడి మండలంలో ఎన్‌హెచ్ 5 నుంచి అనంతవరం వరకు రూ.2.20 కోట్లు, పర్చూరు మండలంలోని చెరుకూరు ఆర్అండ్‌బీ రోడ్డు - ఏదుబాడు రోడ్డు(అడుసుమల్లి)కు రూ.26 లక్షలు, ఎన్‌హెచ్ 16 నుంచి రాజు గారిపాలేనికి రూ.1.76 కోట్లు, బొబ్బేపల్లి - రాజుపాలెం రోడ్డుకు 77 లక్షలు, స్వర్ణపాలెం - స్వర్ణ రోడ్డుకు రూ.1.97 కోట్లు, ఇంకొల్లు - కడవకుదురు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ముప్పాళ్ళ, ఉప్పుగుండూరు వయా భీమవరం రోడ్డుకు రూ.2.26 కోట్లు, కడవకుదురు, చిన్న గంజాం, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి మున్నంగి వారిపాలెం రోడ్డుకు రూ.82 లక్షలు మంజూరయ్యాయి.

విద్యాశాఖాధికారుల బదిలీ

గుంటూరు, పల్నాడు, బాపట్ల డీఈవోలకు స్థానచలనం



ఎస్ కే సలీం బాషా, గుంటూరు



పీవీజే రామారావు, పల్నాడు



సింగ్ శ్రీనివాస్, బాపట్ల

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి లో అత్యుత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ వంద రోజుల ప్రణాళికతో సిద్ధమవగా ఎవరూ ఊహించనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. వంద రోజుల ప్రణాళిక అమలులో అధికారులు నిమగ్నమై ఉండగా డీఈవోల బదిలీ ఉపాధ్యాయులను విస్మయానికి గురిచేసింది. కాగా గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక, పల్నాడు డీఈవో ఎల్ చంద్రకళ, బాపట్ల డీఈవో పురుషోత్తంను బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు డీఈవోను ప్రకాశం జిల్లాకు, పల్నాడు డీఈవోను కృష్ణా జిల్లాకు బదిలీ చేయగా బాపట్ల డీఈవో పురుషోత్తంకు ఎటువంటి బాధ్యతలు అప్పగించలేదు. కాగా జిల్లా పాఠశాల విద్య ఆఫీసర్(డీఎస్ఈవో) అనే పేరుతో జిల్లాల్లో అధికారుల కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. గుంటూరు డీఎస్ఈవోగా అంబేద్కర్ కోన సీమ జిల్లా డీఈవో ఎస్కే సలీంభాషాను, పల్నాడు డీఎస్ఈవో కృష్ణా జిల్లా డీఎస్ఈవో పీవీజే రామారావు నియమితులయ్యారు. బాపట్ల డీఎస్ఈవోగా పాఠశాల విద్యలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న సింగ్ శ్రీని వాస్‌ను నియమించారు. నూతనంగా నియమతులైన డీఎస్ఈవోలు రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని విద్యా శాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

బదిలీలపై విస్మయం

ప్రభుత్వ ఆదేశాలతో వందరోజుల ప్రణాళిక అమలు కోసం ఇప్పటికే డీఈవోలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో పరి స్థితుల్ని అంచనా వేస్తూ పర్యటనలు చేస్తున్నారు. విద్యార్థులను పరీక్ష లకు సన్నద్ధం చేసేలా ఉపాధ్యాయులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశా రు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా డీఈవోల బదిలీలు ఏమిటని ఇటు ఉపాధ్యాయులు, అటు ఉపాధ్యాయ సంఘాల నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కొత్త డీఎస్ఈవోలుగా నియమితులైన వారు బాధ్యతలు స్వీకరించిన తర్వాత పరిస్థితుల్ని అవగాహన చేసుకుని తిరిగి సాధారణ పరిస్థితులు నెలకునేందుకు నెల రోజులకు పైగా సమయం పడుతుందని, ఇది పది పరీక్షలపై ప్రభావం పడే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బంతి బంతికీ బెట్టింగ్

- చీరాల్లో జోరందుకున్న వైనం

చీరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇండి యా - సౌతాఫ్రికా టీ ట్వంటీ మ్యాచ్‌లను కొం ద రు వినోదం కోసం వీక్షిస్తుంటే మరి కొందరు సులభంగా డబ్బు సంపాదించేందుకు అవకాశం గా మార్చుకున్నారు. ఈ క్రమంలో చీరాల్లో బంతి బంతికి బెట్టింగ్ జరుగుతోంది. కొందరు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతు న్నారు. గతంలో వన్‌డే మ్యాచ్‌లకు బెట్టింగ్‌లు జరిగేవి. కాగా ప్రస్తుతం ఐపీఎల్, ట్వంటీ ట్వం టీలపైకి జూదరుల దృష్టి మళ్లింది. మ్యాచ్‌లు జరిగే సమయాల్లో చీరాల నియోజకవర్గ పరిధిలో రూ.కోట్లలో బెట్టిం గ్‌లు జరుగుతున్నా యని సమాచారం. ఒకప్పుడు చీరాల పట్టణం, పేరాల, వేటపాలెం, జాండ్రపేట, మండల పరిధిలోని ప్రధాన కేంద్రాల్లోనే గతంలో బెట్టింగ్‌లు జరిగేవి. బెట్టింగ్‌లు ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాయి. వాట్సాప్, ఇతర యాప్‌లతో గ్రామీణ ప్రాంతాల యువత బెట్టింగ్‌కు చేరువయ్యారు. దీంతో చీరాల పరిధి లోని రిసార్ట్స్, లాడ్జీలు, బార్‌లు, కొన్ని వ్యాపార వాణిజ్య సముదాయాల్లో యువత, విద్యార్థులు, క్రికెట్ వీరాభిమానులు బెట్టింగ్‌లో మునిగి తేలు తున్నారు. ఇదిలా ఉంటే చీరాల పరిధిలో ఇప్పటికే కొందరు వ్యక్తులు అత్యున్నత స్థాయిలో బుకీలు గా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. కొందరు పాత బుకీలు కూడా యాక్టీవ్ అయినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌లకు పాల్పడే వారు ప్రత్యేకమైన ఫోన్ నెంబర్ వాడుతున్నారు. మ్యాచ్ ప్రారంభమయ్యే అరగంట ముందు మాత్రమే ఆ నెంబర్ వినియోగంలోకి వస్తుంది, మిగిలిన సమయమంతా ఆఫ్‌లోనే ఉంటుంది. ఆన్ చేసిన సమయంలో గతంలో వారి వద్ద ఫీడ్ అయిన నెంబర్‌లకు మాత్రమే ఆన్సర్ చేస్తారు. కొత్త నెంబర్‌లకు రెస్పాండ్ కాకపోవడం విశేషం.

అవగాహన కల్పిస్తున్నాం..

ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నాం. అలాగే కొన్ని ప్రదేశాలపై నిఘా ఉంచా ము. యువత ఇటువంటి వాటికి దూరంగా ఉండటం మంచిది.

-ఎండీ మొయిన్, చీరాల డిఎస్పీ



బాపూజీ కాంప్లెక్స్ వద్ద రోడ్డు మీదనే ఉన్న దుకాణాలు



ఇరుగ్గా మారిన గాంధీరోడ్డు



కోర్టు సెంటరులో రోడ్డు పైనే వాహనాల పార్కింగ్

అడ్డగోలుగా.. ఆక్రమణలు!



ఆర్టీసీ బస్టాండు వద్ద నడిరోడ్డులో ఉన్న తోపుడు బండ్లు

సైడు కాలువల పైనా నిర్మాణాలు ● అద్దెలకు ఇచ్చి చిరువ్యాపారుల నుంచి రూ.వేలల్లో వసూలు
రోడ్ల విస్తరణ జరిగినా మారని తీరు ● ట్రాఫిక్ సమస్యతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి
● పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు



కొత్తపట్నం బస్టాండు ప్రాంతంలో ఇలా..

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని పలు ఫుట్‌పాత్‌లను యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. పలు చోట్ల స్థానిక షాపు యజమానులే ఫుట్‌పాత్‌లను, సైడు కాలువలను చిరువ్యాపారులకు అద్దెలకు కేటాయిస్తూ రూ.వేలకు వేలు దండుకుంటున్నారు. కార్పొరేషన్ స్థలం కనిపిస్తే కబ్జాలకు కొందరు పాల్పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు అలసత్వం కారణంగా అనేక ప్రాంతాల్లో స్థలాలు, ఫుట్‌పాత్‌లు అన్యాక్రాంతానికి గురౌతున్నాయి. ఇప్పటికే పలు కార్పొరేషన్‌కు చెందిన కొన్ని స్థలాలను కొందరు ఆక్రమించి ఏళ్ళ తరబడి అనుభవిస్తుండగా, నిర్మాణాలు తొలగించి స్వాధీనం చేసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. నగరంలో వందల సంఖ్యలో ప్రభుత్వ రహదారులు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇదిలా ఉండగా, వివిధ వ్యాపారాల నిమిత్తం మరెన్నో తాత్కాలిక ఆక్రమణలు ఉన్నాయి. తొలుత చిరువ్యాపారం కోసం కొంతమేర జాగా ఏర్పాటు చేసుకోవడం. ఆ తర్వాత శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు.

చిరు వాప్యారాల నుంచి రూ.వేలల్లో దోపిడీ

నగరంలోని పలు ప్రాంతాలలో వేల సంఖ్యలో వీధి వ్యాపారులు వివిధ రకాల విక్రయాలతో జీవనం సాగిస్తున్నారు. అధిక శాతం తోపుడు బండ్లపై, ఫుట్‌పాత్‌లపై పండ్లు, కూరగాయలు, టిఫిన్, బట్టలు, చెప్పులు, వివిధ వస్తువులు, నూడిల్స్ పాయింట్‌లు, సమోసాలు, స్వీట్‌కార్న్, పుల్కా పాయింట్, పూల వ్యాపారాలు వంటివి అమ్మకాలు సాగిస్తుంటారు. ఈ వ్యాపారాలు సాగించేందుకు ప్రతిరోజు కార్పొరేషన్‌లకు రోజువారీ రుసుము చెల్లించాల్సి ఉంది. అయితే ట్రాఫిక్ సమస్య తలెత్తినపుడల్లా ఖాకీలు వారి బండ్లను పక్కకు నెట్టేయడం నిత్యకృత్యం. దీంతో వ్యాపారులు పలు షాపుల యజమానులను ఆశ్రయించడంతో వారి దుకాణం ముందు సాయంత్రం బండిని నిలుపుకుని చిరు వ్యాపారం చేసుకునేందుకు విన్నవించుకోగా, యజమానులు వారి వద్ద నుంచి రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు వసూలు చేయడం ఇదో తరహా వ్యాపారమైంది. అంతే కాకుండా షాపు యజమానే కరెంటు ఇచ్చేందుకు అదనంగా రోజుకు రూ.100 వసూలు చేస్తున్నారు. దీంతో ఒక్కో షాపు యజమాని తమ షాపు ముందు వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించినందుకు రోజుకు రూ.600 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో చిరువ్యాపారుల వద్ద నుంచి నెలకు రూ.15వేల నుంచి రూ.18వేల వరకు వసూలు చేస్తున్న వారు అధిక సంఖ్యలోనే ఉన్నారు.

రోడ్లను విస్తరించినా...

ఒంగోలు నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రత్యేక దృష్టి సారించారు. కొత్తగా రోడ్ల నిర్మాణం, ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రాంతాల్లో రోడ్ల విస్తరణతోపాటు, ట్రాఫిక్ సమస్య నియంత్రణలోనూ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇప్పటికే సీవీఎన్ రీడింగ్‌రూమ్ సెంటర్, రంగారాయుడు చెరువు ఏరియా, కర్నూలు రోడ్, శ్రీనివాస థియేటర్ రోడ్, కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, గుంటూరు రోడ్ విస్తరించగా, త్వరలోనే చర్చి సెంటర్ నుంచి మస్తాన్‌దర్గా సెంటర్ వరకు ట్రంక్ రోడ్ విస్తరణ, అలాగే మస్తాన్‌దర్గా నుంచి బీవీఎస్ హాలు మీదుగా కొత్తపట్నం బస్టాండ్ వరకు రోడ్డు విస్తరణ చేయనున్నారు. అయితే ప్రజల సౌకర్యార్థం పాలకులు ప్రత్యేక చొరవ తీసుకుంటుండగా, కొందరు వ్యాపారాలు రోడ్లు విస్తరించిన ప్రాంతాల్లో తిరిగి దుకాణాలు ఏర్పాటు చేయడం, ఆక్రమించి అద్దెలకు కేటాయించడం జరుగుతుంది. మరోవైపు విస్తరించిన రోడ్‌ను తిరిగి వాహన పార్కింగ్‌గా ఉపయోగించుకోవడంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు.

చూసీ చూడనట్లుగా టౌన్‌పానింగ్

నగరంలో వీధి వ్యాపారులకు జోన్‌లు కేటాయించినా అవి ఉపయోగపడటం లేదు. దీంతో చిరువ్యాపారుల జీవనం పెద్ద వ్యాపారులకు కాసులు కురిపిస్తుండగా, ఫుట్‌పాత్‌లు, సైడు కాలువలను ఆక్రమించి అద్దెకు కేటాయిస్తున్నవారిపై చర్యలు తీసుకోవడంలో టౌన్ ప్లానింగ్ యంత్రాంగం విఫలమవుతుంది.

పరిష్కారం వైపు దృష్టి సారిస్తేనే..

నగరంలో ట్రాఫిక్ సమస్య ఒక్కరోజుతో పోయేది కాకపోవడంతో శాశ్వత పరిష్కారం వైపు యంత్రాంగం దృష్టి సారించాల్సి ఉంది. ప్రధానంగా మినీ స్టేడియం నుంచి కలెక్టరేట్ వరకు, అలాగే డీమార్ట్, జీజీహెచ్, రమ్య హోటల్ సెంటర్, పెట్రోల్ బంక్ ఏరియా, ఎల్ఐసీ ఎదురు, అలాగే అంజయ్య రోడ్, మంగమూర్ రోడ్, సీవీఎన్ సెంటర్, కోర్టు సెంటర్, సాయిబాబా గుడి సెంటర్‌తోపాటు పలు ఏరియాలలో రహదారులపై నాలుగు చక్రాల వాహనాలు నిలిపివేత అరికట్టడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు పార్కింగ్ లేకుండా చూడాల్సి అవసరం ఉంది.

గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో కార్పొరేషన్ అధికారులు వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా జోన్‌లు ఏర్పాటు చేయగా, వైసీపీ వచ్చాక వాటిని గాలికి వదిలేశారు. ఇప్పటికైనా దీనిపైనా పోలీసు యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగవాసులు కోరుతున్నారు.



కర్నూలురోడ్డులో వాహనాల పార్కింగ్



లాయర్‌పేటలో రోడ్డుపైనే తోపుడు బండ్లు



నెల్లూరుబస్టాండులో కేబీ వద్ద..

మల్లవరంలో సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ.76 లక్షలు కేటాయింపు

మద్దిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మల్లవరంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం రూ.76 లక్షల నిధులను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కేటాయించినట్లు మల్లవరం శ్రీవారి కమిటీ గౌరవాధ్యక్షుడు కావూరి వాసుబాబు, అధ్యక్షుడు మారినేని కృష్ణారావు మంగళవారం తెలిపారు. శ్రీవారి కమిటీ ఆధ్వర్యంలో శ్రీగిరి ప్రదక్షణకు సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను శరవేగంగా పూర్తి చేయన్నారు. గ్రామస్థుల సహకారంతో రూ.13 లక్షల నిధులను కేటాయించి సిమెంట్‌రోడ్డు నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. దాదాపు రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గౌరవాధ్యక్షుడు కావూరి వాసుబాబు మాట్లాడుతూ మల్లవరం దేవస్థానం శ్రీవారి కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో ఔషధ మొక్కలను నాటినట్లు తెలిపారు. మరింత అభివృద్ధి కోసం కమిటీ ఆధ్వర్యంలో పనులను పూర్తిచేస్తామని తెలిపారు. దాతల సహకారంతో మరింత ముందుకు వెళతామని చెప్పారు. కార్యక్రమంలో మన్నం శ్రీనివాసరావు, తేళ్ల సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందజేస్తున్న ఏపీఎం తదితరులు

చినగంజాం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాల ద్వారా తమ జీవనోపాధిని పెంపొందించుకోవాలని సంతరావూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మి, ఏపీఎం గద్దె పెదసుబ్బారావులు అన్నారు. మండలంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సంతరావూరుశాఖ కార్యా లయంలో గ్రామానికి చెందిన 11 మంది లబ్దిదారులకు రుణాల చెక్కులను వారు బ్యాంకు ఫీల్డ్ అధికారితో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సంతరావూరుశాఖ పరిధిలో రూ.25లక్షల రుణాల చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. లాక్‌పతిదీదీ పథకం కింద పది మంది లబ్ధిదారులకు లక్షరూపాయిల చొప్పున పది లక్షల రూపాయిలు, ఒక లబ్దిదారునికి పీఎం ఈజీపీ కింద రూ.15లక్షలు టెంట్‌హౌస్ నిమిత్తం మంజూరు పత్రం ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ అధికారి మనోజ్, సీసీ మాధవీ, వీవోఏలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలి

బల్లికురవ, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల సాధనకు ఈ నెల 31వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు వైజాగ్‌లో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని బాపట్ల జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మండలంలోని గుంటుపల్లి పీహెచ్‌సీ వద్ద ఆశడే సందర్భంగా ఆశ వర్కర్లతో కలిసి మహాసభల పోస్టర్‌ను సీఐటీయూ నేతలు అవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల భద్రతకు చట్టాలను తీసుకురావాలన్నారు. వైజాగ్ స్టీల్‌ను ప్రైవేట్ పరం కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లేబర్ కోడ్ రద్దు చేయాలన్నారు. ఆశవర్కర్ యూనియన్ నేతలు వరలక్ష్మి, శివలీల, భారతీ, గోపీ రాణి, నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట ప్రమాదకరం

(5వ పేజీ తరువాయి)

పొడవున సింగిల్ రోడ్డుగా ఉండటంతో వాహనాలు తప్పుకునే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పెదకొండూరు-వల్లభాపురం మధ్య గతంలో 4 కిలోమీటర్ల పొడవున డబుల్ రోడ్డు వేసినా కిలోమీటరు వేయకుండా మాయచేశారు. అప్పటి నుంచి ఈ కొద్ది దూరం నరకప్రాయంగానే మారింది. వల్లభాపురం-హనుమాన్‌పాలెం మధ్య ఆధునికీకరించినా కట్ట దెబ్బతినిపోయింది. మున్నంగి పరిధిలో కరకట్ట పగుళ్లిచ్చి, సగం వరకు కుంగిపోయింది. హనుమాన్‌పాలెం నుంచి బాపట్ల జిల్లా కొల్లూరు మండలం ఈపూరు వరకు రోడ్డు పర్వాలేదన్నట్లున్నా, అక్కడి నుంచి కొల్లూరు వరకు నరకానికి రహదారిగా మారింది. కొల్లూరు-ఈపూరు, దోనేపూడి-వెల్లటూరుల మధ్య కిలోమీటరుపైగా విస్తరణకు నోచుకోలేదు. గతంలో వేసిన సింగిల్ రోడ్డు ఇరువైపులా నడుంలోతు వరకు కుంగిపోయింది. కార్లు రాకపోకలకు వీలు లేక పోగా లారీలు అదుపుతప్పుతున్నాయి.

ముగ్గురు మంత్రులూ దృష్టిపెట్టాలి..

మంగళగిరి, తెనాలి, రేపల్లె నియోజకవర్గాల పరిధిలోని కరకట్ట పటిష్టతపై మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌లు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. నదికి ఎడమ వైపున ఉన్న కరకట్ట ఆధునికీకరణకు రూ.138 కోట్లతో తాజాగా నీటిపారుదల శాఖ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. అయితే కుడి కరకట్ట ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లావైపు మాత్రం ఇప్పటి వరకు దృష్టి పెట్టలేదు. గత ఏడాది వరదల సమయంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లు రాత్రిళ్లు కూడా కరకట్టపైనే కాపలా ఉండి పటిష్టపరిచారు. ఆ సమయంలో కరకట్ట పనులు చేపడతామని వారు హామీ ఇచ్చారు. అయితే వరదలు తగ్గాక దీనిపై పెద్దగా కదలిక కనిపించలేదు. గతంలో రూ.100 కోట్లతో చేసిన ప్రతిపాదనలు ప్రస్తుతం రెట్టిపయ్యే పరిస్థితి ఉంది. అయితే ముగ్గురు మంత్రులు దీనిపై దృష్టిపెట్టి కరకట్టను బలోపేతం చేయటంతో పాటు, గతంలో ఆధునికీకరణ సమయంలో వదిలేసిన ప్రాంతాల్లో వెడల్పుతో పాటు ఎత్తు పెంచి డబుల్ రోడ్డు వేస్తేనే ఈ మార్గంలో ప్రయాణం సురక్షితం అవుతుంది.

ఎప్పుడో 1998లో రోడ్డేసి...

1998లో వచ్చిన వరదతో కరకట్టకు గండ్లు పడ్డాయి. దీంతో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కరకట్ట ఎత్తు పెంచి, దానిపై తారుతో సిగిల్ రోడ్డు వేశారు. ఆ తర్వాత వచ్చిన వరదలకు ఇదే రక్షణగా నిలిచింది. అయితే రోడ్డుపడ్డాక వాహనాల రద్దీ పెరిగింది. రూ.111 కోట్లతో 2010లో పనులు పూర్తి చేశారు. ప్రకాశం బ్యారేజి నుంచి పెనుమూడి వరకు కరకట్టను వెడల్పు చేసి, దానిపై డబుల్ రోడ్డు వేశారు. ఆ తర్వాత ఈ మార్గంలో రేపల్లె-విజయవాడ కరకట్ట బస్సు సర్వీసును కూడా ప్రారంభించారు. అయితే జగన్ ప్రభుత్వంలో కరకట్టపై ఇసుక రవాణాను అనుమతించారు. 40 నుంచి 50 టన్నులకుపైగా బరువుతో ఇసుక లారీలు విచ్చలవిడిగా తిరగడంతో రోడ్డు కుంగిపోయింది. నదివైపు అంచులు సగం వరకు కుంగి అత్యంత ప్రమాదకరంగా మారింది. రోడ్డు పునర్ నిర్మాణం కోసం రూ.100 కోట్లతో నీటిపారుదల శాఖ పలు సార్లు ప్రతిపాదనలు పంపినా వైసీపీ ప్రభుత్వం వాటిని బుట్టదాఖలు చేసింది.

కొనుగోళ్లు కొంతే

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కళ్లాల్లోనే ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో వ్యవసాయశాఖ, మార్కెటింగ్‌శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణి.. మిల్లర్లు ఆడిందే ఆటగా పరిస్థితి నెలకొనడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మద్దత ధరకు ధాన్యం సేకరణ బాలారిష్టాల దశలో ఉండటంతో బహిరంగ మార్కెట్ కొనుగోళ్లను పట్టించుకునే వారే లేకుండా పోయారు. మొత్తం దిగుబడిలో ప్రభుత్వాలు సేకరించేది గరిష్ఠంగా 30 శాతానికే పరిమితం. మిగిలినదంతా కూడా బయట మిల్లుల్లోనో, దళారుల వద్దకు చేరేదే. అయితే లక్ష్యాల మేర కొనుగోళ్లపై పర్యవేక్షించాల్సిన అధికారులు వాటిని కూడా పట్టించుకోవడంలేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ మాత్రమే తమ పరిధిలోకి వస్తుందని, మిగతాదేదీ తమకు పట్టదన్నట్లు ఆయా విభాగాలు వ్యవహరిస్తున్నాయి. విభాగాల మధ్య సమన్వయం లేకపోగా ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకుంటూ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో రైతులు అంతిమంగా నష్టపోవాల్సి వస్తోంది.

పర్యవేక్షణ పట్టదు..

మిల్లర్లు, దళారులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినా మద్దతు ధర ప్రామాణికం. అయితే మద్దతు ధరతో పనే లేదన్నట్లు క్షేత్రస్థాయిలో పరిస్థితి ఉంది. ప్రభుత్వ కేంద్రాల ద్వారా మిల్లులకు తరలిన ధాన్యంపై ఏ అనే పేరుతో రిజిష్టర్ నిర్వహించాలి. ప్రైవేటుగా మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యానికి బీ అనే పేరుతో రిజిష్టర్ నిర్వహించాలి. ఏ రైతు నుంచి ఎంత ధరకు, ఎంత పరిమాణం కొనుగోలు చేశామనే సమగ్ర వివరాలు అందులో నమోదు చేయాలి. దీనిని డీఎస్‌వో సారథ్యంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ పర్యవేక్షించాలి. కానీ ఎక్కడా ఈ ప్రక్రియ కనిపించడంలేదు. ఏ గ్రామం పరిధిలో ఎంత పరిమాణం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లింది, ఎంతమేర బయటకు తరలివెళ్లింది అనే గణాంకాలను వీఏఏ కచ్చితంగా నమోదు చేయాలి. ఈ రికార్డూ లేదు. లక్షల టన్నుల ధాన్యం బయటి మార్కెట్‌కు తరలివెళుతుందని ఆయా విభాగాలకు తెలిసి కూడా, మామూళ్ల మత్తులో జోగుతూ తనిఖీలు మరిచారు. దళారులకు రైతులు అమ్ముకునే ధాన్యం వివరాలను వ్యవసాయశాఖ సహకారంతో రెవెన్యూ రెగ్యులేట్ చేయాలి. ధాన్యం సేకరణలో తమకు సంబంధం లేదన్నట్లు రెవెన్యూ విభాగం వ్యవహరిస్తోంది. దీంతో ధాన్యం కొనుగోలు విషయంలో దళారులు ఆడింది ఆట, పాడిందిపాటగా కనిపిస్తోంది. మిల్లర్లు చెప్పిందే ధరగా చెలామణి అవుతుండడంతో అన్నదాతలు ఈ విషయమై వ్యవసాయశాఖను వివరణ కోరితే ఇది సివిల్ సప్లయిస్ విభాగం పరిధిలోనిదని చెప్పడం గమనార్హం. వ్యవస్థలన్నీ నిద్రావస్థలో ఉండడంతో బయటి మార్కెట్‌లో మరీ తీసికట్టుగా ధాన్యాన్ని రూ.1100 నుంచి రూ.1300కు కూడా అడుగుతూ రైతులను నిలువునా ముంచేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌కు ఇప్పటికే తరలివెళ్లిన లక్షన్నర టన్నుల ధాన్య విషయంలో ఇదే జరిగింది.

మిల్లర్లకే వత్తాసు

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు కొనుగోలు విషయంలో కొర్రీలతో సరిపెడుతున్నారు. రైతుకు షెడ్యూల్ ఇచ్చిన తర్వాత ట్రక్ షీట్, జీఎల్‌టీ, ఎఫ్‌టీవో జారీతో ప్రక్రియ ముగిసినట్లే. ఈ దశలో ఎక్కడా కూడా రైతుకు నేరుగా మిల్లర్‌తో సంబంధమే ఉండకూడదు. షెడ్యూల్ ఇచ్చేటప్పుడు మాత్రం మిల్లు ఎంపిక మాత్రం రైతు ఇష్టాన్ని బట్టి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో మిల్లర్లు ధాన్యానికి కొర్రీలు పెడుతూనే ఉన్నారు. ఆర్ఎస్‌కే సిబ్బంది మిల్లర్లతో కలిసి మాయాజాలానికి తెరలేపడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఓసారి తేమ విషయంలో ఆర్ఎస్‌కేలో ఫైనలైజ్ అయిన తర్వాత మళ్లీ మిల్లు దగ్గర దాని విషయంలో కిరికిరి పెట్టడం వెనక మతలబు ఇదే. వాటిని పరిష్కరించాల్సిన ఆర్ఎస్‌కే టెక్నికల్ అసిస్టెంట్, మిల్లు కస్టోడియన్ అధికారులు మిల్లర్లకే వత్తాసు పలుకుతున్నారు.

జీజీహెచ్‌లో ఇకపై డిజిటల్ లావాదేవీలు

● సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో ఇకపై డిజిటల్ లావాదేవీలు సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు మంగళవారం తెలిపారు. ఆసుపత్రిలో లభించి వివిధ సేవలకు యూజర్ చార్జీలు, చెల్లింపులు, డొనేషన్‌లు ఇక నుంచి డిజిటల్ రూపంలో జరుగుతాయన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీజీహెచ్‌లో స్పెషల్ రూములు, క్వార్టర్స్, జీజీహెచ్‌లో షాపులు, మెడికల్ బోర్డు ఫీజులు, నర్సింగ్ అప్రెంటిషిప్స్, మెడికల్ సర్టిఫికెట్స్ వయసు ధృవీకరణ పత్రాలు తదితర లావాదేవీలు నిర్దేశించిన క్యూఆర్ కోడ్ ద్వారానే జరుగుతాయని, డిజిటల్ చెల్లింపులు చేసిన వారు తగు రశీదు చూపాలని ఆయన కోరారు.

వడ్డీ వ్యాపారి దాడిపై డీఎస్పీ విచారణ

ఒంగోలు క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వడ్డీ డబ్బులు ఇవ్వలేదంటూ ఒంటరి మహిళను స్తంభానికి కట్టివేసి కొట్టిన కేసును ఒంగోలు మహిళ పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమణకుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. స్థానిక నెహ్రూ కాలనీలో నివాసం ఉండే దార్ల మాధురి వడ్డీ డబ్బులు చెల్లించలేదని అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న సురేఖ ఈనెల 3న స్తంభానికి కట్టేసి విచక్షణ రహితంగా దాడి చేసింది. ఈమేరకు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్సీఎస్టీ చట్టం కింద ఎస్పీ విచారణ బాధ్యతలు డీఎస్పీ రమణకుమార్‌కు అప్పగించారు. ఈమేరకు ఆయన నెహ్రూకాలనీలోని సంఘటన స్థలాన్ని సందర్శించారు. బాధితురాలిని, సాక్షులను డీఎస్పీ విచారించారు.

ఘనంగా వరల్డ్ ఆరెంజ్ డే



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్య సమితి ప్రకటించిన వరల్డ్ ఆరెంజ్ డే వేడుకలు మంగళవారం ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఒంగోలు హౌసింగ్ బోర్డులోని సమితి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. బాలికలపై హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ ఆరెంజ్ డే అనే నినాదాన్ని ఐక్యరాజ్య సమితి ఇచ్చిందని ఆమె తెలిపారు. ఆరెంజ్ రంగు శాంతికి చిహ్నామని, బాలికలపై జరిగే అత్యాచారాలు నిరోధించి శాంతియుతంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆరెంజ్ రిబ్బన్లు ధరించి ప్రతిజ్ఞ చేశారు. స్త్రీలు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు చైతన్యవంతం కావాలని మాజీ ఎంపీపీ నాళం నరసమ్మ పేర్కొనగా, యువతులు అవకాశాలు అందిపుచ్చుకుని ధైర్యంగా ముందడుగు వేయాలని సమితి కోశాధికారి బీరం అరుణ అన్నారు. కార్యక్రమంలో శక్తిసదన్ సిబ్బంది సీహెచ్.కనకదుర్గ, గుంటూరు శ్రీదేవి, పి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో చిన్నారులు

చీరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా పట్టణ పరిధిలోని రోటరీ కమ్యూనిటీ భవనంలో నిర్వహిస్తున్న యువజన వారోత్సవాలు మంగళవారం కూడా ఘనంగా జరిగాయి. రోటరీక్లబ్, ఇన్నర్ వీల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో 5వ తరగతిలోపు చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. అలాగే చిన్నారులు కూడా పలు ఆధ్యాత్మిక, పోరాట యోధులు, తదితర అందమైన అలంకరణలతో అందరినీ అలరించారు.

మెరుగైన ఆర్థిక సమాజమే లక్ష్యం

చీరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండు రోజుల గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమం మంగళవారం చీరాలలో నిర్వహించారు. పేదరిక నిర్మూలన, కలుషితం లేని వాతావరణం, తాగునీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

స్పెల్‌బీతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

సంతమాగులూరు డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో తడబాటు లేకుండా సమాధానం చెప్పుటయే స్పెల్‌బీ కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యమని ఎంఈవో వి.కోటేశ్వరరావు, దినేష్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సంతమాగులూరులోని కాలనీ పాఠశాలలో మండల స్థాయి స్పెల్‌బీ కార్యక్రమం విద్యార్థులకు నిర్వహించారు. ఒక్కొక్క తరగతికి 1500 పదాలతో స్పెల్‌బీ పోటీ నిర్వహించారు. ఒక్కొక్క తరగతి నుంచి 12 టీంలు పాల్గొన్నాయి. మూడవ తరగతి 12, నాలుగవ తరగతి నుండి 12, ఐదవ తరగతి నుండి 12, మొత్తం 36టీంలు పాల్గొన్నాయి. ప్రాథమిక తరగతిలోనే విద్యార్థులకు వర్డ్ పవర్, స్పెల్లింగ్‌లు అభ్యసనం పెంపొందించడమే లక్ష్యం అని పేర్కొన్నారు.

డిజిటల్ సేవలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

చీరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ సేవలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎథికల్ హ్యాకర్ మల్లికార్జున్ రాహుల్ అన్నారు. మంగళవారం పట్టణంలో శ్రీగౌతమీ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎంవీ(వెంకటేశ్వర్లు) ఆధ్వర్యంలో ఓటీపీ, యూపీఐ, ఫిషింగ్ లింక్‌లు, ఫేక్ యాప్స్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వరప్రసాద్, డైరక్టర్ వడ్లమూడి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా హనుమంతరావు



హనుమంతరావు

పంగులూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఖోఖో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కరిచేటి హనుమంతరావు ఎన్నికయ్యారు. రాష్ట్ర ఖోఖో అసోసి యేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో ఈనెల 7వ తేదీన జరిగింది. ఈ ఎన్నికలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మైనంపాడు గ్రామానికి చెందిన కె.హనుమంతరావు రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు యం.సీతారామిరెడ్డి మంగళవారం తెలిపారు. ఇప్పటివరకు కె.హనుమంతరావు జిల్లా ఖోఖో అసోసియేషన్ కోశాధికారిగా పనిచేశారు. రాష్ట్ర అధ్యక్షులుగా కృష్ణా జిల్లాకు చెందిన ఎం.వీ.ఎస్.ఎస్.ప్రసాద్, కోశాధికారిగా సాధు శ్రీనివాసరావు (శ్రీకాకుళం) ఎన్నికయినట్లు తెలిపారు. ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యదర్శిగా ఎంపికైన కరిచేటి హనుమంతరావుకు అసోషియేషన్ ఛైర్మన్ డాక్టర్ గరటయ్య అభినందనలు తెలిపారు.

అవీ..ఇవీ..

రోడ్డు అంచులో చిల్లచెట్ల తొలగింపు


చిల్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

బల్లికురవ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నుపల్లి అనంతవరం ఆర్‌అండ్‌బీ రోడ్డులో ప్రజలకు ఇబ్బందిగా ఉన్న తుమ్మ చెట్లను రెండు రోజుల నుంచి తొలగిస్తున్నారు. ఈ రోడ్డులో ఉన్న మల్లాయపాలెం వేమవరం గ్రామాల మధ్య రోడ్డు అంచులో పెద్దఎత్తున తుమ్మ చెట్లు రోడ్డుపైకి ఎగబాకాయి. దీంతో వాహన చోదకులు ప్రతి రోజు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రెండు వాహనాలు ఎదురు పడితే తుమ్మ చెట్లు వాహనా లను తాకుతున్నాయి. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్య వెళ్లటంతో రోడ్డు అంచుల్లోని తుమ్మ చెట్లను తొలగించేందుకు సంబంధిత కాంట్రాక్టరకు పనులను కేటాయించారు. సుమారు 10 కిలోమీటర్ల మేర రెండు గ్రామాల మధ్య ఉన్న రోడ్డులో తుమ్మ చెట్లను యంత్రంతో తొలగించే పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తి అయితే వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు అని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

ఉపాధ్యాయుడు రవికుమార్‌కు అభినందన


పిల్లలకు ఫ్యాన్, మ్యాట్‌ను అందజేస్తున్న ఎంఈవోలు

బల్లికురవ, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తాను పనిచేస్తున్న పాఠశాలలో విద్యార్థులకు తనవంతు సహకారం అందించిన ఉపాధ్యాయుడు గుంటుపల్లి రవికుమార్‌ను ఎంఈవోలు శ్రీనివాసరావు, రమేష్‌బాబులు అభినందించారు. మండలంలోని కూకట్లపల్లి ప్రాథమిక పాఠశాల(హెచ్‌సీ)లో విద్యార్థుల మధ్యాహ్న భోజన తయారీకి అవసరమైన గ్యాస్ పొయ్యిని వంట తయారు చేసే నిర్వాహకురాలికి రూ.5 వేల నగదును, అంగన్ వాడీ విద్యార్థులకు ఫ్యాన్, వారు నేలపై కుర్చోకుండా మ్యాట్‌ను అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గుంటుపల్లి రవికుమార్ అందజేశారు. ఉపాధ్యాయుడు అందజేసిన వస్తువులను ఎంఈవోలు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పందిరి అబ్రహాం, ప్రదానోపాధ్యాయులు, తిరుపాలు పాల్గొన్నారు.

వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) :కావలి వన్‌టౌన్ సీఐగా పనిచేస్తున్న ఎం డి ఫిరోజ్ జన్మదినం సందర్బంగా మంగళవారం పట్టణం లోని వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం,దుప్పట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం మస్తాన్‌వలి, హోంగార్డు నాగూర్, కాశింబుడే, కలాం తదితరులు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును సాగుచేయవద్దు

యద్దనపూడి,(మార్టూరు)డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): రైతులు నల్లబర్లీ పొగాకును సాగుచేయవద్దని, ఒక వేళ నిబంధనలకు విరుద్ధంగా రైతులు సాగుచేస్తే మండల టాస్క్‌ఫోర్స్ టీం వారు వచ్చి మొక్కలను తొలగిస్తారని ఏవో కుమారి హెచ్చరించారు. యద్దనపూడి మండలంలోని చిమటా వారిపాలెం, వింజనంపాడు గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె రైతులతో మాట్లాడుతూ పొగాకుకు ప్రత్యామ్నాయంగా శనగ, మొక్కజొన్న, జొన్న, కుసుమ పంటలను సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ జిలాని, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆహార పంటల సాగుపై మొగ్గు చూపండి

ఇంకొల్లు, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి) : ఆహారపంటలైన పెసర, మినుము, కంది తదితర ఆహార పంటల సాగుపై రైతులు మొగ్గు చూపాలని మండల వ్యవసాయాధికారి మేరమ్మ సూచించారు. మండలంలోని సూదివారిపాలెంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఆహార పంటపై దృష్టి సారించాలన్నారు. పొగాకు పంటసాగు చేయవద్దన్నారు. వరి పంట అనంతరం పంటను అమ్ముకునేందుకు ఆర్‌బీకే కేంద్రాల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే 24 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతాయన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రైతుసంక్షేమం కోసం వ్యవసాయ యంత్రపరికరాలపై అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధులకు వీల్ చైర్లు, చేతికర్రల పంపిణీ


వృద్ధులకు వీల్‌చైర్స్, చేతికర్రలను ఇస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో బృందావనం నాగులపాలెంలోని వృద్ధాశ్రమంలోని వృద్దులకు వీల్ చైర్లు, చేతికర్రలు, గొడుగులను రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, నాగభైరు శ్రీనివాసరావుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. వీటికి కావలసిన ఆర్థిక సహకారాన్ని వెలగా శ్రీరాం ప్రసాద్ కుమార్తె చార్వాణి అందజేసి దాతృత్వం చాటుకున్నారు.అనంతరం వృద్దులకు బోజన ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, పంబి సదానందరెడ్డి, రోటరీ ప్రతినిధులు కెఎస్‌ఆర్‌కె. ప్రసాద్, పాబోలు ఉదయ భాస్కర్, నాగుబడి సుబ్బారావు, కోటా శ్రీనివాసరావు, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, భవనం రాజగోపాల రెడ్డి, ఆశ్రమ నిర్వహకులు భవనం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి అదృశ్యంపై కేసునమోదు

కారంచేడు(పర్చూరు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాలిక అదృశ్యంపై కారంచేడు పోలీసు స్టేషన్‌లో మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. కారంచేడు గ్రామ పంచాయితీ స్వీపర్‌గా పనిచేస్తున్న చేవుటూరి వెంకటేశ్వర్లుకు చెందిన సుమారు 7 సంత్సరాల వయస్సు కల్గిన పెంపుడు కుమార్తె ఈ నెల 7న అదృశ్యమైంది. గ్రామంలోని తెలిసిన వారిని విచారించినా అచూకీ లభ్యం కాలేదు. దీంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెంపుడు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్.ఖాదర్ బాషా తెలిపారు.

జూదరులు అరెస్ట్

చినగంజాం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగంజాం శివారులోని జూద స్థావరంపై చినగంజాం పోలీసులు మంగళవారం దాడి చేశారు. గ్రామ శివారులోని తోటల్లో జూదం ఆడుతున్న ఐదుగురిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్.ఐ శీలం రమేష్ తెలిపారు. వారి నుంచి రూ.4,200ల నగదును స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి బుధవారం న్యాయస్థానంలో హాజరు పరుస్తామన్నారు.

మొక్కజొన్న రైతులను వెంటాడుతున్న కష్టాలు

- మొక్క దశలోనే పురుగు బెడద...నియంత్రించలేక అవస్థలు
- భారంగా మారుతున్న పెట్టుబడి ఖర్చు


మొక్కజొన్న పైరులో మచ్చల పురుగులను ఏరుతున్న కూలీలు

పర్చూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ పరిస్థితులు అనుకూలించక, గిట్టుబాటు ధరలు లేక కష్టాల్లో ఉన్న రైతులను అడుగడుగున సమస్యలు వెంటాడుతున్నాయి. మొంథా తుఫాను ప్రభావంతో రబీలో సాగు తలపెట్టిన మొక్కజొన్న సకాలంలో విత్తలేక పోయారు. గత్యంతరం లేక కాస్త ఆలస్యమైనా సాగుచేపట్టిన రైతులకు ప్రారంభ దశలోనే క్రిమి కీటకాల బెడద వెంటాడుతుంది. గతంలో మొక్కజొన్న సాగులో పంట చేతికి వచ్చే నాటికి రెండు నుంచి మూడుసార్లు క్రిమి సంహారక మందులు పిచికారి చేస్తే సరిపోయేది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సాగు ప్రారంభం మొక్క దశలోనే మూడు నుండి నాలుగు సార్లు మందులు చల్లాల్సి వస్తోందని దీంతో పెట్టుబడి బారం పెరిగిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు కొన్ని చోట్ల కత్తెర పురుగు కూడా కనిపిస్తుండడం రైతుల్లో ఆందోళన రేకెత్తిస్తుంది. ప్రస్తుతం అధికశాతం మచ్చల పురుగు(లద్దెపురుగు) పైర్లను కనిపిస్తుందని, దీన్ని నియంత్రించలేక నానా అవస్థలు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. కత్తెర పురుగు సోకితే ఏమిచేయాలో అర్థంకాక రైతులు ఒకింత కలవరానికి గురవుతున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఈఏడాది ఖరీఫ్ సాగు నామమాత్రంగానే సాగు అయ్యింది. అధిక శాతం రైతుల రబీ సాగుపైనే ఆశలు పెట్టుకున్నారు. అయితే వాతావరణ పరిస్థితులతో పాటు గత ఏడాది వేల ఎకరాల్లో సాగుచేసుకున్న నల్లబర్లీ పొగాకు కొంత మేర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసినా అధిక భాగం రైతుల వద్దే నిల్వ ఉంది. దీంతో పాటు, గత మూడేళ్లగా సరైన ధరలేక శనగ కోల్డ్ స్టోరేజ్‌ల్లోనే నిల్వలు ఉన్నాయి. దీనికి తోడు రబీలో అధికశాతం రైతులు నల్లబర్లీ పొగాకును సాగుచేయాల్సి ఉన్నా, ఈ ఏడాది ప్రభుత్వం నల్లబర్లీ సాగును నిషేధించింది. దీంతో ఏపంటలు సాగుచేయాలో అర్థంకాక రైతుల్లో సందిగ్ధం నెలకొంది. అయితే వ్యవసాయ అధికారులు ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని సూచనలు ఇచ్చిన నేపధ్యంతో పాటు మొక్కజొన్నకు కొంత మేర ప్రభుత్వ గిట్టుబాటు ధర వస్తుందన్న ఆశతో రైతులు సాగువైపు మొగ్గు చూపారు. గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు విస్తీర్ణంలో రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారు. ఇలాంటి తరుణంలో చీడ పీడలు, వాతావరణ పరిస్థితులు మొక్కజొన్న సాగుకు ఏ మేరకు అనుకూలిస్తాయో వేచిచూడాల్సి ఉంది.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

చినగంజాం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని పెదగంజాం, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు నన్నపనేని రవి, కుర్రా రామారావులు అన్నారు. మండలంలోని పెదగంజాం, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు దాతలు అందజేసిన స్టడీ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీజేశారు. మట్టిగుంట గ్రామానికి చెందిన బండారుపల్లి సింగర బాబు (టీటీడీ విజిలెన్ అధికారి), వారి మిత్రులు సీ.హెచ్.వెంకటేష్, నాగేశ్వరరావు, రోజారాణి, సీతామహాలక్ష్మిలు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 90 మంది విద్యార్థులకు పదివేలరూపాయిల విలువైన స్టడీ మెటీరియల్, రాతపుస్తకాలు, ఆల్‌ఇన్‌వన్‌ల పుస్తకాలను అందజేశారు. గత 8 సంవత్సరాల నుంచి విద్యార్థుల విద్యాబివృధ్ధికి దాతలు సహకారం అందిస్తున్నట్లు పెదగంజాం హెచ్‌ఎం తెలిపారు. కడవకుదురు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యులు కట్టిబోయిన సుబ్బారావు కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పదో తరగతి మోడల్ పేపర్లు అందజేశారు. దాతలు అందజేసిన మెటీరియల్స్‌ను హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెదగంజాం జడ్పీ పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ ఆసోది సుదర్శనరెడ్డి, పాఠశాల పూర్వ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు డీ.నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు వినయ్‌కుమార్, రవి కుమార్, పీడీ. అనీల్‌కుమార్, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధిని పెంపొందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న డీపీఎం రవి

పర్చూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహిళల్లో జీవనోపాధిని పెంపొందించి అభివృద్ధిని సాధించటమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని డీపీయం కె.రవి అన్నారు. మంగళవారం పర్చూరు వెలుగు కార్యాలయంలో మండల సమైఖ్య ఈసీ సభ్యులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, పరిశుభ్రత, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని రానున్న రోజుల్లో మహిళలో స్వయంశక్తితో అభివృద్ధి చెందాలన్న దృక్పదంతో నాలుగు రోజులపాటు శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్చూరు మండలాన్ని మోడల్ మండలంగా ఎంపిక చేసినట్లు వివరించారు. దీనిలో భాగంగా ఆదర్శ గ్రామాల మీద అవగాహన కల్పించడం, ఎలాంటి సదుపాయాలు కావాలనే విషయాలపై అవగాహన కల్పించడం శిక్షణా తరగతుల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం కె.రామకృష్ణ, డీఎంజీ ఓ.శ్రీనివాసరావు, సీసీలు విజయకుమార్, శ్రీనివాసమూర్తి, నరసింహారావు, గ్రామ సంఘాల ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాలో 124 మంది ఎంపిక



నియామక పత్రాలను అందజేస్తున్న టీడీపీ నేతలు

అద్దంకి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో మంగళవారం పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్ మేళాలో 124 మంది ఎంపికయ్యారు. మొత్తం 321 మంది హాజరుకాగా 11 కంపెనీలలో పనిచేసేందుకు 124 మందిని ఎంపిక చేశారు. మరో 62 మందిని షార్ట్ లిస్ట్ చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరమ్మ మాట్లాడుతూ జాబ్‌మేళాల నిర్వహణతో గ్రామీణ ప్రాంతాలలోని నిరుద్యోగ యువకులు ఆయా కంపెనీలకు సులభంగా ఎంపికయ్యేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాజారావు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, రంగిశెట్టి సాంబశివరావు(లహరి), జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ వంతెనకు తాత్కాలిక మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న కార్మికులు

అద్దంకి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణ సమీపంలో గుండ్లకమ్మ నదిపై ఉన్న వంతెనకు తాత్కాలిక మరమ్మతులు ప్రారంభించారు. 4 దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిధిలావస్థకు చేరి తరచూ మరమ్మతులకు గురవుతోంది. వంతెన శ్లాబుపై గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇటీవల తుఫాన్‌కు గోతులు మరింత పెరిగాయి. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.2 లక్షల వ్యయంతో తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులతో కొంత ఉపశమనం కలిగినా కొద్ది పాటి వర్షం కురిసినా మరోసారి గోతులు ఏర్పడే అవకాశం ఉందని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. కనీసం వంతెన మొత్తం ఒక లేయర్ నిర్మాణం చేస్తే కొంతమేర ప్రయోజనం ఉంటుందని వాహనచోదకులు అభిప్రాయపడుతున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో మెరుగైన సమాజం

వేటపాలెం (చీరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఓత్సాహిక పారిశ్రామిక వేత్తలతో మెరుగైన సమాజం రూపొందుతుందని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఎంటర్ పెన్యువర్‌షిప్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పారిశ్రామిక వేత్తలుగా రాణించేందుకు కావాల్సిన లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్‌బాబు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే కోటి సంతకాల : కరణం

రామకృష్ణాపురం (చీరాల), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజల సహకారంతోనే చీరాల్లో కోటి సంతకాల ఉద్యమం పూర్తి చేసినట్లు వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ పేర్కొన్నారు. వైద్యవిధానంపై రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ తలపెట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో 61,458 సంతకాలు పూర్తి చేశారు. ఈసందర్భంగా మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు నిరంతరం వెన్నంటి ఉండేది వైసీపీనేనని చెప్పారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రక్షణ కల్పించాలి

- సీపీఎం కేంద్రకమిటీ సభ్యురాలు రమాదేవి

పంగులూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో 80 శాతంగా ఉన్న కౌలు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన రక్షణ కల్పించాలని సీపీఎం కేంద్రకమిటి సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో మంగళవారం రాత్రి కౌలు రైతులతో రమాదేవి సమావేశం నిర్వహించారు. ఆరుగాలం శ్రమించి పంటసాగు చేసే కౌలు రైతులకు రక్షణ కరువైందన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా విధానాలు మారకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రత్యక్షంగా భూమిమీద ఉండి వ్యవసాయం చేసే కౌలు రైతులు ప్రభుత్వ పథకాలకు దూరమవుతూ సంక్షోభంలోకి నెట్టబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లభించక పోవడంతో సాగులోలేని భూయజమానులే ప్రభుత్వ పథకాల ఫలాలు పొందుతున్నారన్నారు. గుర్తింపు కార్డులు లేక కౌలు రైతులు పంటలను ఈ క్రాప్‌చేసే పరిస్థితి లేదన్నారు. కౌలు రైతులు సంఘటితమై తమ హక్కుల సాధనం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.గంగయ్య, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సీఐటీయూ నాయకులు గుడిపాటి మల్లారెడ్డి, రైతుసంఘం నాయకులు నాయపాము ప్రభాకర్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల నూతన కమిటీ

అద్దంకి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మండల ఆర్‌ఎంపీ, పీఎంపీల నూతన కమిటీలను మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక రేణింగవరం రోడ్డులోని అహ్మద్ క్లినిక్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ లింగారావు, కార్యదర్శిగా కరీం, కోశాధికారిగా సైదావలి, ఉపకార్యదర్శిగా కల్యాణ చక్రవర్తి, ఉపాధ్యక్షుడిగా నరేష్‌లను ఎన్నుకున్నారు. వి.సుబ్బారావు, ఖాజావలి, చంద్రశేఖర్లు అబ్జర్వర్లుగా వ్యవహరించారు. మండలంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు నూతన కమిటీ తెలియజేసింది.

ఇసుక టిప్పర్ పట్టివేత

కొత్తపేట (చీరాల), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక రవాణా సాగిస్తున్న టిప్పర్‌ను టూటౌన్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారి నుండి చీరాల వైపునకు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

శనగలో బెట్ట నివారణ చర్యలు తీసుకోవాలి


రైతులతో కలసి శనగ పైరును పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శనగసాగు చేసిన రైతులు బెట్ట నివారణ చర్యలు తీసుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో సాగు చేస్తున్న పలు పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో వెంకటకృష్ణ మాట్లాడుతూ శనగ పంటలో 30 నుంచి 40 రోజుల మధ్య అవకాశం ఉన్న రైతులు స్ప్రింకర్లతో తడి అందించాలన్నారు. మల్టీకె(పోటాషియం నైట్రిట్) ఒక కేజీ, నానో యూరియా 500 ఎంఎల్ ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాగులపాడు సొసైటి అధ్యక్షుడు ఏనుగంటి వెంకట రామయ్య, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ దినేష్‌సాయి, షేక్ మహబూబ్ సుభాని, ఆత్మ బ్లాక్ టెక్నికల్ మేనేజర్ శేషారావు, రైతులు పాల్గొన్నారు.

పంటసాగులో ఆధునిక పద్ధతులు పాటించండి

పంగులూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంటసాగులో రైతులు ఆధునిక పద్ధతులను పాటించాలని ఏవో డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం, ముప్పవరం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 740 జీవో ద్వారా నల్లబర్లీ పొగాకు సాగు నిషేదించిందని, రైతులెవరూ నల్లబర్లీసాగు చేపట్టవద్దన్నారు. నల్లబర్లీ పొగాకు సాగుచేస్తే పంటను తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు గోపీకిరణ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

220 మందికి ఉచిత వైద్య పరీక్షలు


కంటిని పరీక్షిస్తున్న వైద్యులు

చినగంజాం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాలెం గ్రామంలోని రైతుసేవా కేంద్రం ఆవరణలో ఒంగోలు కిమ్స్ వైద్యశాల వారు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పల్లెపాలెం గ్రామ సర్పంచ్ సైకం మణి, గ్రామ కార్యదర్శి రాజా మోహన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రామాంజనేయులు పలు రకాల వ్యాధులకు సంబంధించి, ఆప్తమాట్రిక్స్ స్వాతి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రోగనిర్ధారణ జరిగిన 42 మందిని ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసినట్లు తెలిపారు. హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్‌ఎస్, ఈసీహెచ్‌ఎస్, రైల్వే, ఎఫ్‌సీఐ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కిమ్స్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమలకు బయలుదేరిన స్వాములు


శబరిమలకు బయలుదేరిన స్వాములు

మార్టూరు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): పట్టణం నుంచి మంగళవారం 20 మంది అయ్యప్ప దీక్షదారులు శబరిమలకు బయలుదేరి వెళ్లారు. పడమర బజారు, బలరాం కాలనీ, నేతాజీనగర్ల నుంచి స్వాములు ప్రత్యేకమైన బస్సులో బయలుదేరివెళ్లారు. గత వారం రోజుల వ్యవధి లో మార్టూరు నుండి భవాని,శివ, అ య్యప్ప స్వాములు వంద మంది దాకా దీక్ష ను ముగించారు.

గాయపడిన వ్యక్తికి టీడీపీ సాయం అందజేత

మార్టూరు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పట్టణంలో గొట్టిపాటి నగర్‌కు చెందిన షేక్ బాజి కత్తిపోట్లుకు గురై గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న షేక్ బాజిని టీడీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబానికి పార్టీతరపున రూ.50 వేల సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో షేక్ రజాక్, తొండెపు ఆదినారాయణ, సెల్ సుభాని, ముల్లా మస్తాన్ వలి, షేక్ రహీమా, షేక్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

మార్టూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల పంచాయతీ కార్మికులకు మంగళవారం రోటరీ మాజీ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటేరియన్లు మాదాల సాంబశి వరావు, చెన్నుపాటి బసవరాములు జాష్టి సాంబశివరావు, పెంట్యాల శ్రీను, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు: సీఐ

పంగులూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అద్దంకి ఎక్సైజ్ సీఐ ఏ.భవాని హెచ్చరించారు. మండలంలోని కోటపాడు గ్రామంలో సోమవారం రాత్రి సీపీఎం కేంద్రకమిటి సభ్యులు డి.రమాదేవి నేతృత్వంలో స్థానిక మహిళలు అక్రమ మద్యం విక్రయ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్ఐ. హర్షవర్ధన్‌రెడ్డి స్థానిక వీఆర్‌వో మహిళా పోలీస్, గ్రామపెద్దలతో ఆయా దుకాణాల్లో మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మకాలు నిర్వహిస్తున్న సమాచారం కంట్రోలురూం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నెంబరు 9440902497కు తెలియజేయాలన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

మేదరమెట్ల డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో మేదరమెట్ల తిమ్మనపాలెంలో కారు డివైడర్‌ను ఢీకొనడంతో బోల్తాపడింది. మంగళవారం వేకువ జామున అరుణాచలం నుంచి విజయవాడ వెళుతున్న కారు డ్రైవర్ నిద్రమత్తులోనికి జారుకోవడంతో డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. కారులో ముగ్గురు మహిళలు, డ్రైవర్ ఉన్నారు. కారులో ఉన్నవారికి స్వల్ప గాయాలు మాత్రమే అయ్యాయి. గాయపడిన వారికి 108 అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు. హైవే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి గాయపడిన వారికి వైద్యశాలకు పంపించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

అద్దంకి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అ ప్రమత్తంగా ఉండాలని శక్తిబృందం ఎస్సై శ్రీహరిబాబు అన్నారు. అద్దంకి పట్టణంలోని విద్యానగర్‌లో హోలీఫెయిత్ హైస్కూల్‌లో చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఆధ్వర్యంలో మంగళవారం పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపద సమయంలో శక్తి యాప్ వినియోగం, 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై నరశింహరావు, కే.సుబ్బారావు, శక్తి టీం సభ్యులు, హెచ్‌ఎం హెబ్సిబా అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టి శ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

బుధవారం 10 డిసెంబరు 2025



రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బుచ్చిరెడ్డిపాళెంలోని సెయింట్ మేరీస్ కళాశాలలో 69వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్ 14 బాల బాలికల ఫెన్సింగ్ క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ము న్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి, టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసరావు తదితరులు ఈ పోటీలను ప్రారంభించారు. 11వతేదీ వరకు జరిగే పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 300 మంది క్రీడాకారులు, 50మంది కోచ్‌లు, మేనేజర్లు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటాపోటీగా క్రీడాకారులు తలపడ్డారు. ఈ పోటీలలో ఎస్‌జీఎఫ్‌ఐ నాయకులు భీమతాటి రమణయ్య, ఎం.దేవిక, ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి గురుప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాసులు, టోర్నమెంట్ పరిశీలకులు భవాని, బుచ్చి, మర్రిపాడు ఎంఈఓలు దిలీప్‌కుమార్, పీవీ రత్నం, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఐజీ త్రిపాఠి, పక్కన ఎస్పీ అజితా వేజెండ్ల

ఏ స్టేషన్‌లో ఏం జరుగుతోంది!?

- జిల్లాలో ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆరా
- పలు స్టేషన్లలో విస్తృత తనిఖీలు
- నిర్లక్ష్యంగా ఉంటే సహించనని హెచ్చరిక
- శాంతిభద్రతల పరిరక్షణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం

8



కలువాయిలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న స్థానికులు

మీ ఆవేదనను సీఎం దృష్టికి తీసుకెళతా!

- జేఏసీ నాయకులతో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల
- కలువాయిలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

8

పదో తారీఖు వచ్చినా

జీతాలేవి సార్!



ఉద్యోగులకు పూర్తిస్థాయిలో అందని వేతనాలు

జాబితాలో ఇంజనీరింగ్ శాఖలన్నీ

అవుట్‌సోర్సింగ్, పలు శాఖల ఉద్యోగుల ఎదురుచూపులు

నెల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడో ఒకటో తేదీ అందాల్సిన జీతాలు ఇప్పుడు పదో తారీఖు వచ్చినా అందలేదు. కొన్ని ప్రభుత్వ విభాగాలలోని ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేయగా, ప్రధానమైన ఇంజనీరింగ్ వంటి శాఖలకు ఎదురుచూపులు తప్పడం లేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈ నెల జీతాల చెల్లింపులో ఆలస్యమైనట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం ప్రతీ నెలా ఒకటి, రెండు తేదీల్లోనే వేతనాలను జమచేస్తూ వస్తోంది. కానీ డిసెంబరులో పరిస్థితులు భిన్నంగా మారాయి. నిధుల కొరతతో కొన్ని శాఖలకు మాత్రమే ఒకటో తేదీన జీతాలు పడ్డాయి. అందులో రెవెన్యూ, పోలీసు, మెడికల్ వంటి ప్రధానమైన శాఖలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 20 వేల మంది వరకూ ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వారిలో సుమారు 15 వేల మంది వరకూ వేతనాలు అందుకున్నట్లు ట్రెజరీ వర్గాలు చెబుతున్నాయి. మరో 5 వేల మందికి వేతనాలు అందాల్సి ఉందని అంటున్నారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ వంటి ఇంజనీరింగ్ శాఖలు ఈ జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు వ్యవసాయ శాఖ, అన్ని శాఖల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. అలానే ఇంకొన్ని శాఖల్లో కొందరికి వేతనాలు అందగా, మరికొందరికి అందలేదు. ఉద్యోగ సంఘాల సమాచారం ప్రకారం ఒకటి, రెండు రోజుల్లో మిగిలిన ఉద్యోగులందరికీ జీతాలు పడనున్నట్లు తెలిసింది. కాగా నెలలో పది రోజులు గడిచినా వేతనాలు అందకపోవడంతో చిన్న స్థాయి ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో చాలా మందికి నెలవారీ ఈఎంఐలు ఉండడం ప్రధాన సమస్యగా మారింది.

జిల్లాను అతలాకుతలం చేసిన దిత్వా తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ లెక్కగట్టింది. మొత్తం 21 మండలాల్లోని 215 గ్రామాల్లో 20,059 మంది రైతులకు చెందిన 4739.6 హెక్టార్లలో వరితోపాటు వేరుశనగ, మొక్కజొన్న, పొగాకు, మినుము, శనగ పంటలు నీటమునిగాయి. అదేవిధంగా 2175 హెక్టార్లలో నర్సరీలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక పంపింది. 4095.6 హెక్టార్లలో వరిపైరు, 68 హెక్టార్లలో మొక్కజొన్న, 86 హెక్టార్లలో మినుము, 28 హెక్టార్లలో శనగ, 112 హెక్టార్లలో వేరుశనగ, 350 హెక్టార్లలో పొగాకు పంటలు నష్టపోయాయి.

'దిత్వా' నష్టం..

లెక్క తేలింది!

- 4,739 హెక్టార్లలో నీటమునిగిన పంటలు
- 2,175 హెక్టార్లలో నర్సరీలు
- 4095 హెక్టార్లలో దెబ్బతిన్న వరిపైరు
- 80 శాతం సబ్సిడీతో వరి విత్తనాల పంపిణీ

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను కారణంగా జిల్లాలో అత్యధికంగా 1350 హెక్టార్లలో వరిపైరు దెబ్బతిన్నది. అంతేగాక 214 హెక్టార్లలో నర్సరీలు పాడయ్యాయి. అత్యధికంగా వెంకటాచలం మండలంలో 400 హెక్టార్లలో వరి నర్సరీ దెబ్బతింది. విడవలూరులో 525 హెక్టార్లు, కావలిలో 360 హెక్టార్లు, నెల్లూరు రూరల్‌లో 350 హెక్టార్లు, తోటపల్లిగూడూరులో 298 హెక్టార్లు, ముత్తుకూరులో 250 హెక్టార్లు, బుచ్చిరెడ్డిపాళెంలో 230 హెక్టార్లు ఇంకా అనంతసాగరం, కోవూరు, అల్లూరు, కొడవలూరు, ఇందుకూరుపేట, సంగం, రాపూరు తదితర మండలాల్లో వరిపైరు దెబ్బతింది.



మనుబోలు ప్రాంతంలో నీటమునిగిన వరినాట్లు (ఫైల్)

మంత్రితో మాట్లాడిన సోమిరెడ్డి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడితో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. తుఫాను కారణంగా రైతులు బాగా నష్టపోయారని, విత్తనాలు అందించి ఆదుకోవాలని కోరారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి, ప్రతి రైతుకు 80శాతం సబ్సిడీపై విత్తనాలు అందించేలా ఆదేశాలు జారీ చేశారు.

● 80శాతం సబ్సిడీతో విత్తనాల పంపిణీ

తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులకు 80శాతం సబ్సిడీపై విత్తనాలు అందించేందుకు మంగళవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దెబ్బతిన్న పంటల వివరాలతోపాటు విత్తనాల అవసరంపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. అవసరమైన రైతులకు వెంటనే 80శాతం సబ్సిడీపై విత్తనాలను అందించాలని ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో అత్యధికంగా నష్టపోయిన మనుబోలు, వెంకటాచలం మండలాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ పై విత్తనాలను పంపిణీ చేశారు. దాదాపుగా 14940.5 క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్-15048, కేఎన్‌ఎం-1638 రకాల వరి విత్తనాలతోపాటు టీసీజీఎస్-1694 రకం వేరుశనగ విత్త నాలు 150 క్వింటాళ్లు అవసరమని వ్యవసాయ శాఖ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. వెంకటాచలం, మనుబోలు మండలాల్లో వెయ్యి క్వింటాళ్ల వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని మిగిలిన మండలాల్లో సైతం రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు.



గ్రామీణ రోడ్లకు మహర్దశ

- అభివృద్ధికి నిధుల మంజూరు
- జిల్లాలో 39 రోడ్లు.. 155 కి.మీ, రూ.76 కోట్లు
- పరిపాలనా అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం
- త్వరలో టెండర్లు పిలవనున్న పీఆర్ అధికారులు

నెల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుంది. గ్రామాల కనెక్టివిటీలో కీలకమైన పంచాయతీరాజ్ రోడ్లను బాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ రూరల్ రోడ్స్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కింద రాష్ట్రవ్యాప్తంగా 1299 రోడ్లను రూ.2122.97 కోట్లతో 4006 కి.మీ మేర అభివృద్ధి చేసేందుకు తీర్మానించారు. ఇందుకు సంబంధించిన పరిపాలన అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జారీ చేసింది. అందులో జిల్లాకు సంబంధించి 399 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. రూ.76.34 కోట్లతో 155.42 కి.మీ మేర పీఆర్ రోడ్లను బాగు చేయనున్నారు. త్వరలోనే సాంకేతిక అనుమతులు మంజూరు కానుండగా, ఆ వెంటనే టెండర్లు పిలవనున్నారు. రాబోయే రెండేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను పూర్తిగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

● అభివృద్ధి చేయనున్న రోడ్లు ఇవే..

గాంధీగిరిజన సంఘం-సంగం వయా పల్లిపాలెం రోడ్డు, ముంబయి రోడ్డు-చాబోలు రోడ్డు, బోడిపాడు - ఓబులాయపల్లి- ఆదూ రుపల్లి రోడ్డు, పీఎస్ రోడ్డు - నాగులవె ల్లటూరు, వీసీ రోడ్డు - పెరుమాళ్లపాడు రోడ్డు, ఏఎస్ రోడ్డు - వెంగంపల్లి వయా మహిమ లూరు రోడ్డు, ఆత్మకూరు అప్పారావు పాలెం - కనుపూరు పల్లి వయా మురగళ్ల రోడ్డు, చంద్రపడియ-దూబగుంట రోడ్డు, పోకూరు-కేపీ ఎన్ రోడ్డు వయా ఎస్ఎన్ పల్లి, ఎంసీ రోడ్డు - పొట్లూరు వయా వీరే పల్లి రోడ్డు, గుడ్లూరు-నరస రాపురం వయా మొగ ళ్లూ రు రోడ్డు, కేజీటీ రోడ్డు - బీమవరం రోడ్డు, తెట్టు - రామాయపట్నం రోడ్డు, అన్నగారి పాలెం క్రాస్ - అన్నగారిపాలెం వయా నడింపల్లి రోడ్డు, మబ్బు గుంట పాలెం బ్రాంచ్ రోడ్డు, ఎంసీ రోడ్డు - సాంబ శివాపురం రోడ్డు, బీజీవీ కండ్రిగ రోడ్డు - వైఎస్‌పురం రోడ్డు, తాళ్లూరు క్రాస్ - తాళ్లూరు రోడ్డు, ఇందుకూ రు-పురిణి వయా కొత్తపాలెం రోడ్డు, ముదివర్తి ఆర్‌అండ్‌బీ రోడ్డు - జమ్మిపాలెం రోడ్డు, ఎంసీ రోడ్డు - ఇనమడుగు వయా పడుగుపాడు రోడ్డు, గండవ రం-పీయల పాలెం రోడ్డు, బుచ్చి సున్నపుబట్టి రోడ్డు - వవ్వేరు రోడ్డు, ఎన్‌హెచ్67 - చెయ్యలపా లెం వయా చిన్నతోపు రోడ్డు, ఎన్‌హెచ్67- వవ్వేరు రోడ్డు, ఎన్‌టీ రోడ్డు - కొండ్లపూడి రోడ్డు, అప్రోచ్ రోడ్డు - వెల్లంటి ఎస్సీ కాలనీ రోడ్డు, ఎంసీ రోడ్డు - పూడిపర్తి వయా రామదాసుకండ్రిగ రోడ్డు, కాకుపల్లి చెరుకూరు రోడ్డు- చింతారెడ్డిపాలెం రోడ్డు, చెన్నపల్లిపాలెం - కొత్తపాలెం రోడ్డు, పేడూరు-చింతోపు రోడ్డు, ముత్తుకూరు -

- మిగతా 7వ పేజీలో

నెల్లూరులో మరో మూడు స్మార్టు బజార్లు

- రూ.8 కోట్లతో ఏర్పాటుకు రంగం సిద్ధం

నెల్లూరు (సిటీ), డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - మైపాడు రహదారిలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ బజారు తరహాలో మరో మూడు ప్రాంతాలలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కార్పొరేషన్ అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకుగాను మేరకు రూ.8 కోట్లు ఖర్చు చేయనున్నారు. నగరంలోని సర్వేపల్లి కాలువ ఆనుకుని, రైల్వే స్టేషన్ ఎదుట, శెట్టిగుంటరోడ్డు తదితర ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే మైపాడు రహదారి వెంబడి అందుబాటులోకి తెచ్చినవి సఫలీకృతం కావడంతో మరింత మంది మహిళలకు దుకాణాలు కేటాయించి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ స్మార్ట్ బజార్లను ఏర్పాటు చేయనున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తవగానే మెప్మా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి దుకాణాలు కేటాయించనున్నారు.



పొర్లుకట్టను పరిశీలిస్తున్న ఎస్ఈ దేశినాయక్

రూ.530 కోట్లతో పెన్నా పొర్లుకట్టల నిర్మాణం

- జలవనరుల శాఖ ఎస్ఈ దేశినాయక్

సంగం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పెన్నా నదికి రెండువైపులా దెబ్బతిన్న పొర్లుకట్టల నిర్మాణాలకు సుమారు రూ.530 కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ ఎస్ఈ దేశినాయక్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన సంగం బ్యారేజికి తూ ర్పు, ఎడమ వైపు దెబ్బతిన్న పొర్లుకట్టను ఇరేగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. పెన్నా నదికి వచ్చే వరదల వల్ల ఎడమవైపు పొర్లుకట్ట కోతకు గురై ప్రమాదకరంగా ఉం దని స్థానిక రైతులు ఇటీవల ఫిర్యాదు చేయ డంతో పరిశీలన చేశామన్నారు. ఈ సంద ర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ సంగం బ్యారేజ్ నిర్వాహకులు పొర్లుకట్టల నిర్మాణానికి రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపారని, అవి మం జూరుకాకపోతే ఇరిగేషన్ ఆధ్వర్యంలో ప్రతి పాదనలు పంపుతామని తెలిపారు. ఇటీవల వచ్చిన రెండు వరుస తుఫాన్ లకు చెరువుల్లో 22 టీఎంసీల నీళ్లు చేరాయని తెలిపారు. ఇరిగేషన్ పరిధిలో పనిచేసే లస్కర్లకు రెండు సీజ న్ల 9 నెలల జీతాలు రావాల్సి ఉంది వచ్చిన వెంటనే అందచేస్తామన్నారు. ఆయన వెంట డీఈ పెంచలయ్య, తహసీల్దారు సోమ్లా నాయక్, ఏఈ వినయ్ ఉన్నారు.

'సోమశిల'కు 11,588 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 11,588 క్యూసెక్కుల వరద వస్తోంది. డ్యాంలో 73.638 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 6,650, కండలేరుకు 2,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● కండలేరు డ్యాంలో..

రాపూరు: కండలేరు డ్యాంలో 60.32 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1550 క్యూసెక్కుల నీరు వస్తుండగా, 1050 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నట్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	294

కోడిగుడ్ల ధర (100): 670

సాదాబైనామా గడువు పొడిగింపు

అల్లూరు/కలిగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భూములకు సరైన రికార్డులు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభ వార్త చెబుతూ సాదాబైనామా ప్రక్రియ గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని అల్లూరు తహసీల్దారు లక్ష్మీనారాయణ, కలిగిరి తహసీల్దారు గిరీష్‌కుమార్‌లు మంగళవారం వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. దీనిని అనుసరిస్తూ 2024 జూన్ 15కు ముందు వరకు కేవలం తెల్ల కాగితాల ఆధారంగా కొనుగోలు చేసిన భూముల రికార్డులను సరిచేస్తూ నిర్వర్తించే సాదాబైనామా ప్రక్రియను మరో రెండేళ్ల 2027 డిసెంబరు 31 వరకు పొడిగించిందని పేర్కొన్నారు. అగ్రిమెంటు ఆధారంగా కొనుగోలు చేసిన భూములు కలిగిన రైతులు ఫారం-10 నమూనాలో సమీప సచివాలయం లేదా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో పరిష్కారం ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన కరువు!

● అధికారుల అంచనాలు తలకిందులు ● 5 వేల దరఖాస్తులు వస్తాయనుకుంటే 500 వచ్చాయి

కావలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విచ్చలవిడిగా వేసిన అక్రమలేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎల్‌ఆర్‌ఎస్‌పై అధికారులు, పాలకుల అంచనాలు తారుమారయ్యేట్లు కనిపిస్తున్నాయి. మున్సిపల్ పరిధిలో సుమారు 816 ఎకరాలలో 124 అక్రమ లేఅవుట్లు వెలసి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటన్నింటిని క్రమబద్ధీకరిస్తే సుమారు రూ.150 కోట్లు మున్సిపాల్టీకి ఆదాయం వస్తుందని తొలుత అంచనా వేశారు. అయితే క్షేత్రస్థాయిలో నిర్ణీత గడువు లోపల క్రమబద్ధీకరణకు స్పందన రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఏడాది జనవరి 23 వరకు క్రమబద్ధీకరణ గడువును పెంచింది. ఇలా గడువు పెంచినా రియల్టర్లలో, ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో పెద్దగా స్పందన కానరాలేదు. దీంతో అధికారులు అక్రమ లేఅవుట్లలో సుమారు 10 వేల ప్లాట్లు ఉండగా వాటిల్లో సగం 5 వేలు ప్లాట్లు క్రమబద్ధీకరణకు వస్తాయని తద్వారా రూ.80 కోట్ల వరకు ఆదాయం వస్తోందని భావించారు. అయితే ఇప్పటి వరకు కేవలం 500 ప్లాట్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. వచ్చిన దరఖాస్తులలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్ని క్రమబద్ధీకరణ అవుతాయో తెలియక పోవడంతో ఎల్‌ఆర్‌ఎస్‌పై అధికారుల అంచనాలన్నీ తారుమారయ్యాయి.

● ఫలించని అక్రమ లేఅవుట్లపై అధికారులు కొరడా

గత వైసీపీ ప్రభుత్వంలో కావలిలో వేసిన అక్రమ లేఅవుటలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే అక్రమ లేఅవుట్లలో రాళ్లు తొలగించి కొరడా ఝుళిపించారు. అలాగే అక్రమ లేఅవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకుండా ఆపేశారు. దీంతో కావలిలో ఒక్క సారిగా రియల్ ఎస్టేట్ వ్యాపారం డమాల్‌మంది. ఈ క్రమంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం ఎలా పుంజుకుంటుందా అని ఆందోళన చెందుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిపోవడంతో రిజిస్ట్రేషన్ ఫీజులు, వివిధ పన్నుల రూపేణ ప్రభుత్వాని వచ్చే ఆదాయం కూడా తగ్గిపోయింది. దీంతో రాష్ట్రప్రభుత్వం రియల్‌ఎస్టేట్ వ్యాపారుల ద్వారా ప్రభుత్వానికి ఎలా ఆదాయం సమకూర్చుకోవాలనే ఆలోచన చేసింది. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకు వచ్చింది. దీంతో అక్రమలేఅవుట్లు క్రమబద్ధీకరణతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతోందని భావించారు. అయితే అక్రమ లేఅవుట్లలో వేసిన ప్లాట్లు అన్నీ ఇప్పటికే రియల్టర్లు అమ్ముకోవడంతో వారు తమకేమి సంబంధం లేదని పట్టించుకోవడంలేదు. ఇకపోతే రియల్‌ఎస్టేట్ వ్యాపారం తగ్గిపోవడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు కూడా ఎల్‌ఆర్‌ఎస్‌కు ఇప్పుడు అదనంగా డబ్బులు చెల్లించడానికి ఆసక్తి చూపటంలేదు. ఎల్‌ఆర్‌ఎస్‌లో అక్రమ ప్లాట్లు క్రమబద్ధీకరించుకోకపోతే భవిష్యత్తులో వచ్చే ఇబ్బందుల గురించి ప్రచారం చేసినా స్పందన లేదు.



కావలి మున్సిపాలిటీ పరిధిలో వేసిన అక్రమ లేఅవుట్

● ప్రభుత్వ చట్టాలపై నమ్మకం లేకనే...

ప్రభుత్వ చట్టాలపై నమ్మకం లేకనే ఎల్‌ఆర్‌ఎస్ పట్ల రియల్టర్లు, ప్లాట్ల కొనుగోలు దారులు స్పందించడంలేదని తెలిసింది. అక్రమ లేఅవుట్లలో క్రయవిక్రయాలు, భవన నిర్మాణాలకు అనుమతులు భవిష్యత్తులో కూడా ఉండవనే భయం ఉంటే ఎల్‌ఆర్‌ఎస్‌పై స్పందించే వారు. ప్రభుత్వాలు మారినపుడల్లా చట్టాలు మారుస్తుండటంతో ఈ చట్టం ఎంత కాలం ఉంటుందిలే అనే భావన రియల్టర్లలో ఉంది. ఎంతకాలం భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకుండా ఉంటారు.. ఎప్పుడో ఒకప్పుడు మళ్లీ చట్టం మార్పు చేస్తారనే ఉద్దేశంతో ఉన్నారు. చెరువులలో, రోడ్ల వెంబడి కట్టుకున్న ప్రభుత్వ స్థలాలలోనే భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తుంటే డబ్బులు పెట్టి కొనుగోలు చేసుకున్న ప్లాట్లలో అనుమతులు ఇవ్వక ఎక్కడికి పోతారనే భావం రియల్టర్లు, ప్లాట్ల కొనుగోలు దారులలో ఉండటంతో ఎల్‌ఆర్‌ఎస్ ఆశించిన ఫలితాలు ఇవ్వలేక పోతుంది.

రెడ్‌క్రాస్‌కు రూ.లక్ష విరాళం

● డాక్టర్ రవికుమార్, విజయ దంపతులకు సన్మానం



కావలి రెడ్‌క్రాస్‌కు రూ.లక్ష విరాళం అందచేస్తున్న డాక్టర్ రవికుమార్, డాక్టర్ విజయ దంపతులు

కావలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా డేకేర్ సెంటర్ నిర్వహణ కోసం డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ విజయ దంపతులు రెడ్‌క్రాస్‌కు రూ.లక్ష విరాళం అందజేశారు. రవికుమార్, విజయల 43వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రెడ్‌క్రాస్‌లో జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి ఆరికట్ల మధుసూధనరావుకు రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, రెడ్‌క్రాస్ బాద్యులు కే.హరినారపరెడ్డి, మద్దుల నరసింహారావు, డాక్టర్ పాములూరు శ్రీధర్, డాక్టర్ రమ్య, జనిగర్ల మనోహర్, నల్లిపోగు ప్రణీత్, బెజవాడ ప్రసన్న కుమార్, కలికి శ్రీహరి రెడ్డి, గాదిరెడ్డి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాలకు ప్రజా స్పందన

కావలి(టౌన్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలో చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమానికి ప్రజాస్పందన లభించిందని వైసీపీ నేతలు పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వైసీపీ నేతలు గంధం ప్రసన్న, గుడ్లూరు మాల్యాద్రిలు మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్య ఉచితంగా అందించాలన్న సంకల్పంతో తమ నేత జగన్ 17 ప్రభుత్వ వైద్య కళాశాలను స్థాపించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిని ప్రైవేట్‌పరం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. ఈ సమావేశంలో నేతలు కనమర్లపూడి నారాయణ, షాహుల్‌హమీద్, కుందుర్తి శ్రీనివాసులు, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం స్థలం కబ్జా



అంకభూపాలపురంలో చెత్త సంపద కేంద్రానికి కేటాయించిన స్థలం ఆక్రమించి దుక్కి చేసిన ఆక్రమణదారుడు

వలేటివారిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకభూపాలపురం రెవెన్యూ పరిధిలో చెత్త సంపద కేంద్రానికి కేటాయించిన స్థలం ఆక్రమణలకు గురైంది. ఆ స్థలంలో దుక్కి దున్ని జామాయిల్ సాగుకు సిద్ధం చేస్తున్నారు. అంకభూపాలపురంలో చెత్తసంపద కేంద్రం లేకపోవడంతో నాలుగు నెలల కిందట రెవెన్యూ అధికారులు సర్వే నెంబరు 189-3లో 25 సెంట్లు స్థలం గుర్తించి పొజీషన్ ఇచ్చి చెత్తసంపద కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదికలు కూడా పంపించారు. చెత్తసంపద కేంద్రం నిర్మాణానికి అనుమతులు కూడా వచ్చాయి. నిధులు మంజూరైన వెంటనే పనులు చపట్టాల్సి ఉంది. ఇంతలో ఆ స్థలంను ఆక్రమించి దున్ని జామాయిల్ సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రానికి కేటాయించిన స్థలంలో ఆక్రమణలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ లతీఫున్నీసా

జలదంకి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ లతీఫున్నీసా పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భాగంగా మంగళవారం రాత్రి ఎస్‌ఐ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనచోదకులకు పలు సూచనలు చేశారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా రాత్రి సమయాల్లో పనులు త్వరితగతిన ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు. అలాకాకుండా రాత్రివేళల్లో ఆకతాయి వేషాలు వేస్తే చట్టపరంగా చర్యలు చేపడతామని హెచ్చరించారు.

మద్యం దుకాణంలో చోరీ

వలేటివారిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెంలోని ఎస్‌వీఎస్ వైన్స్ షాపులో చోరీ జరిగింది. వివరాల మేరకు.. సోమవారం రాత్రి 10 గంటలకు సేల్స్‌మెన్ యధావిధిగా దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లి మంగళవారం ఉదయం 10 గంటలకు దుకాణం తీశాడు. దుకాణం రేకులు పైకి లేపి ఉండడాన్ని గుర్తించి యజమానికి సమాచారం ఇచ్చాడు. దుకాణంలో పరిశీలించగా దుడగులు వైన్స్‌షాపు పైన రేకులు పైకి లేపి దుకాణంలోకి వెళ్లి దుకాణంలో ఉంచిన రూ.10 వేల, 4 ఫుల్ బాటిళ్ల మద్యం అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు దుకాణం యజమాని క్రిష్ణయ్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పల్స్ పోలియోపై సిబ్బందికి శిక్షణ

కొండాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 21 వ తేదీన జరగనున్న పల్స్ పోలియోపై స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం వైద్యాధికారి నసీరుద్దీన్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 5 ఏళ్ల లోపు చిన్నారులు 4501 మందిని గుర్తించామన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే పోలియో చుక్కలను చిన్నారులకు వేసే విధానంపై ఏఎన్‌ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఎంఈవో-2 ఆనందరావు, సీహెచ్‌వో చెంచురామయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థిని ఎంపిక

కావలి(టౌన్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కావలి శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థిని టీ.అశ్విని ఎంపికైంది. మంగళవారం పట్టణంలోని పాతూరులో ఉన్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో అశ్వినిని కళాశాల యాజమాన్యం అభినందించింది. కరస్పాండెంట్ కే.వెంకయ్య మాట్లాడుతూ పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 అథ్లెటిక్స్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని అశ్విని హేమర్ త్రోలో బంగారు పతకం సాధించి రాష్ట్ర ఛాంపియన్‌గా నిలవడమేకాక లక్నోలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్ర రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. బాలుర విభాగం హేమర్‌త్రోలో లోకేష్ తృతీయ స్థానం సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లుకోధర్, డైరెక్టర్లు పీవీఎస్ ప్రసాద్, ఎం కొండయ్య, మల్లికార్జునరావు, కన్వీనర్ నందనవనం మధుసూదన్‌రావు, ఏవో స్టాలిన్, పీడీ జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవీరోడ్డు బాలుర ఉన్నత పాఠశాల వద్ద లైన్ వర్క్ ఉన్నందున 11కేవీ ఎస్‌బీఐ ఫీడర్‌లో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్ ఏఈఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఆఫీసు ఏరియా, గుప్తాస్ ప్లాజా ఏరియా, పోస్టాఫీసు సెంటర్, సుల్తాన్ మొహిద్దీన్ ఆసుపత్రి ప్రాంత వాసులంతా సహకరించాలని కోరారు.

ఔషధాల నాణ్యతపై నిరంతరం పరిశీలన

● నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డ్రగ్ నియంత్రణ అధికారులు ఔషధాల నాణ్యతపై నిరంతరం పరిశీలన చేస్తారని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఫైర్‌స్టేషన్ రోడ్డులో సెల్ఫీ పాయింట్ వెనుక నూతనంగా నిర్మించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి డివిజనల్‌లో 900 ఔషధ దుకాణాలు ఉన్నాయన్నారు. వాటిల్లో నాణ్యత కలిగిన మందులు అమ్ముతున్నారా, కాలం తీరిన మందులు ఉన్నాయా తదితరాలను ఔషధ నియంత్రణ అధికారులు పరిశీలిస్తుంటారన్నారు. ప్రజలకు తాము కొనుగోలు చేసిన మందులపై ఏదైనా అనుమానాలు ఉంటే ఔషధ నియంత్రణ కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుని నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. కావలి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ కావలిలో నూతన కార్యాలయం ఏర్పాటు ద్వారా ఔషధాల నాణ్యత, ఫార్మసీలు తనిఖీ, లైసెన్స్‌లు మంజూరు, ఫిర్యాదుల పరిష్కారం తదితరాలు వేగంగా జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, జనసేన నేత పొబ్బా సాయి, బీజేపీ నేత మాల్యాద్రి, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



డ్రగ్ కంట్రోల్ నూతన కార్యాలయ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

పక్కా గృహాల కోసం 2109 దరఖాస్తులు

● గృహనిర్మాణ శాఖ ఈఈ మాధవరావు

లింగసముద్రం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి ఆవాస యోజన గ్రామీణ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని మండలంలో 16మ గ్రామ పంచాయతీల నుంచి 2109 దరఖాస్తులు వచ్చాయని గృహనిర్మాణ శాఖ కందుకూరు ఈఈ ఎం.మాధవరావు చెప్పారు. మంగళవారం ఆయన లింగసముద్రంలోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాల కోసం వచ్చిన 1747 దరఖాస్తులను మండల ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉందన్నారు. ఇళ్ల స్థలాలు లేని వారికి, ఇళ్ల స్థలం ఉండి ఇల్లు కట్టుకుంటాము అన్నవారిని సర్వే చేసి అర్హులుగా చేర్చుతామన్నారు. ఈ పథకం కింద అర్బన్ పరిధిలో ఒక్కో గృహానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షల, రాష్ట్ర ప్రభుత్వం రూ.1లక్ష కలిపి రూ.2.50 లక్షల లబ్ధిదారులకు ఇస్తారన్నారు. రూరల్ పరిధిలోని లబ్ధిదారులకు ఎంత మొత్తం ఇవ్వాలనే విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. అలాగే 2014, 2019లో లెంటిల్, బెసిమెంట్, రూఫ్ లెవల్‌లో నిలిచిపోయిన నిర్మాణాల లబ్ధిదారులను ఈ సర్వేలో కలుపుతామన్నారు. అలాగే ఎన్టీఆర్ హౌసింగ్ పథకంలో ఇల్లు కట్టుకునే లబ్దిదారులకు పీఎంఏవై గ్రామీణ పథకంలో బిల్లులు చెల్లిస్తామని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న గృహనిర్మాణ శాఖ ఈఈ మాధవరావు

కావలిని కప్పిన మంచు దుప్పటి



పొగమంచులో చిక్కుకున్న సూర్యభగవానుడు

కావలి రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితుల ప్రభావంతో మంగళవారం దట్టమైన పొగ మంచు దుప్పటిలా కావలిని కప్పేసింది. ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం మంచు కారణంగా ప్రజలతో పాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు కూడా చలి తగ్గకపోవడం, మంచుతో జాతీయ రహదారిపై ముందున్న వాహనాలు, ఎదురొచ్చే వాహనాలు సైతం కనిపించక పోతుండడంతో వాహనాలను రోడ్డు పక్కన నిలిపి మంచు తగ్గిన తరువాత వాహనదారులు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

అభివృద్ధి పథంలో కావలి ఆర్టీసీ డిపో



ఆదర్శ ఉద్యోగులకు చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ డీఎం ఆదినారాయణ, తదితరులు

కావలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అధికారులు, ఉద్యోగులు సమష్టి కృషి కారణంగా కావలి డిపో అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజరు డీ. ఆదినారాయణ తెలిపారు. మంగళవారం కావలి డిపో గ్యారేజీ ఆవరణలో ఆదర్శ ఉద్యోగుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిపో మేనేజరు మాట్లాడుతూ కావలి డిపో గత మాసంలో ఈపీకేలో రీజియన్‌లో ప్రథమ స్థానంలో ఉందన్నారు. అలాగే జీరో బ్రేక్ డౌన్, జీరో కంప్లెయింట్స్ సాధించిందన్నారు. ఇది ట్రాఫిక్, మెకానికల్ సిబ్బంది సమష్టి కృషి ఫలితమేనన్నారు. ఈ సందర్భంగా అత్యధిక ఆదాయం సాధించిన కండక్టర్లు టీ.శివకుమార్, జీ. విజయ్‌బాబు, ఎస్‌కే కాలేషా, అత్యధిక ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లు సయ్యద్ షాజహాన్, కే. చెంచయ్యలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ బీ. మల్లికార్జున, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామక్రిష్ణ, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పెన్షనర్ల ఆటల పోటీలు

కావలి(టౌన్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పెన్షనర్స్ డేని పురస్కరించుకుని కావలి తాలూకా పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయగిరి రోడ్డులోని మినీ స్టేడియం మైదానంలో నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ ఆటల పోటీలను విశ్రాంత డైట్ అధ్యాపకుడు తూపిలి సుందరరామిరెడ్డి ప్రారంభించారు. ఆటల పోటీల్లో మహిళలు, పురుషులు వృద్ధాప్యాన్ని మరిచి గెలవాలన్న తపనతో పోటీ పడిన తీరు పలువురిని ఆకట్టుకుంది. షాట్‌పుట్, త్రోబాల్, డిస్కస్‌త్రో, క్యారమ్స్, చెస్ క్రీడాంశాల్లో 70 ఏళ్ల లోపు, పైబడిన వారికి రెండు విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈనెల 17న జరగనున్న ఆల్ ఇండియా పెన్షనర్స్ డే కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందిస్తామని రమణయ్య తెలిపారు.



త్రోబాల్ వేస్తున్న పెన్షనర్

నిర్ణీత సమయంలో బయోమెట్రిక్ వేయాలి

లింగసముద్రం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు నిర్ణీత సమయంలో ఉదయం 10.30 గంటలలోపు, సాయంత్ర 5గంటకు బయోమెట్రిక్ వేయాలని డిప్యూటీ ఎంపీడీవో ఎం.పూర్ణచంద్రరావు ఆదేశించారు. మంగళవారం ఆయన లింగసముద్రంలోని సచివాలయం1, 2, పెంట్రాల సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, కార్యాలయంలోని ఇతర రికార్డులను పరిశీలించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం సూచించిన అన్ని సర్వేలలో మండలం వెనుకబడి ఉందని, సర్వేలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

మామిడిపూడి రోడ్డు, రావిపాడు అప్రోచ్ రోడ్డు, కేయూఎస్ రోడ్డు - దేవిశెట్టిపల్లి రోడ్డు వయా అయ్యప్పవారిపాలెం, నేకునంపేట రోడ్డు - కొమ్ముపాలెం ఇస్కపాలెం రోడ్డు, డీకేడీ రోడ్డు - కొత్తపేట వయా నర్రవాడ రోడ్డు, తీర్థంపాడు రోడ్డు - సీసీ కండ్రిగ రోడ్డు, రాపూరు రాజంపేట రోడ్డు - కోత్తూరుపాడు రోడ్డు, పెంచలకోన ఆర్‌అండ్‌బీ రోడ్డు - ఎంజీపల్లి ఎస్టీ కాలనీ రోడ్డు.

సెల్‌టవర్ల నిర్మాణాలకు స్థలం కేటాయించాలి



జేసీ మొగలి వెంకటేశ్వర్లుకు మొక్క అందజేతస్తున్న జిల్లా టెలికాంబోర్డు డైరెక్టర్ తాటికొండ అనూష, తదితరులు

కొండాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గంలో మంజూరైన 21 బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ల నిర్మాణాలకు త్వరితగతిన స్థలం కేటాయించాలని జిల్లా టెలికాం బోర్డు డైరెక్టర్ తాటికొండ అనూష జాయింట్ కలెక్టర్ మొగలి వెంకటేశ్వర్లును కోరారు. మంగళవారం ఆమె నెల్లూరు కలెక్టరేట్‌లోని జేసీ కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టవర్ల నిర్మాణాలకు స్థలాన్ని కేటాయిస్తూ పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరానన్నారు.


ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి



గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు

దగదర్తి(బిట్రగుంట), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆర్థిక, ఆరోగ్యాభివృద్ధికై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు సూచించారు. దగదర్తి మండలం తడకలూరు పంచాయతీ ఎస్టీకాలనీలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి అన్వేష్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఇటీవల దిత్వా తుఫాన్ నేపథ్యంలో సైక్లోన్ రిలీఫ్ సెంట్రలకు తరలించిన గిరిజనులకు ప్రభుత్వం అందచేసిన నగదుపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య విషయంలో అశ్రద్ధగా వ్యవహరించకూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు.

ఆర్టీసీకి 130 ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేత



ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేస్తున్న డాక్టరు నవీన్

కందుకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కందుకూరు డిపోలో ఉన్న ఆర్టీసీ బస్సులన్నింటిలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో పట్టణంలోని ప్రణవి చిన్నపిల్లలు, కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టరు నవీన్ 130 ఫస్ట్ ఎయిడ్ కిట్లును బహూకరించారు. మంగళవారం డీఎం రావూరి శ్రీనివాసులుకు వీటిని అందజేశారు. ఇవి ప్రయాణికులకు అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు.

జిల్లా న్యాయాధికారిగా ప్రతిమ



నెల్లూరు (లీగల్), డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయాధికారికిగా నెల్లూరు నగరానికి చెందిన తిరువళ్లూరు ప్రతిమను ఎంపిక చేస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె 2003లో న్యాయశాస్త్రం పట్టా పుచ్చుకున్నారు. అప్పటి నుంచి నెల్లూరు బార్ అసోసియేషన్‌లో మెంబరుగా చేరి న్యాయవాద వృత్తిని కొనసాగించారు. 2020లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణురాలయ్యారు. ఆమెకు మొదటి పోస్టింగ్‌ను ప్రకాశం జిల్లా పరుచూరులో వేశారు. 2023లో నెల్లూరు నగరానికి బదిలీ అయి మొదటి తరగతి స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్నారు. ఇటీవల హైకోర్టు వారు జిల్లా న్యాయాధికారి పోస్టులకు నిర్వహించిన పరీక్షలు రాసి, మంచి మార్కులు సాధించి ఈ పదవికి ఎంపిక అయ్యారు. ప్రతిమ జిల్లా న్యాయాధికారి పదవికి ఎంపిక కావడం పట్ల ఆమె సహచరులతో పాటు పలువురు న్యాయవాదులు ఆమెను అభినందించారు.





వర్షం తగ్గినా... తగ్గని వరద !

ఈనెల ప్రారంభంలో జిల్లాను తుఫాన్ వర్షాలు కుదిపేశాయి. ఆ వర్షాలకు ఇబ్బందులు పడిన జనం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. రైతులు పంటలు కోల్పోయి ఎంతో నష్టపోయారు. ఆ నష్టాల నుంచి వారు కూడా బయటపడుతున్నారు. అయినా కొన్ని ప్రాంతాల్లో నేటికీ వర్షపునీరు తగ్గలేదు. దీంతో ఆ ప్రాంత వాసులు అష్టకష్టాలు పడుతున్నారు. పొట్టేపాలెం వద్ద ఇంకా నెల్లూరు చెరువు కలుజులు పారుతున్నాయి. అలాగే అక్కడ వేసిన లేఅవుట్ నదిని తలపిస్తున్నది. ఆ లేఅవుట్ నిర్మించిన ఇళ్లు కూడా నీట మునిగాయి. ఆలేవుట్‌లోని నిర్మాణాలు సముద్రంలో ఉన్నట్లుగా అనిపిస్తున్నాయి.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, నెల్లూరు

రెండు కార్ల ఢీ : ఏడుగురికి తీవ్ర గాయాలు





కాకుటూరు సమీపంలోని హైవేలో బోల్తాపడి నుజ్జునుజ్జయిన కార్లు,క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళ్తున్న 108 సిబ్బంది

వలేటివారిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మలుపు వద్ద వేగంగా వెళ్తూ రెండుకార్లు ఢీకొనగా, ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి.ఈ సంఘటన మండలంలోని బొంతవారిపాలెం సమీపంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వీవీపాలెం హైస్కూల్‌లో పనిచేస్తున్న హెచ్‌ఎం కమల్‌కుమార్, టీచర్లు కత్తి ఐజాక్, బ్రహ్మయ్య, రామారావు, ఎన్‌వీఎల్ కుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వారితోపాటు మరోకారులో ఉన్న రావినూతల సూర్యకు, శానంపూడికి చెందిన డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. టీచర్లు కందుకూరు నుంచి వీవీపాలెం హైస్కూల్‌కు కారులో వెళ్తున్నారు. అదే సమయంలో నూకవరం నుంచి కందుకూరు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వీవీ పాలెం 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ మరిదినాయుడు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలువాయి ప్రజల కోరిక సీఎం దృష్టికి.. : కురుగొండ్ల



ఎమ్మెల్యే కురుగొండ్లకు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

కలువాయి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలన్న మండల ప్రజల కోరికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుపోతానని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండల జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు, వ్యాపారులు, ప్రజలు మంగళవారం వెంకటగిరిలో ఎమ్మెల్యేను కలిసి విన్నతిపత్రం అందజేశారు. కలువాయిని తిరుపతి జిల్లాలో కలిపితే ప్రజలకు దూరాభారంతోపాటు భవిష్యత్తులో సాగునీటి సమస్యలు, వైద్యపరమైన ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని జేఏసీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. నెల్లూరుతో కలువాయి వాసులకు ఎంతో అనుబంధం ఉందని ఇది భవిష్యత్తులో కూడా కొనసాగాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నట్లు వారు చెప్పారు. ప్రజల ఆవేదనను సీఎం దృష్టికి తీసుకుపోయి కలువాయిని నెల్లూరులో ఉంచేదానికి తన వంతు ప్రయత్నం చేస్తానని జేఏసీ నాయకులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

● రిలే నిరాహార దీక్షలు

కలువాయిని తిరుపతి జిల్లాలో కలపొద్దు కోరుతూ మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో బస్టాండులో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. రాజకీయ నాయకులు. వ్యాపారులు, ప్రజలు ఉదయం నుంచి నిరాహార దీక్షలో కూర్చున్నారు. ప్రజల గోడు ప్రభుత్వం పట్టించుకునే వరకు ఈ దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించి నెల్లూరులోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పరిష్కారం దిశగా సాదా బైనామాలు

● వీడనున్న చిక్కుముడి ● ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడో కొనుగోలు చేసిన భూములపై నేటికీ పూర్తిస్థాయి హక్కులు కల్పించుకోలేక పలువురు రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. అప్పట్లో రిజిస్ట్రేషన్ల భారం భరించలేక కొంతమంది కేవలం స్టాంపు పేపర్లు, తెల్లకాగితాలపై అగ్రిమెంట్లు చేసుకొని భద్రపరుచుకున్నారు. అలాంటి కాగితాలనే అధికారికంగా సాదాబైనామాలుగా వ్యవహరిస్తున్నారు. వాటినే సర్వహక్కులుగా భావించిన పూర్వీకులు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. అందుకు భిన్నంగా నిన్న,మొన్నటి వరకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పట్టాదారు పాసు పుస్తకాల కోసం కార్యాలయాలకు పరుగులు తీసిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారులు చెప్పేవారు. రైతులు చేసేదేమి లేక వెనుతిరగాల్సి వచ్చేది.ఈ పరిస్థితుల నేపథ్యంలో సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం తీసుకొచ్చిన తాజా ఉత్తర్వులతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.



తెల్లకాగితాలపై రాసుకున్న అగ్రిమెంటు

● సాదాబైనామాలపై వినతులు

ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వేలోనూ అధికశాతం వినతులు సాదాబైనామాలకు చెందినవే. వాటిపై దృష్టి సారిస్తే దాదాపుగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయి. కనీసం ఆన్‌లైన్ చేయించుకొనే అవకాశం కూడా లేకపోవడంతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు.అంతేగాక గత భూ రికార్డులను ఆధారంగా చేసుకొని హక్కుదారుల వారసులకే పట్టాలు అందచేస్తామని అధికారులు చెబుతుండడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

● చిగురిస్తున్న ఆశలు

ఈ నేపథ్యంలో ఏళ్ల తరబడి విసుగెత్తిపోయిన రైతులు ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ముందుకు సాగుతున్నారు. 2024 జూన్ 15కంటే ముందుగా అగ్రిమెంట్లు చేసిన రైతులకు ఈ నిర్ణయం వరంగా మారనుంది. అలాంటి వారికి 2027 డిసెంబరు 31 వరకు దరఖాస్తు చేసేకొనే అవకాశం కల్పించింది. వీటికితోడు గతంలో సమస్య పరిష్కారానికి ఏడాదిగా ఉన్న గడువును కేవలం 90 రోజులకే కుదించింది. ఈ నేపథ్యంలో 2.5 ఎకరాల మాగాణి, 5 ఎకరాల్లోపు మెట్ట భూములు కలిగిన రైతులు ఎలాంటి స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా వెసులుబాటు కల్పించింది. ఎలాంటి పత్రాలు లేకపోయినా దరఖాస్తుదారుడి అనుభవంలో భూములు ఉంటే సమగ్ర విచారణతో హక్కులను నిర్ధారించి న్యాయం చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో చిన్న, సన్నకారు రైతులు తమకు మంచి రోజులు వచ్చాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతు పక్షపాతిగా చెప్పుకొనే సీఎం చంద్రబాబు హయాంలోనే నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందనే ధీమాతో రైతులు ఉన్నారు.



సాగులో ఉన్న సాదా బైనామా భూములు

రాష్ట్ర కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా పెదకూరపాడులో బుధవారం నుంచి జరిగే 51వ ఆంధ్రరాష్ట్ర జూనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పీ హరీష్, గంటా సతీష్ తెలిపారు. మంగళవారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. బాలుర విభాగంలో 14 మందిని, బాలికల విభాగంలో 14 మందిని ఎంపిక చేశామని చెప్పారు. రాష్ట్ర పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు పీ శ్రీనాథ్, పీ హరికృష్ణ, మేనేజర్లు పీ సందీప్, ఆర్ లత పాల్గొన్నారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జిల్లాల విభజనతో జలవివాదం : సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్,తదితరులు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పునర్విభజన పేరుతో కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలిపితే జలవివాదం ఏర్పడే అవకాశం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం జిల్లా విభజన సందర్భంగా తీవ్రమైన అన్యాయం చేసిందని, శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం, శ్రీసిటీ, సిలికా గనులు వంటివి పక్క జిల్లాకు వెళ్లాయన్నారు. ఇప్పుడు కండలేరు జలాశయం తిరుపతి జిల్లాకు వెళ్లిపోతే జలవివాదం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఈ చర్యలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మంగళం పుల్లయ్య, రెహనాబేగం తదితరులు పాల్గొన్నారు.

సైదాపురం రోడ్లకు 12.4 కోట్లు మంజూరు

గూడూరు అర్బన్(సైదాపురం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రోడ్ల నిర్మాణాలకు రూ 12.4 కోట్లు మంజూరైనట్లు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు తెలిపారు. మంగళవారం స్థానిక సొసైటీ భవనంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైదాపురం, పోదలకూరు రోడ్డుకు రూ 10 కోట్లు, అలాగే ఊటుకూరు, పెరుమాళ్లపాడు రోడ్డుకు రూ 2.4 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు వివరించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు అమ్మినేని సుబ్రమణ్యం నాయుడు, సురేంద్ర, రమణయ్య నాయుడు, కోటయ్య నాయుడు, రాఘవరెడ్డి, కె వెంకటటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● మోడరన్ విలేజ్‌గా వెంకన్నపురం ● రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య

● ప్రజా సమస్యలపై అధికారులతో కలెక్టర్, కృష్ణయ్య సమీక్ష

కొడవలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పీ. కృష్ణయ్య అన్నారు. మండలంలో వెంకన్నపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన కలెక్టర్ హిమాన్షుశుక్లాతో కలిసి మంగళవారం సందర్శించారు. వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ట్రస్ట్ హాలులో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, డ్వామా, తదితర శాఖల్లో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రానికి పెద్దఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, దీంతో నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఆర్థికంగా రాష్ట్రం పురోగమిస్తుందన్నారు. చదువుకున్న యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, వారికి విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వెంకన్నపురం గ్రామాన్ని అధునాతనంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. త్వరలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు.



అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య, కలెక్టర్ హిమాన్షు శుక్లా

● సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా శ్రమించాలి: కలెక్టర్

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి. కృష్ణయ్యను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఎంపీడీవో సుబ్బారావు, తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్స్

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవు : డీఎంహెచ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డెమో కనకరత్నం, పక్కన డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, వైద్యాధికారులు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ అపరషన్స్ నిర్వహిస్తున్నామని, ఇందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై జిల్లా స్థాయి సలహా సంఘం సమావేశం మంగళవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో జరిగింది. ఆమె మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడన్నారు. అలా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యుల సిఫార్సు లేకుండా స్కానింగ్ తీయరాదని చెప్పారు. ఆర్‌ఎంపీలు స్కానింగ్‌కు సిఫార్సు చేయరాదని, అలా చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. స్కానింగ్ చేసిన ప్రతీ గర్భిణి వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం జిల్లా సలహా మండలి చైర్మన్ సీహెచ్ కిరణ్ మాట్లాడుతూ భ్రూణ హత్యలు నివారించే విధంగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ స్వర్ణలతరెడ్డి, డాక్టర్ నానాజీరావు, డాక్టర్ ఉమామహేశ్వ రి, డెమో కనకరత్నం, ఎన్జీవోలు కవితారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై నిర్లక్ష్యాన్ని సహించేదిలేదు

● గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి ● జిల్లాలో పలు స్టేషన్ల తనిఖీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిహెచ్చరించారు. జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, పాత నేరస్థులు, పెండింగ్ కేసులు, వరుసగా జరుగుతున్న నేరాలపై ఐజీ ఆరా తీశారు. నేరాలు అధికంగా జరుగుతున్న పోలీసుస్టేషన్ అధికారులపై ఐజీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

● స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

జిల్లాలో కొంతకాలంగా జరుగుతున్న వరుస నేరాల దృష్ట్యా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మంగళవారం జిల్లాకు వచ్చారు. ముందుగా నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్‌ను ఐజీ ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో వరుసగా జరుగుతున్న నేరాలు, సిబ్బంది గురించి తెలుసుకున్నారు. స్టేషన్‌లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సిబ్బందిని వీఆర్‌కు పంపాలని ఆదేశించారు. స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌పై ఐజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌ను తనిఖీలు చేశారు. స్టేషన్ పరిధిలో సవంత్సరం కాలంగా నమోదైన కేసులు, సిబ్బంది వివరాలు, ఇటీవల జరిగిన పెంచలయ్య హత్య కేసు, గంజాయి ముఠాల వివరాలపై ఆరా తీశారు. అనంతరం రాహూరు స్టేషన్‌ను తనిఖీ చేశారు. తదుపరి పెంచలకోనలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసు కార్యాలయంలో ఐడీ పార్టీ సిబ్బంది, జీడీలు, క్రైమ్ పార్టీలతో సమావేశమయ్యారు.



వేదాయపాళెం స్టేషన్ పోలీసులతో మాట్లాడుతున్న ఐజీ త్రిపాఠి

● శాంతి భద్రతల పరిరక్షణకు ప్రణాళిక

ఈ సందర్భంగా ఐజీ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. గంజాయి సేవించే వారు, అమ్మేవారిపై కఠినంగా కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, రోడ్డు భద్రత నియమాల గురించి వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సోషల్ మీడియా ద్వారా మహిళలను, వ్యాపారులను, సెలబ్రిటీలను బ్లాక్‌మెయిల్ చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఐజీ వెంట ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది ఉన్నారు.

పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు

● ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ వెంకటసుబ్బయ్య ● 'కౌశల్' విజేతలకు బహుమతులు



బహుమతులు పొందిన విద్యార్థులతో అధికారులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పోటీతత్వంతో రాణిస్తేనే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం కౌశల్ పరీక్షల జిల్లాస్థాయి విజేతల బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకు కౌశల్ పోటీలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. వీటితో పోటీతత్వం, ప్రశ్నించే గుణం అలవాటవుతాయన్నారు. కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ భక్తవత్సల బాబు నాయుడు మాట్లాడుతూ పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్, రీల్స్ తయారీ అంశాల పై పాఠశాల స్థాయి, జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ పోటీలు నిర్వహించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 700 మందికిపైగా విద్యార్థులు పాల్గొనగా ఆరుగురు ప్రథమ, ఆరుగురు ద్వితీయ స్థానాలను సాధించారని తెలిపారు.

విజేతలు వీరే...

జిల్లాస్థాయి కౌశల్ పోటీ క్విజ్ విభాగంలో బ్రహ్మదేవం జడ్పీ పాఠశాలకు చెందిన నిహారిక, బ్రాహ్మణక్రాకకు చెందిన ధరిత్రి, వీ రేవంత్ కుమార్ ప్రథమ స్థానం, నెల్లూరులోని కేఎన్ఆర్ పాఠశాలకు చెందిన జోష్ణవి, బ్రహ్మదేవంకు చెందిన చందన్ పవన్, వింజమూరుకు చెందిన గురు విఘ్నేష్ ద్వితీయ స్థానం సాధించారు. పోస్టర్ విభాగంలో బ్రాహ్మణక్రాక పాఠశాలకు చెందిన జాన్‌వెస్లీ, మన్విత ప్రథమ, తరుణవాయికి చెందిన ప్రవీణాష్, మనుబోలుకు చెందిన శ్రీకావ్య ద్వితీయ స్థానం సాధించారు. రీల్స్ విభాగంలో వింజమూరుకు చెందిన వీరేంద్రరెడ్డి ప్రథమ, అమ్మవారి పాళేనికి చెందిన నవదీప్ ద్వితీయ స్థానం సొంతం చేసుకున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.1500, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.1000 చొప్పున నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అంద చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంవో సుధీర్‌బాబు, కౌశల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ హరిబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ముత్తుకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మదేవం సమీపంలోని బుడ్డి డ్రైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం (45) మంగళవారం లభ్యమైంది. బుడ్డి డ్రైన్‌కు మరమ్మతులు చేస్తుండగా కాలువ మధ్యలో మృతదేహం తేలడంతో స్థానికులు వీఆర్వోకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ముత్తుకూరు ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మూడు, నాలుగు రోజుల క్రితం కాలువలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. సమాచారం తెలిసిన వారు పోలీసులకు వివరాలు తెలియజేయాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాముకాటుతో వ్యవసాయ కూలీ మృతి

జలదంకి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలపాలెంలో పాముకాటుతో వ్యవసాయ కూలీ షైనంపాటి రాజశేఖర్(42) మృతి చెందారు. మంగళవారం ఉదయం పొలంలో వరినాట్లు పనులకు వెళ్లిన రాజశేఖర్ నారుమడి కుప్పల నుంచి వరి నారు కట్టలు తీసుకెళ్లే క్రమంలో కట్టల్లో ఉన్న పాము రాజశేఖర్ కాలుపై కాటేసింది. తోటి కూలీలు కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

రేపు విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పీవోఏ చట్టం అమలు కోసం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం, మాన్యువల్ స్కావెంజర్స్ కమిటీ సమావేశాలు గురువారం జరుగుతాయని ఎస్సీ సంక్షేమశాఖాధికారి శోభారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశాలు కలెక్టర్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరుగుతాయని తెలిపారు.

విద్యుత్తు ఏడీఈ రమేష్‌బాబుకు పదోన్నతి

కోవూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్తు ఏడీఈ రమేష్‌బాబు అనంతపురం జిల్లా పుట్టపర్తి డిప్యూటీ ఇంజనీర్‌గా పదోన్నతి పొందారు. రమేష్‌బాబు ఇనమడుగు ఏఈగా విద్యుత్తుశాఖలో చేరి అంచెలంచలుగా డీఈగా పదోన్నతి పొందారు. విడవలూరు మండలం ఊటుకూరుకి చెందిన ఆయన చాలాకాలం కోవూరు సర్కిల్‌లో పనిచేశారు.